# భగవద్గీత

తెలుగు సేత : డా॥ పి.కృష్ణయ్య

ఎమెస్కో

**BHAGAVADGITHA**
*Author :* Dr. P.KRISHNAIAH

**భగవద్గీత**
**డా.పి.కృష్ణయ్య**

మొదటి ముద్రణ : **ఫిబ్రవరి, 2021**

మూల్యం : **రూ. 100/-**

ప్రింటర్స్
**రైతునేస్తం ప్రెస్**
హైదరాబాద్

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూ కాలనీ
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ
హైదరాబాద్ - 500 029
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

బ్రాంచ్ ఆఫీసు
**ఎమెస్కో బుక్స్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : emescovja@gmail.com
e-mail: sahithi.vja@gmail.com

## అంకితం

ఈ రచనను
అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు
కలియుగ ప్రత్యక్ష దైవం
శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదపద్మాలకు
భక్తిప్రపత్తులతో సమర్పిస్తున్నాను.

**– డా॥ పి. కృష్ణయ్య**
18-2-2021

# సందేశం

सत्यमेव जयते

भारत के उपराष्ट्रपति

VICE-PRESIDENT OF INDIA

**డా|| పి. కృష్ణయ్య గారికి,** నమస్తే

మీ కలం నుంచి జాలువారిన భగవద్గీత తెలుగు సేతను పరిశీలించాను.

కర్తవ్య విమూఢుడైన అర్జునుడికి జ్ఞానం బోధించి, కర్తవ్యం వైపు నడిపించిన భగవద్గీతను ఈతరం యువతకు అర్థమయ్యే విధంగా సరళ తెలుగులో, గేయ రూపంలో తీసుకువచ్చిన మీ ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను.

భగవద్గీతను కొంచెమైనా అర్థం చేసుకున్న వారికి భయం పోతుందని జగద్గురు ఆదిశంకరుల వారు భజగోవిందంలో తెలియజేయగా, భారతీయ యువతను ఉత్తేజ పరిచిన వివేకానందుల వారికి సైతం భగవద్గీత మార్గనిర్దేశం చేసిందని స్వయంగా వారే తెలియజేశారు.

జాతిపిత మహాత్మ గాంధీ సైతం తమ ఆలోచనల్ని భగవద్గీత ప్రభావితం చేసిందని, గీతాపఠనం వల్ల తమకు ఆత్మజ్ఞాన ప్రాముఖ్యత, నిష్కామ కర్మ విధానం అలవడ్డాయని తెలియజేశారు. 80కి పైగా ప్రపంచ భాషల్లోకి అనువాదమైన భగవద్గీత యువతకు దిశానిర్దేశం చేస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఓ మాజీ ఐ.ఏ.ఎస్. అధికారిగా పుస్తకం ప్రారంభంలో స్ఫూర్తిదాయక కోణంలో భగవద్గీత పరిచయం పేరిట వివరణ అందించడం బావుంది. నేటి యువత భగవద్గీత గురించి తెలుసుకోవడానికి సైతం అది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశిస్తున్నాను.

(ముప్పవరపు వెంకయ్యనాయుడు)

న్యూఢిల్లీ,

26 జనవరి 2021.

# ముందు మాట

**– డా॥ కె.అరవిందరావు**
రిటైర్డ్ ఐపీయస్
మాజీ డీజీపీ, ఆంధ్రప్రదేశ్

మిత్రులు, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ శ్రీ కృష్ణయ్యగారు భగవద్గీతను సులభమైన భాషలో గేయశైలిలో సామాన్య పాఠకునికి అందచేయడం ముదావహం. భగవద్గీత సామాన్యంగా కొరుకుడుపడని పుస్తకము. వేదాలసారం ఉపనిషత్తులు, ఉపనిషత్తుల సారం భగవద్గీత. వేదాలు అనేక స్థాయిల్లో అనేక కోరికలతో ఉన్న వ్యక్తులకు వారి వారి కోరికల్ని తీర్చుకునే ఉపాయాల్ని సూచిస్తాయి. పూజలు, పుణ్యం, ఈలోకంలో సుఖాలు, పరలోకంలో సుఖాలు, ఉత్తమ జన్మలూ అనేవి అందరూ కోరేవే. నూటికి తొంభై శాతం ఈస్థాయిలోని వారే. విషయమేమిటి అని ఆలోచించి తెలుసుకునేవారు అతి కొద్దిమంది. వారికి వేదాంతశాస్త్రం అవసరం. అందుకే వేదాల్లో కర్మకాండ, అనగా యజ్ఞాలు మొదలైన వాటి గురించి ఎక్కువగా ఉంటుంది. అలాగే తన కర్తవ్యాన్ని గూర్చి అవగాహనలేనివాడికి, కర్తవ్యాన్ని బోధించడానికి ధర్మం యొక్క స్వరూపాన్ని విశాలమైన దృష్టికోణం నుండి వివరించాల్సిఉంటుంది. ఆలోచించేవాడికి తత్త్వాన్ని చెప్పాల్సి ఉంటుంది.వేదం దీన్నిగురించి కూడా చెబుతుంది. ఆ విషయాన్నే కృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు.

యుద్ధరంగంలో తన కర్తవ్యాన్ని గురించి, క్షత్రియ ధర్మాన్ని గురించి సందేహంలో పడిన అర్జునుడికి కర్తవ్యబోధ చేయడం కృష్ణుడి తక్షణ కర్తవ్యం. మనం ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే యుద్ధం చేయమని కృష్ణుడు అర్జునుణ్ణి ప్రోత్సహించడం లేదు. అదివరకే సర్వసన్నద్ధుడై, అనేక రాజుల్ని సంప్రదించి, సైన్యాల్ని సమకూర్చుకుని వచ్చిన అర్జునుడే అకస్మాత్తుగా బంధుప్రీతితో ధర్మాన్ని

విస్మరిస్తాడు. అతని బుద్ధిలో కల్గిన మోహాన్ని తొలగించడం మాత్రమే కృష్ణుడు చేసిన పని. ఆ మోహం తొలగించాలంటే అతనికి ధర్మం యొక్క స్వరూపాన్ని వివరించాలి. సృష్టిలో మంచి చెడుల మధ్య పోరాటం అనాదిగా జరుగుతున్నదే. చెడుని నిర్మూలించడం భగవంతుని ప్రణాళికలో ముఖ్య విషయం. కృష్ణుడు కేవలం అర్జునుడికి ఆ సమయంలో చెప్పాల్సిన క్షత్రియ ధర్మాన్ని మాత్రమే కాక శాశ్వతంగా విశ్వానికి ఉపయోగించే సూత్రాల్ని చెప్పాడు.

సృష్టిలో మూడు అంశాలున్నాయి. అవి సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణాలు. సృష్టిలోని ప్రతి ప్రాణమున్న, ప్రాణంలేని అన్ని పదార్థాల్లోనూ ఈ మూడు గుణాలూ ఏదో ఒక నిష్పత్తిలో ఉంటాయి. ఒక్కొక్క గుణం యొక్క ఆధిక్యాన్ని బట్టి వ్యక్తి లక్షణాలుంటాయి. సత్త్వగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి సత్యము, జ్ఞానము, సంతృప్తి మొదలైన లక్షణాలు కల్గి ఉంటాడు. రజోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి ఇతరులపై ఆధిపత్యం చలాయించడం లేదా సంపదను పోగుచేయడం అనే పట్టుదలతో ఉంటాడు. తమోగుణం ప్రధానంగా ఉన్న వ్యక్తి సొంతంగా నిర్ణయం తీసుకునే ఓపిక లేకపోవడం, సోమరితనం మొదలైన లక్షణాలతో ఉంటాడు. దీని ఆధారంగా మనుషుల్ని నాలుగు వర్ణాలుగా విభజించారు.

వ్యక్తి స్వభావాన్ని బట్టి సమాజం అతని కర్మను (చేయాల్సిన పనిని) నిర్ణయిస్తుంది. క్షత్రియుడి కర్మ (విధి)  ధర్మాన్ని రక్షించడం. అలా చేయడం వల్లనే అతడు సృష్టి విధానానికి (cosmic scheme) అనుగుణంగా నడుచుకున్నట్లు అవుతుంది. సత్త్వగుణము, సంతుష్టి ఉన్నవాడు యుద్ధానికి వెళ్ళమంటే వెళ్ళలేడు. అలాంటి వ్యక్తికి వేదాధ్యయనం, అధ్యాపనం, సరళజీవనశైలి నిర్ణయించబడింది. ఈ విధంగా గుణాన్ని బట్టి నిర్ణయించబడిన కర్మయే స్వభావజం కర్మ, స్వకర్మ, స్వధర్మం అని, అలాంటి కర్మ చేస్తున్నప్పుడే దైవవిధానానికి తోడ్పడతామని శ్రీకృష్ణుడు 18వ అధ్యాయంలో చాల వివరంగా చెప్పాడు.

ఈ స్వభావ కర్మను కూడా ఎలా చేయాలి? మనిషి కోరదగిన వాటిలో అన్నిటికంటే గొప్పది మోక్షం. దాన్ని పొందటానికి అడ్డంకులు లేకుండా మనిషి జీవితం, అతను చేసే కర్మలు (పనులు) ఉండాలి. ప్రతి కర్మకూ ఒక ఫలం (ఫలితం) ఉంటుంది. ఇది పుణ్యపాపాల రూపంలో ఉంటుంది. పుణ్యం గానీ,

పాపం గానీ మరొక జన్మకు కారణం అవుతుంటాయి. జన్మ అంటే మరణం కూడా ఉన్నట్లే. ఈ జన్మ–మరణం అనే చక్రం నుండి విడుదల పొందడాన్నే మోక్షమనీ, అదే మనిషి సాధించాల్సిన లక్ష్యమనీ ఉపనిషత్తులు చెబుతాయి. కానీ మనం సాధారణంగా పుణ్యాన్ని కోరుకుంటాం. పుణ్యం కూడా మనిషిని జనన–మరణ చక్రంలోకి పడవేస్తుంది. పాపం ముళ్ళ ఇనుప సంకెల అయితే పుణ్యం బంగారు సంకెల లాంటిది. రెండూ మనిషిని బంధించేవే. అందువల్ల కృష్ణుడు పుణ్యాన్ని కూడా కోరకుండా తన విధిని ఈశ్వరార్పణ బుద్ధితో చేయమని చెబుతాడు. క్షత్రియ స్వభావం రజోగుణం. అతని విధి అధర్మాన్ని ఎదుర్కోవడం. దీన్ని భగవంతుడిచ్చిన కర్తవ్యంగా భావించి నిర్వహించాలి. అలాగే ఇతరులు కూడా. ఈవిధంగా భగవంతునికి అర్పించే భావనతో కర్మను చేస్తే ఆ కర్మ ఫలం (పుణ్యం/పాపం) మన ఖాతాలోకి పడదు. ఈ భావనతో కర్మ చేయడమే కర్మయోగం. దీనివల్ల మనిషికి లభించేది చిత్తశుద్ధి, మనస్సు యొక్క పవిత్రత.

ఈ పవిత్రతను సాధించడానికి మరికొన్ని ఉపాయాల్ని గీత చెబుతుంది. అవి ఆత్మ సంయమనం (మనస్సును, ఇంద్రియాల్నీ అదుపులో పెట్టుకోవడం), ధ్యానయోగం (మనస్సును ఒక విషయంపై నిలపే ఉపాయం), భక్తి (ఒకానొక ఇష్టదేవతపై మనస్సు నిలిపి ప్రార్థించడం) అనే మూడు ఉపాయాలు. ఇవన్నీ మనిషి యొక్క మనస్సులోని కాలుష్యాన్ని (రాగద్వేషాలు, స్వార్థం మొదలైనవి) తొలగించి మనస్సును పవిత్రం చేయడానికి ఉపయోగిస్తాయి.

ఒకవైపు ఇలాంటి చిత్తశుద్ధిని సాధిస్తూ మరొకవైపు తత్త్వాన్ని తెలుసుకొమ్మని గీత చెపుతుంది. చిత్తశుద్ధి లేనివాడికి వేదాంతశాస్త్రం అనుభవంలోకి రాదు. ఉపనిషత్తుల సారమైన గీతను మొట్టమొదటగా శ్రవణం చేయాలి. శ్రవణం అంటే శ్రద్ధగా ఒక విషయాన్ని విని అర్థం చేసుకోవడం. గురువు వద్దనుండి నేర్చుకోవడం ఉత్తమమైన పద్ధతి. అది వీలులేనపుడు ఇంటర్నెట్ ద్వారా తెలుసుకోవడంలో తప్పులేదు.

ఒక క్రైస్తవ పాస్టరు బైబిల్ని తప్పకుండా చదువుతాడు, ఆ మత అనుయాయులకు చదివి వినిపిస్తాడు. మౌల్వీ ఖురాన్‌ను తప్పకుండా చదువుతాడు, చదివి వినిపిస్తాడు. సామాన్య హిందువుకు భగవద్గీతను చెప్పే వ్యవస్థను

తయారుచేయకపోవడం హిందూధర్మం యొక్క అతిగొప్ప బలహీనత. టీవీ ప్రవచనాల్లో ముఖ్యంగా పూజలూ, పారాయణాలూ మొదలైనవాటి గూర్చి వింటాముగాని తత్త్వం గురించి అతి తక్కువగా వినిపిస్తుంది. పూజలు, పుణ్యాన్ని సంపాదించడమూ అనేవి అతని ఆత్మవికాసానికి తోడ్పడటం లేదు.

వేదాల్లో ఉన్న విషయాన్ని అప్పటి సామాన్య శ్రోతకు చెప్పడానికి శ్రీకృష్ణుడు ప్రయత్నించినట్లే మిత్రులు కృష్ణయ్యగారు ఇప్పటి పాఠకులకు సులభమైన భాషలో అందించారు. సంస్కృతం లోని శ్లోకాన్ని వివరించి విశ్లేషించి చెప్పడం సులభము. కాని తక్కువపదాలలో అర్థాన్నంతా చెప్పడం చాల కష్టము. కృష్ణయ్య గారు ఈ పని చేయడంలో సఫలురయ్యారు. వారికి భాషపై మంచి పట్టు ఉంది, తెలుగు నుడికారంపై అధికారం ఉంది, గేయరచనలో అనుభవం ఉంది. ఈ పుస్తకాన్ని శ్రవణ మాధ్యమంలోనూ శ్రోతకు అందించాలని వారి అభిలాష. భారతీయ సిద్ధాంతంలోనివిషయాల్ని సామాన్య పాఠకునికి అందించినందుకు వారు ఎంతో అభినందనీయులు.

# నివేదన

**- డా॥ సముద్రాల లక్ష్మణయ్య,**
తిరుపతి

**తదిదం గీతాశాస్త్రం**
**సమస్త వేదార్థ సార సంగ్రహభూతమ్,**

అని శ్రీ శంకర భగవత్పాదులు గీతను గురించి చెప్పారు. అన్ని వేదార్థాల సార సంగ్రహమే గీత అని పై వాక్యము యొక్క భావం.

కర్మ-భక్తి-ధ్యాన్య-జ్ఞాన యోగాలు క్రమంగా మోక్ష సౌధానికి సోపానాలు అని గ్రహించాలి. ఈ యోగాలను గురించి వేదాలూ వివరించాయి. గీత కూడా నిరూపించింది. వేదాలు అనంతాలు కాబట్టి వాటి నుండి యోగ స్వరూపాన్ని గ్రహించడం క్లేశావహం. భగవద్గీత అలాకాక సంగ్రహంగానూ, సమన్వయాత్మకంగానూ, సులభంగా గ్రహించడానికి వీలుపడునట్లూ కర్మాది యోగాలను ప్రతిపాదించింది. కాబట్టి ముముక్షులైనవాడు యోగ స్వరూపాన్ని గీత నుండి చక్కగా గ్రహించవచ్చు.

గీతలో చెప్పినవి సార్వకాలిక సత్యాలు. అవి ఒక వర్ణానికో, వర్గానికో, లింగానికో, కులానికో పరిమితాలు కావు. "పండితాస్సమదర్శినః" అని గీత ప్రబోధించింది. సమదృష్టి పాండిత్యానికి చక్కని నిదర్శనం. అపండితుడనగా అజ్ఞాని. వాడికి సమదృష్టి ఉండదు. అతడు గీతా పఠనానికి గూడా వర్ణవర్గాది భేదాలను పాటించాలంటాడు.

గీత ఇంచుమించు 5 వేల సంవత్సరాలకు పూర్వం బోధించిన గ్రంథం. ఇంత పురాతన పుస్తకం ఈ కాలానికి అనువర్తిస్తుందా? అని సంశయం కలుగవచ్చు. మహాత్మాగాంధీ తన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సముచిత సమాధానం గీతలో లభించిందని చెప్పారు. దివ్యజ్ఞాన సమాజ స్థాపకులు శ్రీ శివానంద

స్వాములవారు శ్రీ మలయాళ స్వాముల వారి జీవితాన్ని (1885-1962) భగవద్గీతకు భాష్యంగా అభివర్ణించారు. ఇలా ఎందరో మహనీయులు ఈ కాలంలో గూడా భగవద్గీతను చేపట్టి దానిని మార్గదర్శకంగా స్వీకరించి కృతకృత్యులయ్యారు.

గీతకు అనేకులు పలు భాషలలో వ్యాఖ్యలు వ్రాశారు. గద్య పద్య రూపాలలో అనువాదాలు గూడా అత్యధిక సంఖ్యలో వెలువడ్డాయి.

ప్రస్తుతం గేయ కవితారూపంలో డా॥ పి.కృష్ణయ్యగారు అనువదించిన గీత పాఠకుల కరకమలాలను అలంకరించియున్నది. ప్రభుత్వంలో సమున్నత స్థాయికి చెందిన సేతలకు ఉపకరించే పరీక్షలలో ఉత్తీర్ణులై జిల్లా కలెక్టర్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు.

వారు నెల్లూరు జిల్లా నార్త్ రాజుపాలెంలోని ప్రాచ్య పాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు యాదృచ్ఛికంగా ఆ పాఠశాలలోనే సంస్కృతాధ్యాపకుడుగా పనిచేసే సదవకాశం నాకు లభించినందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను.

డా॥ కృష్ణయ్యగారు తమ విశ్రాంత జీవితాన్ని గీతానువాదం వంటి పవిత్ర కార్యాలకు వినియోగించడం అభినందనీయం. ఇంతకుముందే తమిళం నుంచి మహోత్కృష్ట గ్రంథమైన 'తిరుక్కురల్' అనువదించి వీరు అభిజ్ఞుల ప్రశంసలందుకొని యున్నారు.

గీత ఎంతో విశాలమైన భావంతో కూడిన సంస్కృత గ్రంథం. గీతను అనువదించడం ధీమాన్యులకు తప్ప సామాన్యులకు సాధ్యం కాని పని. 32 అక్షరాల అనుష్టుప్ శ్లోకాన్ని తెలుగులోకి పరిమితాక్షరాలు కల గేయ కవితగా అనువదించడం భగవదనుగ్రహ ఫలమే.

ఆత్మీయులు డా॥ కృష్ణయ్యగారిని ఆత్మోన్నతి కారకమైన ఒక మహత్తర కార్యాన్ని ఫలప్రదంగా నెరవేర్చినందుకు మనసారా అభినందిస్తున్నాను. ఈ రచన విస్తృత ప్రచారం పొందగలదని ఆశిస్తున్నాను. సర్వతోముఖాభ్యుదయం భగవంతుడు వీరికి కలిగించు గాక అని ప్రార్థిస్తున్నాను.

కృత్వానువాదం గీతాయా విఖ్యాతాయా మహీతలే
ఆంధ్ర్యాం మనోజ్ఞం కృష్ణార్యో జగామకృతకృత్యతామ్ ॥

# అభినందన

## గీతాకృష్ణుడు

"కృష్ణస్తు స్వయం భగవాన్" – అని ఆర్యోక్తి. సంపూర్ణావతారుడుగా కీర్తింపబడే శ్రీకృష్ణభగవానుడు ఎన్నో నామధేయాలతో భక్తలోకంలో కీర్తింపబడుతున్నాడు. ఆధ్యాత్మ చింతనాపరులు, భాగవతనిష్ఠులునైన శరణాగతులు మాత్రం ఆ ఆస్వామిని "గీతాకృష్ణుడు"గా ఉపాసిస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణ అధికారిగాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాక విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అనేక విశిష్ట పదవులలో సేవలందించిన ధర్మ పరిపాలనాదక్షులు శ్రీ పి.కృష్ణయ్యగారు. వీరి "శ్రీమద్భగవద్గీత–తెలుగుసేత" అనువాద గ్రంథం సరళంగా, సుందరంగా, సుప్రసన్నమైన అలతి అలతి పదాలతో తప్పక పాఠకలోకాన్ని అలరిస్తుందని నా భావన. సరళ మనోహరంగా సాగిపోయే శబ్దధారలతో వీరి అనువాద వచన గేయాలు పాఠకులకు గీతా పరమార్థాన్ని సులభంగా విశదీకరిస్తున్నాయి.

అర్జునునకు కురుక్షేత్ర సమర ప్రారంభంలో గీతాప్రబోధం చేసిన శ్రీకృష్ణభగవానుడు కానీ, ఆ భగవద్గీతను జ్ఞానభక్తి కర్మయోగ విజ్ఞాన గ్రంథాలతో మేళవించి సంగ్రథనం చేసిన వ్యాస మహర్షి కాని ఒక్క ప్రయోజనాన్ని తప్పక ఆశించి ఉంటారు. అదేమిటంటే ఈ గీతాతత్త్వం, సారాంశం సామాన్య మానవులకు సులభగ్రాహ్యం కావాలని. ఆ ధ్యేయం శ్రీ కృష్ణయ్యగారి అనువాదంతో సఫలీకృతమైనదని నిరాఘాటంగా చెప్పవచ్చు. ఒక ఐఏఎస్ అధికారిగా విశ్రాంతులైనా గానీ, పవిత్ర గృహస్థాశ్రమ ధర్మాలతో సఫలీకృత మనోరథులైనా గానీ, మానవ సమాజానికి ఒక అక్షరసేవగా ఈ గీతానువాద గ్రంథాన్ని అందించాలనే వారి పవిత్ర సంకల్పం అభినందనీయం !

**– డా॥ మేడసాని మోహన్**

# స్ఫూర్తి -స్ఫూర్తి కారకులు

ఈ పవిత్ర మహా గ్రంథం సంస్కృతంనుండి ఎనభైకి పైగా భాషల లోనికి అనువదింపబడిన సంగతి సహృదయులైన పాఠకులకు విదితమే. తెలుగులో కూడా ఎందరో మహనీయులు ఈ గ్రంథాన్ని అనువదించి, వివరించి, వ్యాఖ్యానించి పునీతులైనారు. కొరోనా సమయంలో పుస్తక పఠనంలో భాగంగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు రచించిన గీతామకరందం చదవడం ప్రారంభించాను. సమగ్రమైన ప్రతిపదార్థం, తాత్పర్యంతో పాటు వారు రచించిన వ్యాఖ్యానం క్లిష్టమైన శ్లోకాలనుండి తేట తెలుగులో చెట్టునున్నపట్టునుండి తేనె తీసి తినిపించి నట్లనిపించింది. నిజమే కదా! తేనెటీగలు ముసిరివున్న పట్టునుండి తేనె తీయడం చాలా కష్టం. కానీ తీసిన తేనెను ఆస్వాదించడం అందరికీ బహు యిష్టం. బహుశా అందుకనేనేమో శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు తమ గ్రంథాన్ని గీతామకరందం అన్నారు. ధ్యేయం నిష్కలంక మైనపుడు సార్థక నామధేయం తనంతట తానే వరిస్తుంది కదా!

భగవద్గీతను సంస్కృతంలో చదువుతున్నప్పుడు ప్రతి పదానికి అర్థం వెతుక్కోవాల్సి వచ్చేది. కొద్దో గొప్పో సంస్కృత భాషా పరిచయం వున్నవారికి అది కొంత సమయం పట్టినా అది సాధ్యమే. కానీ అసలు సంస్కృత భాష కొంచెం కూడా తెలియని వారికి చదవాలని యిష్టం వున్నా అది చాలా కష్టం. అదే మన తల్లి భాషలో ఈ గ్రంథం అందుబాటులో వున్నట్లయితే చాలా సులభం. పారాయణానికి వచనం కంటే పద్యరూపంలో హృద్యంగా వుంటుందని మనకు విదితమే గదా. కనుక తెలుగులోనే నేరుగా పద్యరూపంలో గీతను చదువుకుంటే యింకా బాగుణ్ణు అనిపించింది నాకు. నాకున్నపరిమిత పదపరిజ్ఞానంతో, యిదివరకు తమిళసాహిత్యంలో తలమానికంగా భావించే తిరుక్కురళ్ అనువదించిన అనుభవంతో తెలుగులో పద్యరూపంలో (ఛందోబద్ధం కాని) వ్రాస్తే చదువుకునేందుకు, వినేందుకు, పాడుకునేందుకు, పారాయణం చేసేందుకు,

అనువుగా ఉంటుందని భావించి వీలైనంత సరళమైన వాడుక పదాలతో ఈ అనువాదాన్ని పూర్తి చేశాను. నేను చేసిన ఈ ప్రయత్నం ఫలించిందని నా అభిమతం. అది నా అదృష్టంగా భావిస్తాను. శ్రీమద్భగవద్గీతను తెలుగులోనికి అనువదించాలనే నా తలపు ఆ భగవంతుని సంకల్పమని నమ్మి ఆ భగవంతునిపై భారం వేసి నా ధర్మం నేను చేశాను. ఆ భగవంతుడు చెప్పినట్లే కర్మఫలం ఈ పుస్తకం రూపంలో పండింది. అచ్చయింది. మీ చేతుల్లోకి వచ్చింది. ఆసక్తిగల పాఠకులకు, భక్తులకు ఈ కర్మఫలం చెందుతుంది. అదియే కదా గీతా సారాంశం.

**కర్మము చేయుటయే నీ ధర్మము**
**ఫలము కోరుటకు లేదధికారము.**
**కర్మ ఫలములకు కర్తవు కాకుము**
**కర్మలు చేయుట మాన బోకుము.**

ఈ గీతానువాద యజ్ఞంలో నాకు సంపూర్ణ సహకారం అందించిన కొందరు మహనీయులకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలపడం నా కర్తవ్యం. ముందుగా నాకు పాఠశాల స్థాయిలో తెలుగు, సంస్కృతం బోధించిన గురువులు, మహా మహోపాధ్యాయ సాహిత్య శిరోమణి శ్రీ సముద్రాల లక్ష్మణయ్య గారికి నా ప్రణామములు. అనువాద ప్రతిని ఆసాంతము చదివి సంస్కరించినందుకు వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. అలాగే అవధాన శిరోమణి శ్రీ మేడసాని మోహన్ గారు కూడా అనువాద ప్రతిని పరిశీలించి పలు సూచనలు చేసినందులకు వారికి నా కృతజ్ఞతాభినందనాలు.

అనువాద ప్రతిలోని ప్రతిపదాన్ని నిశితంగా విశ్లేషించి మూలానికి భిన్నమైన పదాలను గుర్తించి అనువాదాన్ని సకల జన ఆమోదయోగ్యంగా మలచిన మనీషి విశ్రాంత వుమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసు మాజీ డైరెక్టర్ జనరల్ శ్రీ కే. అరవింద రావు IPS, గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ రచనా ప్రక్రియ సంకల్పించినప్పటి నుండి వెన్నుతట్టి ప్రోత్సహించిన మరొక పోలీసు ఉన్నతాధికారి, హితైషి శ్రీ రావులపాటి సీతారామారావు IPS, గారికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

ఈ రచనా కార్యక్రమం నిర్విఘ్నంగా సాగేందుకు సకల సేవలు అందించి ముందుకు నడిపించిన నా సతీమణి శ్రీమతి అరుణకుమారి గారికి నా కృతజ్ఞతా పూర్వక అభినందనలు.

ఈ ప్రతిని డిజైన్ చేసిన చిరకాల మిత్రుడు శ్రీ శ్రీనివాస్ గారికి నా ధన్యవాదాలు.

ఈ పుస్తకాన్ని పాఠకలోకానికి అందింపజేసిన ఎమెస్కో అధినేత శ్రీ విజయకుమార్ గారికి విశేషంగా నా మనః పూర్వక కృతజ్ఞతలు.

**– పి. కృష్ణయ్య**

# గ్రంథ పరిచయం

## 1. భగవద్గీత.. పుట్టు పూర్వోత్తరాలు

మహాభారతం లోని భీష్మ పర్వము నందు 25 వ అధ్యాయం నుండి 42 వ అధ్యాయం వరకు వున్న గ్రంథభాగం శ్రీమద్భగవద్గీతగా మన్నన పొందింది. మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధి కాంచగా దాని సారమే భగవద్గీతగా పండితులు తెలిపారు. ఈ భగవద్గీతను వుపనిషత్తని, బ్రహ్మవిద్య యని, యోగ శాస్త్రమని కూడా కోవిదులు కొనియాడారు. రమారమి ఐదువేల సంవత్సరముల నాడు ద్వాపర యుగాంతమున కురుక్షేత్ర యుద్ధభూమిలో అంకురించి, ఆకు తొడిగి, మొగ్గ వేసి, పుష్పించి, ఫలించినదీ కర్మఫల వృక్షం. మానవ జాతికి ఒక వినూత్నమైన విభిన్నమైన కార్మిక జీవన విధానాన్ని భగవంతుడే నేరుగా అర్జునుని ద్వారా అందించాడు. సకల కాలాలకు, సకల కులాలకు, సకల వృత్తులకు, సకల ప్రవృత్తులకు సరిపడు నూతన సమన్వయ జీవన విధానాన్ని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. ఆ నాటినుండి ఎందరో మహనీయులు, విజ్ఞులు గీతా ప్రశస్తిని, గీతా ఫలితాన్ని, గీతానుష్ఠానాన్ని పలు విధములుగా వర్ణించి యున్నారు. ప్రపంచంలో ఎనభైకి పైగా వివిధ భాషల లోనికి అనువదింపబడటం గీత సార్వజనీనతను, ప్రాశస్త్యాన్ని ప్రస్ఫుటం జేస్తున్నది. తెలుగులో కూడా పలు అనువాదాలు, వ్యాఖ్యానాలు అందుబాటులో వున్నాయి.

## 2. గీతా ప్రశస్తి

గీత యనగా గానము చేయబడినది యని, ఆనందదాయని యని, ముక్తి మార్గమని, జ్ఞాన బోధిని యని, సమ దర్శిని, ప్రకృతి ప్రేమి యని, భూత దయామయి అని చివరగా మానవ జీవితం ఆటు పోట్లకు గురి కాకుండా సజావుగా సాగేందుకు భగవంతుడు నిర్దేశించిన పరిష్కారాల పట్టిక యని పండితులు పలు రకాలుగా అన్వయిస్తారు. భగవంతుడు పాడిన గీత కావున భగవద్గీత అంటారు పెద్దలు. అచ్చ తెలుగులో చెప్పుకుంటే దేవుని పాట. పాటలు మనసుకు ఎంతో

ఆహ్లాదాన్ని సమకూరుస్తాయి. సంగీతం, పాటలు పద్యాలు కష్టజీవికి శ్రమనుండి ఉపశమనం కలిగిస్తాయి. సంగీతానికి ఫణులు పడగ విప్పి ఆడుతాయి. గోవులు పాలు స్రవిస్తాయి. సంగీతం రోగులకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది. మానవ జనితమైన మధుర గానమే యింత రసానుభూతిని కలిగిస్తే భగవంతుడే అందించిన యీ గీతం మానవ లోకాన్ని ఆనంద డోలికల్లో విహరింపజేయడంలో ఆశ్చర్య పడవలసిన దేముంది? బాలునిగా తన మురళీ గానంతో గోవుల సమూహాన్ని, గోపికా లోకాన్ని పరవశింప జేసిన ఆ శ్రీకృష్ణ పరమాత్మ తన గీతా గానంతో మానవ లోకానికి జీవన జ్ఞాన విజ్ఞాన భక్తి ముక్తి సంగీతాన్ని ప్రసాదించాడు.

### 3. అందరికీ భగవద్గీత ఎందుకు పరిచయం కాలేదు?

భగవద్గీత యనగానే అది ఒక వైరాగ్య జీవితానికి ప్రతీక గానో, ముసలితనంలో చదువుకునే ఆధ్యాత్మిక గ్రంథంగానో పరిగణించటం ఓ పరిపాటి అయ్యింది. గుడిలో వినిపించే ఘంటసాల గారి భగవద్గీత శ్లోకాలలోని అమర గంభీర స్వరం భగవద్గీతకు పండిత పామర లోకంలో ప్రాచుర్యం కల్పించిందనడంలో అతిశయోక్తి లేదు. కానీ యివే శ్లోకాలు శోకానికి సంకేతంగాను, వైరాగ్యానికి ప్రతిరూపంగా పరిణమించడం ఒక అసంకల్పిత దుస్సందేశం. ఈ గీతాగానం మనిషి మరణానంతరం, పార్థివ దేహం వెంట వినిపించే విషాద సంగీతంగా మారడం ఒక విధి వైచిత్రి. మన విద్యాప్రణాళికల్లో ప్రాథమిక స్థాయి నుండి ఈ గ్రంథాన్ని పరిచయం చేయక పోవడం వల్లనో, అందలి కథా వస్తువును వున్నత స్థాయి పాఠ్యాంశాలలో బోధించనందువల్లనో, తెలుగు విద్యార్థులకు భగవద్గీత ఒక 'అపరిచయ' వస్తువు అయింది. నాలుగో ఐదో వేమన పద్యాలు, రెండో మూడో సుమతిశతకం లోనివి ప్రతి తెలుగువానికి కంఠస్థం. గర్వ కారణంకూడా. కానీ తెలుగులో ప్రామాణికమైన తత్సమాన భాషాన్తరీకరణ గ్రంథం లేక పోవుట వలనో ఏమో మొత్తం మీద భగవద్గీత  రామాయణం, మహాభారతం, భాగవతం లాగా తెలుగు ప్రజలకు అంతగా తెలియక పోవడం దురదృష్టం. పురాణేతిహాసములతో బాటు, వ్యక్తిత్వ వికాసానికి వుపయోగపడే భగవద్గీతలోని కొన్ని అంశాలను పాఠ్య ప్రణాళికల్లోప్రవేశ పెట్టడం సముచితమని నా అభిమతం.

## 4. జీవనసాఫల్యానికి సమగ్ర మార్గ దర్శిని భగవద్గీత

మహా భారత సంగ్రామంలో కురుక్షేత్ర యుద్ధ భూమిలో చివరి క్షణంలో శస్త్రాస్త్ర ప్రయోగానికి నిరాసక్తుడైన అర్జునునికి రథ సారథి అయిన శ్రీకృష్ణుడు జ్ఞానోదయం చేసి, కర్తవ్యాన్ని బోధించి, తిరిగి కార్యోన్ముఖునిగా చేయుట ప్రధాన లక్ష్యంగా భగవద్గీత సాగినప్పటికీ అందు చెప్పబడిన పలు అంశాలు, అనేక ధర్మ సూత్రాలు, మానవ సమాజ సమన్వయ సుఖ జీవనానికి సోపానాలు. ఆధునిక జీవన సంద్రంలో మనిషి అనునిత్యం ఎదుర్కొనే సమస్యల తరంగాల నుండి రక్షించే లంగరు భగవద్గీత. జీవనం దినదిన గండంగా మారి పెక్కు చిక్కులతో సతమతమవుతున్న నేటి ప్రపంచ మానవాళికి మార్గనిర్దేశం చేయగల దిక్సూచి శ్రీమద్భగవద్గీత. ద్వాపరయుగాంత కాలం నాటి ఆ దేవుని మాటలు ఈ నాటికి నిత్య సత్యాలు. నిర్మలమైన మనస్సుతో, సంపూర్ణ ఆరోగ్యంతో భయాందోళనలు లేని ప్రశాంత జీవితం గడుపుటకు భగవంతుడు ప్రసాదించిన దివ్యౌషధము శ్రీమద్భగవద్గీత. ఆశ అడియాసలు, కామక్రోధాలు, మదమాత్సర్యాలు, మోహలోభాలు, కుట్రలు కుతంత్రాలు పుష్కలంగా వున్న నేటి సమాజంలో సగటు మనిషి భావోద్వేగాలతో నలిగి, మానసిక ఒత్తిడికి లోనై వ్యక్తిగత జీవితాన్ని కుటుంబ గౌరవాన్ని ఛిద్రం చేస్తున్న రోజులివి. గీత యందలి సారాంశం, అందు పొందు పరచిన ధర్మ సూత్రాలు, సాధన ప్రక్రియలు అవగతం చేసికొని, ఆలోచించి, కృత నిశ్చయంతో పాటించ గలిగిన మానవుడు ఈ జన్మలో అనునిత్యం ఎదుర్కొను సమస్యల వలయం నుండి తప్పక విముక్తి చెంద గలడు. మరణానంతరం పునర్జన్మ లేని పరంధామమును పొంద గలడు. అందుకు చిత్తశుద్ధి, అనన్య భక్తి అను రెండు సులభ పద్ధతులను శ్రీకృష్ణ భగవానుడు మనకు ప్రసాదించాడు.

## 5. భగవద్గీతయందలి విభాగాలు

వ్యాసమహర్షిచే విరచితమయిన ఈ గ్రంథ భాగంలో పద్దెనిమిది అధ్యాయాలు, ఏడువందల నలుబది ఐదు శ్లోకము లున్నట్లుగా చెప్పినప్పటికీ, ప్రస్తుతం యిందులో ఏడు వందల ఒక శ్లోకం మాత్రమే ప్రాచుర్యంలో ఉన్నాయి. వీనిలో శ్రీకృష్ణుడు పలికినవి 574, అర్జునునిచే 85, సంజయుడు చెప్పినవి 41కాగా, ధృతరాష్ట్రుడు ఒక శ్లోకం చెప్తాడు. ఒక్కో అధ్యాయము ఒక యోగముగ నామకరణం చేయబడి క్రింద చెప్పిన విధంగా పద్దెనిమిది అధ్యాయాలున్నాయి.

తదుపరి దివ్యగీతంలోని ప్రధాన అంశాలను కూడా క్లుప్తంగా స్పృశించడం జరిగింది

| | | |
|---|---|---|
| 1. | అర్జున విషాద యోగము | ... 47 శ్లోకములు. |
| 2. | సాంఖ్య యోగము | ... 72 శ్లోకములు. |
| 3. | కర్మ యోగము | ... 43 శ్లోకములు. |
| 4. | జ్ఞాన యోగము | ... 42 శ్లోకములు. |
| 5. | కర్మ సన్న్యాస యోగము | ... 29 శ్లోకములు. |
| 6. | ఆత్మ సంయమ యోగము | ... 47 శ్లోకములు. |
| 7. | విజ్ఞాన యోగము | ... 30 శ్లోకములు. |
| 8. | అక్షర పర బ్రహ్మ యోగము | ... 28 శ్లోకములు. |
| 9. | రాజవిద్యా రాజగుహ్య యోగము | ... 34 శ్లోకములు. |
| 10. | విభూతి యోగము | ... 42 శ్లోకములు. |
| 11. | విశ్వరూప సందర్శన యోగము | ... 55 శ్లోకములు. |
| 12. | భక్తి యోగము | ... 20 శ్లోకములు. |
| 13. | క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము | ... 35 శ్లోకములు. |
| 14. | గుణత్రయ విభాగ యోగము | ... 27 శ్లోకములు. |
| 15. | పురుషోత్తమ ప్రాప్తి యోగము | ... 20 శ్లోకములు. |
| 16. | దైవాసుర సంపద్విభాగ యోగము | ... 24 శ్లోకములు. |
| 17. | శ్రద్ధాత్రయ విభాగ యోగము | ... 28 శ్లోకములు. |
| 18. | మోక్ష సన్న్యాస యోగము | ... 78 శ్లోకములు. |

**6. ఏ సందర్భంలో భగవద్గీత చెప్పబడింది. ?**

యుద్ధరంగంలో అర్జునుడు తనకు బంధువులయిన, తాతలు, తండ్రులు, మేనమామలు గురువులను చూచి భావోద్వేగానికి లోనై రాజ్యం కోసం యింతమందిని యుద్ధంలో చంపడం ధర్మం కాదని, నెత్తుటి కూడు అవసరం లేదని మనోవ్యాకులత చెంది యుద్ధం చేయుటకు నిరాసక్తుడై విల్లంబులు జారవిడిచి, యుద్ధం చేయలేనని తన రథసారథి, సఖుడు, గురువు అయిన శ్రీకృష్ణునితో తన

బాధను విన్నవించగా శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి గీతోపదేశం కావించి అజ్ఞానాన్ని తొలగించి మోహ విముక్తుడిని చేశాడు. మోహ విముక్తుడైన అర్జునునికి జ్ఞానము కలిగింది. పలు విషయములలో సందేహములు కలిగిన అర్జునుడు శ్రీ కృష్ణ భగవానుని ద్వారా సంశయ నివృత్తుడై, చివరకు శ్రీ కృష్ణుని ఆనతిని పాటించి యుద్ధమునకుపక్రమించెను.

తన ఆత్మీయుడైన అర్జునునికి కర్తవ్య బోధన ప్రధాన లక్ష్యంగా గీత కొనసాగినప్పటికీ, కేవలం అంతవరకే పరిమితం కాక శ్రీకృష్ణ భగవానుడు వేదవేదాంతములందలి సారాన్ని సంగ్రహపరచి సకల జనావళికి ఆచరణ యోగ్యమైన ఆచరణ సాధ్యమయిన కర్మ సిద్ధాంతమును బోధించాడు. కర్మము, జ్ఞానము, విజ్ఞానము, భక్తి, సన్న్యాసము, విభూతి మొదలైన పద్దెనిమిది అంశాలను వివరిస్తూ, ఒక్కో అంశాన్ని ఒక యోగముగా నామకరణం చేసిన యీ గీతను యోగ శాస్త్రమనియు చెప్పుదురు. మోక్ష సాధనకు కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగ మార్గాలు ఏదైనా ఒకటేనని మోక్షము నొందుటకు డబ్బు వెచ్చించి చేసే యజ్ఞ యాగాదులతో పని లేదని భగవంతుడు తెలిపాడు. సంపూర్ణ విశ్వాసముతో, శ్రద్ధతో అనునిత్యము గీత యందలి సందేశమును భగవంతుని ఆదేశంగా ఆచరించి అవలంబించు వారికి సత్ఫలితం కల్గుతుంది. సకల మానవులకు గీతయందలి నీతిని గ్రహించుటకు, ఆచరించుటకు అవకాశం ఉన్నది. అన్నికాలాలకు గీత బోధించిన కర్తవ్యనీతి, సమతా రీతి, కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగ మార్గాలు ఆచరణీయాలు. సిద్ధాంత పరమైన చర్చల కంటే సాధన ద్వారా అనుకున్న లక్ష్యం చేరవచ్చునను కర్మ సిద్ధాంతమును లోకానికి అందించింది భగవద్గీత.

### 7. గీత యందలి ప్రధాన సారాంశం

కష్టసుఖాలను, లాభనష్టాలను, మానావమానాలను, జయాపజయాలను, శీతోష్ణములను సమానంగా చూడగలిగి, మనసును నిశ్చలంగా ఉంచడాన్ని యోగమంటారు. చేసిన కార్యము ఫలించిన, ఫలించకున్న చలింపక, మనసును సమస్థితిలో నుంచుట, చేసెడి కర్మలందు నేర్పరితనం కలిగి ఉండుట యోగ లక్షణం. మానవుడు తన అహంకారమును తగ్గించుకొని ఆత్మానందం పొంది, పరమాత్మతో ఐక్యమవడమే యోగ లక్ష్యం. కనుక ఫలాపేక్ష లేక చిత్తమునందు సమతా స్థితిని కలిగిన వారందరు యోగులుగా పరిగణింపబడుదురు. అట్టివారు

దైవానుగ్రహం పొందుతారు. ఈ సమతా స్థితిని పొందుటకు భగవంతుడు నాలుగు మార్గాలను సూచించాడు. అవి కర్మయోగ మార్గం, భక్తి యోగ మార్గం, ధ్యానయోగ మార్గం, జ్ఞానయోగ మార్గం. ఆయా మనుజులకు గల అవకాశాన్ని సుకృతాన్ని పురస్కరించుకొని వారు తమకు అనువైన యోగ మార్గాన్ని అవలంబించ వచ్చును. అన్ని మార్గాలను ఎంతో కొంత ప్రతి వ్యక్తి ఆచరించుటకు అవకాశం కలదు. ఈ మార్గములన్నియు ఒకదానికొకటి అనుసంధానం కలిగి లక్ష్య సాధనకుపకరించే పరికరాలు. భగవంతుని చేరుటకు అన్ని మార్గములు సమానమేనని గీతలోని నీతి.

## 8. కర్మ మార్గం

వేదాంతమునకు వ్యవహారమునకు పొసగదనే పాతుకు పోయిన ప్రాత భావాన్నిపెకలించి, జనావాసాలలో నివసిస్తూ యెవరి వ్యాపకం వారు నిరంతరం కొనసాగిస్తూ ఆధ్యాత్మికతను సాధించ వచ్చని శ్రీకృష్ణ పరమాత్మ గీతలో వుపదేశించాడు. సాంసారిక బాధ్యతలను, ప్రాపంచిక కర్మలన్నియు యథా విధిగా కొనసాగించ వచ్చును. కర్మలన్నియు భగవత్ సంకల్పితములుగా విశ్వసించి కర్మఫలములతో నిమిత్తం లేకుండా చిత్తశుద్ధితో కర్మలు చేయాలి. అలా కర్మలొనర్చినచో ఫలము తనంతట తానే కల్గుననే ఆచరణీయ దృక్పథాన్ని లోకానికి చూపించాడు భగవంతుడు. దీనినే కదా మనం కార్యదీక్ష అంటాం. దీక్షతో చేసే యే కార్యమైనా సత్ఫలితాలిస్తుందనడంలో సందేహమెందుకు? అంతేకాక కర్మలు చేయకుండా మానవ మనుగడ సాగదు. భగవంతునితో సంబంధం లేక కేవలం కర్మలు మాత్రమే చేయగలనని అనుకోవడం కుదరదు. ఏదో ఒక జీవిత దశలో భగవదనుగ్రహం కోసం మానవుడు ప్రయత్నం చేయక తప్పదు. భగవంతుని పైనే భారం వేసి కర్మలు మానుట అవివేకం. ఏ కర్మలు చేయక ఉదాసీనంగా వుండుటకంటె కర్మలు చేయుటయే శ్రేష్ఠమని కృష్ణుడు బోధించాడు. ప్రకృతి వలననే పలు గుణములు కలుగుతున్నాయి. గుణముల వలన సమస్త కర్మలు జరుగుతాయి. కానీ మూర్ఖ మానవుడు గుణముల మూలమున జరిగెడి కర్మలన్నిటికి తానే కర్తగా భావిస్తాడు. గుణముల వలన కర్మలు జరుగునని తెలిసిన తత్త్వవేత్తలు కర్మలకు తాను కారకుడు కానని వ్యవహరిస్తారు. కర్మలు చేయుట మానవ ధర్మము. ప్రతిఫలం ఆశించుటకు మానవునికి అధికారం లేదు. కావున కర్మ ఫలములను భగవంతునికి సమర్పించి ఆశ మమకారము లేక కర్మలు చేయాలి. కర్తవ్య నిర్వహణ బాధ్యతా

యుతంగా చేస్తే ఫలితాలు వాటంతట అవే వచ్చునని, కనుక విధి నిర్వహణ చిత్తశుద్ధితో చేయవలెనని duty is devine, work is worship అనబడు ఆధునిక భావజాలానికి ఆద్యుడు శ్రీకృష్ణ పరమాత్మ. కనుక, జీవితాంతం ఫలంతో నిమిత్తం లేకుండా జీవనాన్ని కొనసాగిస్తూ అందుకు అవసరమైన ధర్మబద్ధమైన కర్మలు నిర్వహిస్తూ దైవచింతనలో గడపుటయే కర్మ సిద్ధాంతం.

**9. భక్తి మార్గం**

భగవంతుని ప్రేమతో ఆరాధించడమే భక్తి. ఇతరముల గురించి ఆలోచింపక అనన్య భక్తితో ఆరాధించడం అవసరమని గీతలో పలుమార్లు శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు. అటువంటి అనన్య భక్తి కలిగిన వారంటే నాకెంతో ఇష్టం అని పదే పదే ప్రవచించాడు శ్రీకృష్ణుడు. అటువంటి భక్తుల యోగ క్షేమములు నేనే చూసుకుంటాను అని భరోసా ఇచ్చాడు.

భక్తితో ఆరాధించెడి వారిని బిడ్డల పట్ల తలితండ్రుల వలె సంరక్షణా బాధ్యతలను భగవంతుడు స్వీకరిస్తాడు. అనన్య భక్తి కలిగిన వానికి బ్రహ్మ సాక్షాత్కారము లభించునని చెప్పబడియున్నది. అయితే భగవంతుని ఆరాధించే విధానం ఇప్పటికే బహు వ్యయంతో కూడుకున్నదని చాలా మందికి భయం. ధన కనక వస్తు వాహనాలు, పూజా సామగ్రి, పుష్ప మాలలు, కర్పూర నీరాజనాలు, కదళీ ఫలాలు, పట్టు వలువలు, ఎర్ర కలువలు, బంగారు పళ్లాలు, బాజా భజంత్రీలు, మంగళ వాద్యాలు, నేతి నైవేద్యాలు, మామిడి తోరణాలు, మరకత మాణిక్యాలు... ఇలా అభిషేకం దగ్గరనుండి అలంకరణ వరకు వూన్జలసేవలు, ఊరేగింపులు అన్నీ ధనమయమయినాయి. ఇవన్నీ చేయగలిగితేనే భగంతుడు కరుణిస్తాడేమో అనే స్థితికి నేటి పూజా విధానాలు తయారయ్యాయి. అందుకనే యిటువంటి పూజలు, సేవలు అందరికి అందుబాటులో లేని వ్యవహారంగా మారింది నేడు. అందువలన ధనవంతుడికే భగవంతుడు అనే అభిప్రాయం కలుగుట సహజం. కానీ భగవంతుణ్ణి ఎంత సులభంగా ఆరాధించ వచ్చునో భగవద్గీత చెప్పింది. ఆకో, అలమో, ఫలమో జలమో ... ఏదైనా భక్తితో నాకు సమర్పిస్తే ప్రీతితో అవి స్వీకరిస్తానని భగవంతుడు స్వయంగా తెలపడం భగవద్గీతను మత గ్రంథాలలో అత్యున్నత శిఖరాలకు చేర్చింది. దైవిక సంపదలైన సుగుణాలను కలిగిన మనుజుడు నాకత్యన్త ప్రియుడని భగవంతుడు పలికెను. కఠోరమైన దీక్షలు గాని, ధనవ్యయము,

ప్రయాసలు, ప్రజ్ఞ పాటవాలు అవసరం లేని సులభ ప్రక్రియ భక్తి మార్గం. భగవంతుని చేరేందుకు పండితులు, ముముక్షువులు అవలంబించే కఠిన ప్రక్రియలతో నిమిత్తం లేకుండా పామరులకు, స్త్రీలకు, నిరక్షరులకు భగవంతుడు ప్రసాదించిన సులభ మార్గం భక్తి మార్గం.

## 10. ధ్యాన మార్గం

బ్రహ్మ సాక్షాత్కారము పొందుటకు శ్రీకృష్ణ పరమాత్మ తెలిపిన మరియొక మార్గం ధ్యాన మార్గం లేదా ధ్యాన యోగం. బ్రహ్మచర్యము, అహింస, శుచి, ఆహార విహార నియమావళి పాటించి మనసును నియంత్రించి, దృష్టిని కేంద్రీకరించి, ఏకాంతముగా ధ్యానము చేస్తూ సమాధి (నిశ్చల) స్థితిని చేరుట దీని లక్ష్యం. నిశ్చల స్థితి సాధించుటకు మనసును బాహ్య విషయముల జోలికి వెళ్లకుండా కట్టడి చేసి ఆత్మయందు లగ్నము చేయవలయును. ఇందుకు అవసరమైన సూచనలు విస్తారంగా గీత యందు తెలుప బడినాయి. చపలమైన మనస్సును నియంత్రించుట మొదట కష్టమైనప్పటికీ అభ్యాసము చేత ఇది సాధ్యమగునని భగవంతుడే మార్గ దర్శనం చేశారు. మనసును అంతర్ముఖంగా మరల్చి ఆత్మలో లీనం చేసి మానసిక ప్రశాంతతను పొంది నిర్వికల్ప స్థితికి చేర్చునది ధ్యాన యోగం. ఇట్టి ఆత్మ సంయమము చేయ గలిగిన నరునికి బ్రహ్మ సాక్షాత్కారము పొందుట సులభ తరమగునని గీతయందు పెక్కు సందర్భాలలో వుటంకించ బడినది.

## 11. జ్ఞాన మార్గం

శ్రద్ధ కలిగిన వానికి జ్ఞానము లభించి, ఆ జ్ఞానము వలన పరమ శాంతిని పొందగలడని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి బోధించాడు. జ్ఞానముతో సమానమైన పవిత్రత కలది జగమున ఏదియు లేదనియు భగవంతుడు చెప్పాడు. అజ్ఞానము వలన కలుగు రాగ ద్వేష మద మాత్సర్యములు దుఃఖానికి కారకములు. దుఃఖకారకములయిన అరిషడ్వర్గాలు కలుగుటకు గల మూల కారణములు తెలుసుకోవాలి. లోకమున జరిగే పలు చర్యలకు మూల కారణమయిన ప్రకృతి గురించి, పురుషుని గురించి, త్రిగుణముల గురించి, క్షేత్ర క్షేత్రజ్ఞుల గురించి, దైవిక లక్షణములు, అసుర లక్షణములు, వివిధములైన తపస్సులు, యజ్ఞములు గురించి, కర్మలు కర్మఫలములు, సన్న్యాసము, త్యాగము మొదలగు విషయములపై

అవగాహన కలిగినప్పుడు మనుజునికి అజ్ఞానం నశించి జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం కలిగిన మనుజునికి ఏవి చేయ తగినవో చేయ తగనివో విచక్షణ ఉంటుంది. కనుక అట్టివాడు జనహితం కోరి మంచి వర్తనం కలిగి యుంటాడు. విచక్షణ కలిగిన మనుజుడు పరమాత్మ తత్త్వమునెఱిగి ఆత్మానుభూతిని పొందుతాడు. అట్టి నరునికి ఆత్మానుభూతి వలన పరమానంద స్థితి లేదా ఐహిక కామ్యకర్మముల నుండి విముక్తి లభించి అతడు భగవంతునితో ఐక్యం చెందుతాడు. ఇదియే జ్ఞానమార్గం ద్వారా మనుజునికి లభించు మోక్షము.

## 12. గీత... సమతా వాదం

విశ్వమంతా భగవత్ స్వరూపమేనని, విభజించుటకు వీలుకాని విరాడ్రూపముగ విశ్వరూపసందర్శన విభాగయోగంలో వివరించబడింది. కావున సృష్టిలోని చరాచరాలన్నీ భగవత్ స్వరూపాలే. సమస్త ప్రాణి కోటిని తనవలె ప్రేమించడం ద్వారా భగవంతుని పొందవచ్చునని భగవంతుని ఉద్బోధ. భూత దయ కలిగి వుండుటయే కాక చండాలుడైనా, చతుష్పాదైన, కుట్టి, కుంభి, కుక్క – యిలా యేదయినా సమానముగా చూడ గలిగినవాడే నిజముగా పండితుడని భగవానుడే స్వయంగా ఉపదేశించాడు. భగవద్గీత సర్వ భూత సమానత్వానికి, సర్వమానవ సమతా భావానికి ప్రతీక. గుణ కర్మల ఆధారంగా నాలుగు వర్ణాలుగా మానవ సమాజాన్ని సృష్టించానని భగవంతుడు చెప్పినప్పటికీ, వారి వృత్తులకు సంబంధం లేకుండా అందరు సమానమే అనే సూత్రీకరణ భగవద్గీత చేసింది.

ఈనాడు ఆధునిక సమాజం ఆశించే సమతా వాదాన్ని, సనాతన ధర్మాన్ని, శ్రీకృష్ణ పరమాత్మ ద్వాపర యుగంలోనే లోకానికి అందించారు. అయితే ఈ అద్భుత సందేశాన్ని మధ్యయుగంలో మరిచిపోవడం, మనుషులు 'మారి' పోవడం హైందవ సమాజ వైభవ తిరోగమనానికి నాంది అయింది.

## 13. డబ్బు ఖర్చు చేసి యజ్ఞ యాగాదులు చేయ వలెనా?

భగవంతుని కృపాకటాక్షం కోసం యజ్ఞ యాగాదులు నిర్వహించడం ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. దేవతలకు తృప్తి కలిగించడం యజ్ఞం లక్ష్యం. సాధారణంగా యజ్ఞం అనేది అగ్ని(హోమం) వద్ద వేదమంత్రాల సహితంగా జరుగుతుంది. ఇందుకు అనుబంధంగా అనేక నియమాలు, సంప్రదాయాలు ఉన్నాయి. అగ్నిహోత్రం అనేది యజ్ఞంలో ఒక ముఖ్యమైన అంశం. యజ్ఞంలోని

అగ్నిలో "వ్రేల్చినవి" అన్నీ దేవతలకు చేరుతాయని విశ్వాసం. దేవతలు సంతోషించి వరములిస్తారు. అయితే యజ్ఞ యాగాదులు చేయడం అధిక వ్యయ ప్రయాసలతో కూడుకొన్న మహాకార్యం. సామాన్య మానవులు, పేదలు చేయుటకు అలవి కాని వ్యవహారం. అందువలన కొన్ని సామాజిక వర్గాలకు లేదా వున్నత కుటుంబాలకే ఆ భాగ్యం పరిమితం. దీనికి భిన్నంగా దైవచింతనతో చేసే ప్రతి నిష్కామ కర్మను యజ్ఞము క్రింద భావించ వచ్చుననీ భగవంతుడు మరో నిర్వచనాన్ని, గీత ద్వారా సామాన్య జనులకు ఆవిష్కరించారు. మానవుడు తన దినసరి కార్యాలను కూడా పవిత్ర భావంతో నిర్వహించి యజ్ఞఫలం పొందవచ్చును. ఇట్టి యజ్ఞమునకు ఖర్చు ఉండదు. కర్మబంధనముండదు.

### 14. మోక్షం సంసారులకు కలుగదా?

మోక్షసాధనకు సన్యాసం అవసరం లేదు. సంసారిగా కూడా మోక్షం పొంద వచ్చును. ఈశ్వరార్పణమైన మనసుతో నిత్య కర్మలు ఆచరించియు కర్మ బంధ విముక్తి పొందవచ్చును. సన్న్యాసమనగా ఇల్లు, వాకిలి, భార్య, పిల్లలు ఆస్తి పాస్తులు విడిచి అడవులకో, ఆశ్రమాలకో వెళ్లనవసరం లేదు. ప్రతిఫలము ఆశించక కర్మలు చేయుటయు సన్న్యాసమే. మానవుల వద్దనున్న సర్వ వస్తు సముదాయమును వదిలివేయుట మాత్రమే త్యాగము కాదు. సంపదలను, ధర్మబద్ధమైన సత్కార్యములకుపయోగించి తద్వారా లభించిన కర్మఫలములను భగవంతునికి వదిలివేయుటయే త్యాగము. ఐహిక సుఖాలను అనుభవిస్తూ ఆధ్యాత్మిక పరమార్థాన్ని ఆస్వాదించడం సాధ్యమేనని నేడు ఎందరినో ప్రత్యక్షంగా చూడ గలుగుతున్నాం.

### 15. మోక్షం కోసం తల్లక్రిందులుగా తపస్సు చేయాలా?

తపస్సు అంటే కేవలం ఎండా వానలు లెక్కచేయక తల్లక్రిందులు గాను, ఒంటికాలి మీద, వివిధ భంగిమల్లో చేసే కఠోర శారీరిక దీక్షలే కాదు. మహనీయులను పూజించుట, మంచి నడవడి, అహింస, బ్రహ్మచర్యము, శౌచము వంటి సుగుణములు కలిగియుండుట, ప్రియముగా, సత్యముగా మాట్లాడుట, సద్గ్రంథ పఠనము చేయుట, నిర్మలమైన మనస్సు కలిగి ఉండుట, మౌనము, మనో నిగ్రహం, భావశుద్ధి కలిగి యుండుటను కూడా తపస్సుగా భగవంతుడు తెలిపాడు. ఇట్టి ప్రవర్తన అవలంబించిన యెడల తపస్సు సాధింప గోరిన లక్ష్యం నెరవేరుతుంది.

## 16. భగవానుడు ఎప్పుడు ఎందుకు అవతరిస్తారు?

ధర్మము దారి తప్పినప్పుడు అధర్మం అందలం ఎక్కినప్పుడల్లా ధర్మాన్ని మరలా స్థాపించుటకు నా అంతట నేనే నన్ను సృష్టించుకొందును అని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. అంతేకాక, దుష్టులను శిక్షించుటకు, మంచివారిని రక్షించుటకు ప్రతియుగములో నేనవతరించెదనని భగవంతుడు అవతారపరమార్థాన్ని ప్రకటించారు. కనుక అధర్మం కొంతకాలమే కొనసాగుతుంది. దుర్మార్గులు శిక్షింప బడుతారు. మంచి వారికి భగవంతుడు ఎల్లప్పుడూ రక్షణ కల్పిస్తాడు. కావున తాత్కాలికమైన సమస్యలను ఎదుర్కొన వలయును కానీ ధర్మ పథాన్ని వీడరాదని భగవంతుని సందేశం.

## 17. విశ్వరూప సందర్శన విశేషం

భగవద్గీతలోను, మహాభారతంలోను మహాద్భుతమైన, సుప్రసిద్ధమైన సంఘటన విశ్వరూప సందర్శన. పదవ అధ్యాయమైన విభూతియోగంలో భగవంతుడు తన విభూతులను గురించి విశదంగా అర్జునునికి తెలుపుతాడు. తన ఉత్పత్తిని, సనాతనత్వమును చెప్తూ, మనుజులందలి బుద్ధి జ్ఞానము, శమదమాదులు, సుఖదుఃఖాలు తన వల్లనే కలుగుచున్నవని తెలుపుతాడు. అంతే కాక ఋషులు, మనువులు మొదలగు వారి సృష్టికి నేనే కారణమని భగవంతుడు చెప్పగా, ఆ విభూతులన్నియు వివరంగా తెలుపమని అర్జునుడు కోరాడు. అప్పుడు భగవంతుడు తన విభూతుల గురించి సవివరంగా చెప్పి, కేవలం ఇదంతా తన ఒక అంశం మాత్రమేనని తెలుపుతాడు. పిదప అంతటి వైభవములన్నియు చూడగోరి అందుకు తాను చూచుటకు తగుదునని భావించినచో ఆ వైభవములను, రూపములన్నియు చూపవలసినదిగా అర్జునుడు శ్రీకృష్ణుని ప్రార్థించాడు. అంతట భగవంతుడు అర్జునుని కోరిక మన్నించి, దివ్యదృష్టిని ప్రసాదించి తన విశ్వరూపమును చూపిస్తాడు. ఈ చరాచర జగత్తంతయు భగవంతుని నుండి ఉద్భవించి ఆ భగవంతుని లోనే లయమవుతున్నదని అర్జునుడు గ్రహిస్తాడు. దేవతలకు కూడా లభించని విశ్వరూపదర్శనం తనకు లభించినందుకు ఒక వైపు ఆనందపడి మరో వైపు భయ కంపితుడై చతుర్భుజుడుగా, గదాధారిగా వున్న మునుపటి నిజ స్వరూపం చూపించమని వేడుకొనగా ఆ ప్రసన్న రూపమున మరల భగవానుడు కనిపిస్తాడు. అనన్య భక్తి వల్లనే ఇట్టి రూపమును చూడ

గల్గితివని అర్జునునికి భగవంతుడు తెలిపాడు. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేస్తూ, సర్వసంగ పరిత్యాగులై సకల ప్రాణుల యెడ ప్రేమ చూపించెడి వారు, భగవంతునిపై అనన్య భక్తితో నున్న వారు భగవత్ ప్రాప్తి పొందెదరని విశ్వరూపానంతరం శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు.

## 18. భగవద్గీత... ఆధునిక జీవనానికి అత్యంత ఆవశ్యకత.

భగవద్గీత సకల వృత్తులకు, సకల ప్రవృత్తులకు, సర్వ కాలాలకు సరిపడు ఆచరణాత్మక మార్గదర్శిని అని పైన తెలిపాను. సగటు మానవుడు దైనందిన జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు లేని ప్రశాంత జీవితాన్ని గడుపుటకు, వృత్తిపరమైన విజయ శిఖరాలు అందుకొనుటకు అవసరమైన అభ్యాసము, సాధన, కర్తవ్యం, బాధ్యత, ప్రశాంతత, ధైర్యము, శ్రద్ధ, జ్ఞాన సముపార్జన మొదలగు పలు నిత్య నిజ జీవిత సత్యాలను ప్రతిపాదించుటయే కాక యివి సాధించు మార్గాలను వివరించింది. ఒకవేళ అనుకున్నవి అనుకున్నట్లు జరగక పోయినా ఆయా పరిస్థితులనుండి బయట పడు ఉపాయాలను కూడా గీత తెలుపుతుంది. చేసేపని పట్ల అకుంఠిత దీక్ష, చిత్త శుద్ధి, నైపుణ్యము, ఏకాగ్రత, ప్రీతి కలిగి వుండటం ప్రధానమని ప్రవచించింది. కార్య సాధనకు కావలసిన మనో నిగ్రహం అలవాటు చేసుకొన వలెనని, అది ఒక రోజులో సాధ్యం కాదని, దానిని అభ్యాసం చేత సాధించ వచ్చునని వక్కాణించింది. తాను చేస్తున్న పని పట్ల నిబద్ధత కలిగి వుండటమే కాక, ఆ లక్ష్య సాధన గురించి విశ్వాసం కలిగి వుండటం చాలా అవసరమని, విశ్వాసం లేని పురుషుడు ఏదీ సాధించ లేడు అని సెలవిచ్చింది. మనం ఈ నాడు బోధించే ఆధునిక యాజమాన్య పద్ధతులలోని ఆత్మ విశ్వాసం గురించి శ్రీకృష్ణుడు ఆనాడే ఉపదేశించాడు. అనుమానంతో చేసే ఏ పనీ సఫలం కాదని, సంశయాత్ముడు (Doubting Thomas) నశిస్తాడని చెప్పాడు. జ్ఞాన సముపార్జన అవసరం గురించి భగవద్గీత విశదీకరిస్తుంది. శ్రద్ధ, నిష్ఠ, క్రమశిక్షణతోనే జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం లభించినవాడు లక్ష్యాన్నిసాధించి శాంతితో మనగలడు. కావున కులమతాలకు అతీతంగా అన్ని వయసుల వారు భగవద్గీతను చదివి అందలి అంశాలను అవగతం చేసుకొని తమ బ్రతుకులను బాగు చేసుకొనుటకు వినియోగించుకొనగలరని ఆకాంక్ష.

### ఒకటవ అధ్యాయము

# అర్జున విషాద యోగము

1. ధర్మ భూమియగు కురుక్షేత్రమున
నావారలును పాండు సుతులును
ఏమి చేసిరో తెలుపు సంజయా
అనుచు అడిగెను ధృత రాష్ట్రుండు.

2. వ్యూహము నందలి పాండవసేనను
చూచిన పిమ్మట దుర్యోధనుడు
ద్రోణుని చేరి పలికెనిట్లని
తెలిపె సంజయుడు ధృతరాష్ట్రునికి.

3. బుద్ధి మంతుడగు నీదు శిష్యుడు
ద్రుపదపుత్రుడు పన్నిన వ్యూహము
నందున నిలిచిన పాండవ సేనలు
గొప్పగా నున్నవి చూడు గురువరా!

4,5,6. పాండు సేనలలో నైపుణ్యము గల
గొప్ప విలుకాండ్రు, ధైర్య శాలురు
భీమార్జునులకు సమాన వీరులు
యుయుధానుడును, విరాటరాజు,

శైబ్యుడు, ద్రుపదుడు, చేకితానుడు,
వీర్యవంతుడగు కాశీరాజును,
కుంతీ భోజుడు, ధృష్టకేతువు
యుధామన్యుడు నుత్తమౌజుడు

అభిమన్యుడును, పురుజిత్తుడును
ద్రౌపది తనయులు వుపపాండవులు
మహారథులైన వారందరును
వైరి పక్షమున నిలిచి రచ్చట.

**7.** విను ద్విజోత్తమా! మన వైపున గల
ప్రముఖులెవ్వరో, నాయకులెవ్వరో
నాసైన్యమునకు; మీకు తెలిసినా-
గుర్తు చేయుటకే చెప్పుచుంటిని.

**8,9,10.** తమరు, భీష్ముడు, కర్ణవికర్ణులు
జయము నందించు కృపాచార్యుడు
అశ్వత్థామయు భూరిశ్రవుడును
యుద్ధ విద్యలో దిట్టలందరు.

అస్త్ర శస్త్రములు కలిగిన వీరులు
సిద్ధము నాకై ప్రాణమిచ్చుటకు
భీష్మ రక్షణలో బోలెడు పటలము
భీమ రక్షణలో అరకొర దళము

**11.** సేనలు సకల వ్యూహము లందున
తమతమ స్థానములందున నిలిచి
భీష్ముని కండగ వుండ వలయునని
ద్రోణుని కోరెను సుయోధనుండు.

**12.** సింహ గర్జనను మించిన ధ్వనితో
దుర్యోధనునికి ముదము కూర్చగా
శౌర్యవంతుడు, కురు పితామహుడు,
శంతనుసుతుడు శంఖము నూదెను.

13. శంఖ నాదములు భేరీ రవములు
పలకల తప్పెట్ల కొమ్ముశబ్దములు
సేనలు చేయగ భారీ ధ్వనులతో
దిక్కులన్నియు పిక్కటిల్లెను.

14. తెల్ల గుఱ్ఱముల తెరవగు తేరు
నధిరోహించిన కృష్ణార్జునులు
వెంట వెంటనే దివ్యములైన
శంఖములూది గర్జన చేసిరి.

15,16,17,18.
పాంచ జన్యమును కృష్ణుడూదెను.
మ్రోగెను పార్థుని దేవదత్తము
భీకర భీముడు పౌండ్రము పట్టెను.
ఘోషించె నకులుడు సుఘోషణమును

కుంతీ తనయుడు పాండవాగ్రజుడు
అనంత విజయము నూదెనప్పుడు
మణిపుష్పకమును మాద్రీ సుతుడు
విరాట ద్రుపదులు ధృష్ట ద్యుమ్నుడు

మహా బాహుడు అభిమన్యుడును
గొప్ప విలుకాడు కాశీ రాజును
సాత్యకి శిఖండి వుప పాండవులూ
అందరు చేసిరి శంఖారవములు.

19. పాండవ వీరుల శంఖ ధ్వనితో
భూనభోంతరము దద్దరిల్లెను.
ఆ ధ్వని సుయోధనాదులందరి
గుండెలన్నిటిని పిండి వేసెను.

**20,21,22,23.**

కురు పితామహా! వినుము చెప్పెద
ననె సంజయుడు; అంతటనచట
కౌరవ సేనల కలయ చూచిన
కపిధ్వజుండా అర్జునుడప్పుడు

తన గాండీవము చేత పుచ్చుకొని
బాణములుభయులు వేయక మునుపే
ఉభయ సేనల మధ్యన రథమును
నిలుపుము కృష్ణా అని ప్రార్థించెను.

దుష్ట బుద్ధి గల దుర్యోధనునకు
సంగ్రామమ్మున సాయము చేయగ
ఏ ఏ వీరులు ఇక్కడ చేరిరో
వారినందరిని చూడ వలయును.

ఎవరెవరిచ్చట తలపడ నుండిరో
వారిని చక్కగ చూచు నిమిత్తము
ఇరువురి సేనల మధ్యకు రథమును
నడుపుము అంటూ అచ్యుతు గోరెను.

**24,25.**

అర్జును కోరిక వినిన మాధవుడు
రాజుల మధ్యకు రథమును నడిపి
భీష్మ ద్రోణులకు ఎదురుగ నిలిపి
కురువంశజులను చూడమనియెను.

**26,27,28,29,30,31.**

ఉభయ సేనలలో తలపడనున్న
తండ్రులు తాతలు గురువులు మామలు
అన్న దమ్ములు కొడుకులు హితులు
మేనమామలు సుహృదులందరు

బంధులందరిని బాగుగ చూచి
భావావేశము పొందెనర్జునుడు.
శోక తప్తుడై- ఖిన్న వదనుడై
విన్నవించెనిటు శ్రీకృష్ణునితో.
యుద్ధ కాంక్షతో చేరిన ఈ నా
బంధు జనమ్మును చూచిన నాకీ
శరీర మంతా వణుకుచున్నది,
అంగములన్నీ చచ్చు బడినవి.

రోమములన్నీ నిక్క బొడుచుకొనె,
చర్మము మండెను నోరు ఎండెను,
గాండీవము చేజారుచున్నది.
నిలబడుటకునూ సత్తువ లేదు.

మనసు గిర్రున తిరుగు చున్నది.
అపశకునములెన్నోఅగపడుచున్నవి.
యుద్ధమునందున బంధులందరిని
చంపిన లాభము కనపడకున్నది.

**32.** రణమున నాకీ విజయమెందుకు
సుఖభోగములు- రాజ్యము వలదు.
రాజ్యము, భోగము, జీవితమ్ముచే
గోవిందా! మనకేమిటి లాభము ?

**33,34.** ఎవరి కోసమీ రాజ్య భోగములు
సుఖములు కోరుకొంటిమో, అట్టి
గురువులు తనయులు తండ్రులు తాతలు,
మామలు మనుమలు మేనమామలు

బావ మరుదులును సంబంధీకులు
ధనమును గురించి ఆశ వదులుకొని
ప్రాణమునూ తృణ ప్రాయము చేసి
యుద్ధ రంగమున నిలిచిరి కృష్ణా!

35. ముల్లోకాలను ఏలుట కైనా,
నన్నుచంపినా, వారిని చంపను.
ఇక భూలోకపు రాజ్యం కోసం
వేఱుగ చెప్ప వలయునా కృష్ణా ?

36. ఆతతాయులను చంపిన పాపము
మనకందరికీ ఆవహించును.
సుయోధనాదుల చంపగ నేమి
మోదము నాకు కలుగును స్వామి!

37. బంధువులయిన కురుసోదరులను
మనము చంపుట మనకు న్యాయమా?
మన వారిని యిక మనమే చంపి
సుఖవంతులము యెట్లు కాగలము?

38,39. రాజ్య లోభమున చెడిన మనసు గల
సుయోధనాదులు దుష్ట చరితులు
కుల నాశనము, మిత్ర ద్రోహము
బహు పాతకమని వారికి తెలియదు.

వంశ నాశనము చేయుట దోషము
తెలిసి తెలిసి మరి యీ పాపమును
ఆపు ప్రయత్నము ఎందుకు చేయమో
తెలియుట లేదు, తెలుపుము కృష్ణా!

**40,41,42.**

వంశ నాశమున ధర్మము చెడును,
ధర్మము చెడినచో కులమూ చెడును,
ధర్మము విడిచిన స్త్రీలు చెడుదురు,
సతులు చెడినచో కలుగు సంకరము.

సంకర సంతతి నరకము పొందును.
వీరి పితరులకు శ్రాద్ధములుండవు.
తర్పణ క్రియలు లోపించినచో
పితృ దేవతలు గతి తప్పెదరు.

**43,44.**

వర్ణ సంకరులు , కులఘాతకులు
చేసిన దోషపు ఫలితము వలన
జాతి ధర్మములు కుల ధర్మములూ
శాశ్వతంబుగా నాశనమగును.

జాతి ధర్మములు కుల ధర్మములూ
నశియించినచో మనుజులందరికి
నరక నివాసము శాశ్వతమగునని
పెద్దలు చెప్పగ వింటిమి కృష్ణా !

**45,46,47.**

రాజ్య కాంక్షకు లోబడి మనము
బంధు వర్గమును చంప నెంచితిమి.
అంతటి పాపము చేయ బూనుటను
దిగ్భ్రమ వేదన కలుగు చున్నది.

ఆయుధ ధరులై ధార్త రాష్ట్రులు
అస్త్రము వీడి ఎదురు తిరగని
నన్ను చంపినా నాకు మంచిదే
యని అర్జునుడు పలికె కృష్ణునితో.

కలత చెందిన మనసున వెతతో
ధనుర్బాణములు జార విడిచియును
రథమున కూలెను కౌంతేయుడని
ధృత రాష్ట్రునకు తెలిపె సంజయుడు.

**ప్రథమాధ్యాయం సమాప్తం**

# రెండవ అధ్యాయము

# సాంఖ్య యోగము

1. ఆ విధముగ నావేదన భరితుడు
ఖిన్నవదనుడు భిన్నమనస్కుడు
నీరు నిండిన కన్నులు కలిగిన
అర్జును చూచి పలికె నచ్యుతుడు.

2. విషమ సమయమున పామరుని వలె
స్వర్గ ప్రాప్తిని అడ్డగించునది,
అపకీర్తిని కలిగించెడి యీ
మలినమునేల పొందితివర్జున?

3. అధైర్య పడకుము! నీకు తగదు ఇది,
హృది దౌర్బల్యము నీచమయినది,
దానిని నీవు విడిచి పెట్టుమని
అర్జునా! లెమ్మని ఊరడించెను.

4. అంత అర్జునుడు కృష్ణునితోననె;
పూజనీయులగు భీష్మ ద్రోణులతో
యుద్ధ భూమిలో తారసపడి నే
నెదురు బాణములు వేయుట ఎట్లని?

5. మహాపురుషులను చంపుటకంటే
బిచ్చమెత్తుటయే మంచిది కాదా?
నెత్తురోడ్చిన ధన సంపదలను
గురువుల చంపి కుడువ వలయునా?

6. ఎవరు గెలిచెదరో ఎవరోడెదరో
ఏది శ్రేష్ఠమో తెలియకున్నది;
ఎవరిని చంపి బ్రతుక గోరమో
వారే రణమున ఎదురుగ నిలిచిరి.

7. ఆత్మ జ్ఞానము లేని దోషమున
ధర్మ శంకతో నీ శిష్యుడుగా
శరణు కోరితిని నిజముగా ఏది
మంచిదో తెలిపి శాసింపుము నను.

8. శత్రువు లేని సమృద్ధ రాజ్యము
సురాధిపత్యము నాకు వున్ననూ
ఇంద్రియ తాపము, శోకము పోవు
మార్గమేమిటో తెలియకున్నది.

9. అరిభయంకరుడు అర్జునుడప్పుడు
యుద్ధము చేయను గోవిందా యని
హృషీకేశునికి విన్నవించె నని
ధృత రాష్ట్రునితో సంజయుడనెను.

10. ఉభయ సేనల మధ్యమందున
విలపించెడు ఆ పార్థుని చూసి
పరిహాసముతో పార్థ సారథి
పలికెను ఇట్లు కురుకుల భూషణ!

11. ఏడవ దగని వారి కోసము
ఏడుచుచుంటివి నీవు అర్జునా!
చనిన జీవులకై, ఉన్న జీవులకై
పండితులెవ్వరు పరితపించరు .

12. నీవును నేనీ రాజులందరు
ఇంతకు ముందు వున్నవారమే !
ఇక ముందరనూ మనమందరము
ఉండబోమని చెప్పజాలము.

13. బాల్యము యౌవన వార్ధక్యాలు
ప్రతి జీవునిలో మారు నట్లుగా
జీవుడు చేరును మరియొక దేహము
కావున ధీరుడు దుఃఖము చెందదు.

14. ఇంద్రియ విషయపు సంయోగముచే
సుఖదుఃఖములు, శీతోష్ణములు
వచ్చును పోవును తాత్కాలికమవి;
ఓర్చుకో వలయునోయి భారత!

15. సుఖ దుఃఖాదులు సమముగ నెంచి
విషయ వాంఛలకు తాను చలింపక
నిలబడు ధీరుడే మోక్షార్హుడని
తెలుసుకొనుము ఓ పురుషపుంగవా!

16. లేని దానికి ఉనికియే లేదు;
ఉన్నదానికిని లేమి యుండదు;
ఈ రెండిటిలో అంతరార్థము
తత్త్వవేత్తలే చూడగలరయా!

17. విశ్వమంతయు వ్యాప్తి చెందిన
పరమాత్మే శాశ్వతమని యెఱుగుము;
నాశనమొందని ఈ పదార్థము
నెవడును నశింప చేయజాలడు.

18. ఆత్మ నిత్యమూ అప్రమేయము;
ఆత్మకు యెన్నడు నాశన ముండదు;
ఆత్మ ధరించే దేహమే పోవును;
కావున అర్జున యుద్ధము చేయుము!

19. ఆత్మ చంపునని ఎవడనుకొనునో,
చంప బడునని ఎవడనుకొనునో,
ఇరువురు కూడా తెలియని వారే!
ఆత్మ చంపదు, చంప బడదదీ.

20. అనాది నుండి ఉండెడి వాడు;
శాశ్వతంబుగా నిలిచెడి వాడు;
దేహమునందు చంపబడినను,
చంపబడరాని నిత్యుడు వాడు.

21. జన్మ రహితుడని నాశరహితుడని,
ఆత్మ నిత్యుడని అక్షయుడనియు,
తెలిసిన పురుషుడు ఎట్లు ఎవరిని
చంపించును? తా చంపునెవరిని?

22. చిరిగి పోయిన బట్టలు విడిచి,
మనుజుడు కొత్తవి తొడిగినట్లుగా,
అరిగి పోయిన దేహము లుడిగి,
కొత్త దేహములు పొందుచుండును.

23,24. శస్త్రములాత్మను నరక జాలవు;
నిప్పు ఆత్మను కాల్చ జాలదు.
నీరును ఆత్మను తడుపగలేదు;
గాలియు ఆత్మను ఆరబెట్టదు.

నరకుట కాల్చుట తడుపుట కొరకు
ఆరబెట్టుటకు అలవి కాదతడు;
సర్వ వ్యాపి నిత్యుడు స్థాణువు,
ఆత్మ అచలుడు సనాతనుండు.

25. ఇంద్రియములకు ఆత్మ చిక్కడు;
చింత చేసినా మనసుకెక్కడు;
వికారములకూ వివశుడవ్వడు;
కావున నీవిక చింతించకుము.

26. ఎల్ల కాలము జనన మరణము
లున్నవాడిగా ఆత్మను నీవు
తలచినప్పటికీ ఈ విధమ్ముగా
శోకించుటకు తగవు అర్జునా!

27. పుట్టిన వానికి చావు తప్పదు;
చచ్చిన వాడును పుట్టుట తథ్యము!
తప్పించుటకు శక్యము కాని
విషయమునందున శోకము వలదు.

28. పుట్టక మునుపు గిట్టిన పిదప
కంటికగపడని రూపముండును;
నడుమనె ప్రాణికి రూపము కలుగును,
కావున దుఃఖము ఏల అర్జునా ?

29. అద్భుతమని యొకడాత్మను చూచును,
మఱియొక డాత్మను అబ్బురమనును,
వింతగ నాత్మను వినును వేరొకడు
అయిననొక్కడునూ ఆత్మ నెఱుంగడు.

30. అన్ని దేహముల ఆత్మయుందును,
ఎన్నడు కూడా చంపబడ దతడు;
కావున ప్రాణుల గురించి నీవు
చింతించుటకు తగవు అర్జునా!

31. క్షత్రియ ధర్మము తెలిసిన వాడవు;
పరితపించుట నీకు తగదిది !
ధర్మ బద్ధమౌ యుద్ధము కంటెను
క్షత్రియునకు మేలేది యుండును?

32. తాము కోరకయె తమకు లభించిన
తెరచిన స్వర్గము వంటి రణమిది!
అట్టి యుద్ధము దక్కిన రాజులు
సుఖము పొందెదరు తప్పక పార్థా!

33. ధర్మ బద్ధమౌ రణమును నీవు
సలపక పోయిన కారణంబున,
రాజ ధర్మమును, కీర్తిని విడిచి
పాపము తప్పక పొందెదవర్జునా!

34. నీవు పొందిన ఈ అపవాదును
జనులు స్మరించెద రెల్లకాలము;
మన్నన పొందిన నరులకపప్రథ
చావు కంటెను హీనము గాదె!

35. మన్నన చేసిన మహారథులును
చులకనచేసి మాటలాడుదురు;
యుద్ధ భయమున పారిపోతివని
తలతురు వారు తరతరాలుగా!

36. అంతియ కాక అహితులందరు
నీ సామర్థ్యము నిందించెదరు;
కూడని మాటలు కూసెదరర్జున!
అంతకు మించిన ఆర్తి వుండునా?

37. చంపబడినచో స్వర్గము దొరకును!
రణమున గెలిచిన రాజ్యమేలుదువు!!
కావున నీవు దృఢ నిశ్చయముతో
కయ్యము చేయగ లెమ్ము అర్జునా!

38. సుఖ దుఃఖాలు లాభ నష్టములు
గెలుపు ఓటములు సమముగ నెంచి
యుద్ధము చేయగ సిద్ధమయినచో
పాపము నీవు పొందకుందువు.

39. సాంఖ్య శాస్త్రమున చెప్పబడిన యీ
జ్ఞానము నీకు తెలిపితి పార్థా!
కర్మ బంధనము విడిపించెడిదగు
యోగ జ్ఞానమును తెలిపెద నిపుడు.

40. ప్రారంభించిన కర్మ యోగము
నిష్ఫలమవదు దోషము రాదు;
స్వల్పమైననూ యీ ధర్మము మహా
భయములనుండి రక్షణ యిచ్చును.

41. కర్మయోగము అనుష్ఠించుటకు
బుద్ధి నిలకడగ ఉండవలయును;
దృఢ నిశ్చయము లేని వారికి
పరిపరి విధముల బుద్ధి చలించును.

42. వేదార్థములలో మునిగెడి జనులు,
వేదమే వేదము అనెడి విమతులు,
పండ్లు కాయని పువ్వుల వంటి
వట్టి మాటలు వదరుచుందురు.

43. మనసు నిండుగా కోరిక నింపి,
భోగ భాగ్యములు పొందుటకొరకు,
స్వర్గ సుఖాలను అనుభవించుటకు,
కర్మకాండలు చేయుచుందురు.

44. భోగ భాగ్యముల లాలస పరులు
దైవ ధ్యానము చేయుట కొరకు
నిశ్చల బుద్ధిని, ఏకాగ్రతను,
అనుష్ఠానమున అనుసరించరు.

45. త్రిగుణ విషయముల కష్ట సుఖాల
యోగ క్షేమముల లంపట వదలి
శుద్ధ తత్త్వమును పొందుము నీవు
ఆత్మ జ్ఞానివి అగుము అర్జునా!

46. చిరు కూపమ్మున గల యుపయోగము
మహా జలములతో కలిగిన రీతిని,
సకల వేదములు నొసగెడి ఫలము
ఆత్మజ్ఞానియగు ద్విజునందుండును.

47. కర్మము చేయుటయే నీ ధర్మము;
ఫలము కోరుటకు లేదధికారము!
కర్మ ఫలములకు కర్తవు కాకుము;
కర్మలు చేయుట మానబోకుము!!

48. యోగ నిష్ఠలో సంగము విడిచి
ఫలితమందినా అందక పోయినా,
ఒకటే యనుకొని కర్మలు చేయుము;
ఈ సమత్వమునే యోగమందురు.

49. ఫలము కోసము చేసెడి కర్మలు
బుద్ధి యోగము కంటె హీనములు;
కర్మఫలములు కోరెదరల్పులు;
కావున బుద్ధిని శరణము కోరుము.

50. బుద్ధిమంతుడీ లోకము లోనే
పాప పుణ్యములు విడుచును కాన,
యోగము చేయగ సిద్ధము కమ్ము;
కర్మాచరణలో నిపుణతే యోగము.

51. బుద్ధిమంతులగు వివేకవంతులు,
కర్మ ఫలమును వీడిన వారై,
జన్మ బంధమును తప్పించుకొని
మోక్షము పొందు చున్నారు కదా!

52. మోహపు మురికిని తొలగించుకొని,
బుద్ధి నిర్మలమయిన తదుపరి
వినదగినవియు, వినిన వాటిపై
వైరాగ్యము తో మసలెద వప్పుడు.

53. పరిపరి విధముల బోధలు వినివిని,
కలత చెందిన నీ మానసము
అచల ధ్యానమున స్థిరముగ నిలిచి
నప్పుడె యోగము పొందెదవీవు.

54. సమాధి నున్న స్థిత ప్రజ్ఞుని
లక్షణమేమిటి? భాషణమెట్టిది?
ఎట్లు వుండునతడెచటనుండును?
అని యడిగెను శ్రీకృష్ణునర్జునుడు.

55. మనసున కోరిక లన్నియు విడిచి,
ఆత్మ చేతనే ఆత్మ తృప్తిని
పొందిన వాడే స్థిత ప్రజ్ఞుడని
పలికె పార్థునితో ఆ భగవంతుడు.

56. కష్ట కాలమున కలత చెందక,
సుఖసమయమ్మున సంబరపడక,
ప్రీతియు, భయము, కోపము లేని
సాధువునే స్థిత ప్రజ్ఞు దందురు.

57. విషయము లందతిప్రీతి నొందక,
మంచి జరిగితే సంతోషమును,
చెడు చేకూరిన కావేషమును,
చూపని వాడే ప్రజ్ఞావంతుడు.

58. అంగములన్నియు లోనికి ముడిచే
తాబేలు వలే యోగియు యింద్రియ
కాంక్షలు వెనుకకు మరల్చినపుడే
జ్ఞానము స్థిరముగ వుండునతనికి.

59. విషయ వాంఛలను విడిచినప్పటికీ
విషయ వాసనను విడువడు జీవుడు;
పరమాత్మను దర్శించిన తదుపరి
విషయ వాసనలు వీడును జీవుని.

60. మోక్ష సాధనకు యత్నము చేసెడి
పండితుడైన పురుషుని మనసును
వ్యాకుల పరచెడు యింద్రియ వాంఛలు
బలవంతముగా లాగుచుండు గదా!

61. ఇంద్రియ వాంఛలు కట్టడి చేసి
చిత్తము నా యెడ స్థిరముగా నిలుపుము;
ఇంద్రియ నిగ్రహమెవ్వనికుండునో,
అతని జ్ఞానమే సుస్థిరమైనది.

62. విషయ ధ్యాసతో వున్నమనుజునకు
ఆ విషయాలపై మోజు కలుగును;
మోజు చేతనే కోరిక కలుగును;
కోరిక తీరక కోపము వచ్చును.

63. కోపముతో నున్మాదము పెరుగును;
ఉన్మాదముతో మఱపు గలుగును;
మఱపు వచ్చినచో తెలివి నశించును;
తెలివి నశించిన మనిషి నశించును.

64. మనసును అదుపున ఉంచిన వాడు,
ఇంద్రియములను వశము చేసుకుని,
విషయములన్ని అనుభవించుచు,
మనసున శాంతిని పొందుచుండును.

65. మనః శాంతితో మసలెడు వానికి
సకల దుఃఖములు సమసి పోవును;
ప్రసన్నమైన మనసు వున్నచో
బుద్ధి వేగముగా స్థిరత నొందును.

66. ఇంద్రియ నిగ్రహి కాని వానికి
బుద్ధి ఉండదు, చింతన కలుగదు;
చింతన లేనిచో శాంతి ఉండదు;
శాంతి లేనిదే సుఖమెక్కడిది?

67. ఇంద్రియ వాంఛకు మనసు బానిస
అయినచో యింద్రియ ప్రజ్ఞ నంతయు
నీటిలో నావను యెదురు గాలి
ఈడ్చిన విధముగా నీడ్చునా మనసు.

68. ఎవ్వడు విషయపు వాంఛల నుండి
ఇంద్రియములను సంపూర్ణముగా
నిగ్రహించునో, ఆతని జ్ఞానము
సుస్థిరమైనది మహా బాహుడా!

69. సకల ప్రాణులకు చీకటి వేళ,
యోగీశ్వరునికి జాగృతివేళ!
సకల ప్రాణులకు పగటి వేళలు,
మునీశ్వరునికి మాపటి వేళలు.

70. నిశ్చలోదధిలో చేరు నీటి వలె,
ఎవనిలో కోరికలెల్ల లీనమగు;
నాతడు శాంతిని పొందును కానీ,
విషయాసక్తుడు శాంతిని పొందదు.

71. ఏఏ మనుజుడు కామములందున
ఆశను విడిచి, మమకారమును,
అహంకారమును వీడి చరించునో,
ఆతడు శాంతిని పొందుచుండును.

72. ఇపుడు చెప్పిన బ్రాహ్మీ స్థితిని
పొందిన వానికి మోహముండదు;
చరమాంకముననూ అట్టి మనుజుడు
బ్రహ్మ నిర్వాణము పొందును పార్థా!

**ద్వితీయాధ్యాయం సమాప్తం**

# మూడవ అధ్యాయము

# కర్మ యోగము

1. జ్ఞానమే కర్మముకన్నా మేలని
నీ అభిమతము అయినచొ కేశవా !
ఘోర కర్మమును నన్ను ఎందుకు
చేయమందువని అడిగెనర్జునుడు.

2. తికమక పెట్టే ఉపదేశముతో
నా మనసంతా కలవరపెడితివి;
కర్మ, జ్ఞానముల నేది మంచిదో
ఖచ్చితముగ ఒక దాని చెప్పుమనె.

3. జ్ఞానయోగము సాంఖ్యుల కొరకు,
కర్మ యోగము యోగుల కొరకు,
ఈ లోకమున రెండు నిష్ఠలని
మునుపే చెప్పితిననె భగవానుడు.

4. కర్మలనాచరించని మనుజుడు
నిష్క్రియమగు స్థితి పొంద జాలడు;
సన్న్యసించినయంత మాత్రమున
మోక్ష సిద్ధిని పొందనే లేడు.

5. కర్మము చేయక ఒక క్షణమైనను
ఊరక వుండడు యే మానవుడును
ప్రకృతి సిద్ధమగు గుణముల చేత
కర్మలు వివశత నందరు చేతురు.

6. కర్మేంద్రియములను కట్టడి చేసియు,
మనసున ఇంద్రియవాంఛలు నింపి
ఆలోచించెడి మూర్ఖ మానవుని
కపట యోగియని వ్యవహరించెదరు.

7. ఇంద్రియములను మనసున అణచి,
కర్మేంద్రియముల వినియోగించి,
అనాసక్తుడై కర్మ యోగమును
చేసెడివాడే శ్రేష్ఠుదర్జునా !.

8. శాస్త్రము చెప్పిన కర్మలు చేయుము;
కర్మము చేయ కుండుట కంటెను
కర్మము చేయుట శ్రేష్ఠము; కర్మము
చేయక దేహపు యాత్రయు సాగదు.

9. లోకహితార్థము కర్మలు చేయక
ఇతర కర్మలనే లోకులొనర్తురు;
అర్జునా! లోకహితమగు కర్మలు
అపేక్ష లేక ఆచరించుము.

10. యజ్ఞము తోడుత ప్రజల సృజించి,
బ్రహ్మ దేవుడు పలికెను పూర్వము;
యజ్ఞము చేసి వృద్ధి పొందుడని
కోరిన కోర్కెలు తీర్చునదియని.

11. యజ్ఞము సురలను తృప్తి పరచును,
సురలును మిమ్ముల దీవించెదరు;
ఒకరినొకరు ఆనంద పరచుకొని
పరమ శ్రేయము పొందుడు మీరని.

12. యజ్ఞ తుష్టులై దేవతలందరు
మీకిష్టమగు భోగము లిత్తురు;
తిరిగి వారికి సమర్పించకయే
భుజియించినచో దొంగతనమది.

13. యజ్ఞ సమర్పణ పిదప ప్రసాదము
తినిన సుజనులకే పాపము రాదు;
తమ వుదరముకై వండి భుజించెదు
వారు పాపమే భుజించుచుందురు.

14. అన్నము వలన ప్రాణులు పుట్టును,
మబ్బులు కురిసిన అన్నము వచ్చును,
యజ్ఞము చేసిన మబ్బులేర్పడును,
మంచి పనులచే యజ్ఞమలరును.

15. బ్రహ్మనుండియే కర్మ జనించును,
అక్షరమందున బ్రహ్మ పుట్టును,
కావున బ్రహ్మము సర్వ వ్యాపియై,
నిత్యము యజ్ఞమునందే వుండును.

16. ఈ విధముగ నియమించిన చక్రము
ఎవడు లోకమున ఆచరించడో,
ఆతడు పాపియు యింద్రియ లోలుడై
వ్యర్థ జీవితము గడుపును పార్థా !

17. ఆత్మ క్రీడను ఆత్మ తృప్తిని
ఆత్మానందం చవిగొన గలిగి
నట్టి మానవుడు చేయవలసిన
కార్యము ఏదియు లేదని తెలియుము.

18. అట్టి జ్ఞానికి యిలలో కర్మను
చేసిన లాభము, చేయక దోషము
కలుగవు; లబ్ధి కోసము ప్రాణుల
నాశ్రయించు పని యేదియు వుండదు.

19. అందు చేతను అపేక్ష లేకయే
చేయదగిన తగు కార్యము చేయుము;
సంగ రహితుడై కార్యము చేసెడి
పురుషుడు మోక్షము పొందును కాదా .

20. జనకాదులు నిష్కామ కర్మలచే
మోక్షము పొందిరి; జనులకు మంచి
మార్గము చూపగ నాలోచించియు
కర్మలు నీవు చేయ వలయును.

21. పెద్దలు చేసెడి పనులను చూచి
తక్కిన జనులవి అనుసరింతురు;
పెద్దల నడవడి ప్రామాణికమయి,
లోకము దానిని అవలంబించును.

22. ముల్లోకాలలో కొంచెమైనను
నేను చేయదగు కార్యము లేదు;
పొందబడనిది పొందవలసినది
లేకపోయినా కర్మలు చేతును.

23. ఎందు చేతనన జాగరూకతన
ఎప్పుడూ కర్మలు చేతును నేనే;
కర్మలు చేయనిచో ఈ మనుజులు
అనుసరింతురు నన్నే అర్జున!

24. ఈ కర్మలు నే చేయకున్నచో
లోకులందరు చెడిపోదురు గద !
సంకరమునకు కర్తనవుదును;
వారు చెడుటకు కారణమవుదును.

25. కర్మలొనర్తురు అజ్ఞులాశతో;
అనాసక్తులై, జ్ఞానులు లోకపు
కళ్యాణార్థము కార్యశీలురై
కర్మాచరణము కావించగ వలె.

26. కర్మసంగియగు ప్రజ్ఞావంతుడు,
తాను యుక్తుడై, అజ్ఞానులకు
బుద్ధి చాపల్యము కలుగజేయక
సత్కర్మలనే చేయించ వలెన్.

27. ప్రకృతి యందలి గుణముల వలన
పలు విధములుగ జరుగు కర్మలకు,
అహంకారమున బుద్ధి హీనుడు
తానే కర్తగ తలచుచుండును.

28. గుణకర్మముల తారతమ్యములు
బాగుగ తెలిసిన తాత్త్విక పురుషుడు
గుణముల యందే గుణములుండునని
తలచి తరించును కర్మములంటక.

29. ప్రకృతి యందలి గుణముల చేత,
గుణ కర్మలలో మునిగి తేలెడి
అల్పజ్ఞు లను మంద మతులను
ఆత్మజ్ఞులు చలియింప గూడదు.
చలింపజేయగ దగదాత్మజ్ఞుడు

30. ఆధ్యాత్మికమగు మనసుతో నాకు
అన్ని కర్మలను సమర్పించుము;
ఆశలు విడిచి మమతను మరచి
దిగులు చెందక రణము చేయుము.

31. ఏ మనుజులు నా అభిమతమ్మును
అసూయ లేకయు శ్రద్ధ గలిగియు
అనుదినము నను అనుసరింతురో,
వారును కర్మవిముక్తి పొందెదరు.

32. నేను చెప్పిన ఈ అభిమతమును
ద్వేషముతో పాటించనివారు
బుద్ధిహీనులుగ, జ్ఞానహీనులుగ,
చెడినవారుగా నీవెఱుంగుము.

33. జ్ఞానవంతుడును, సకల ప్రాణులు
తమ ప్రకృతికి అనుగుణమ్ముగా
ప్రవర్తించును; కావున మనుజుడు
నిగ్రహించినను ఫలితముండదు.

34. ప్రతి ఇంద్రియపు విషయము లందు
రాగ ద్వేషములు యేర్పడి యున్నవి;
వాటికి మనుజులు లొంగ కూడదు;
ఆ రెండును ఆతనికి శత్రువులు.

35. గొప్పదైన పర ధర్మము కంటెను
తక్కువైనా తన ధర్మమే మంచిది;
సొంత ధర్మమున చావును మంచిదే !
పరుల ధర్మము భయంకరమది.

36. అంతట కృష్ణుని అర్జునుడడిగెను;
అయినచోఈ నరుడిష్టములేకయె
దేని ప్రేరణతో బలవంతముగా
పనిగట్టుకొని పాపము చేయును?

37. ఈ పాపములను చేయించునవి
రజమున బుట్టిన కామక్రోధములు;
తృప్తి లేనివవి, మోక్షప్రాప్తికి
అవరోధములని తెలిపె మాధవుడు.

38. నిప్పును పొగలు కమ్మినట్లుగా,
మురికిచే అద్దము మాసినట్లుగా,
మావిలో శిశువు దాగినట్లుగా
కామము ఆత్మను కప్పుచున్నది.

39. సంద్రము వలెను, అగ్నిచందమున
తుష్టి చెందనిది కామము; కావున
జ్ఞానులకిది యొక నిత్య శత్రువీ
కామము కప్పును ఆత్మ జ్ఞానమును.

40. ఇంద్రియములును, బుద్ధి, మనసు
ఈ కామమునకు ఆశ్రయమిచ్చును;
వీనిచే కామము తెలివిని కప్పి
మనుజుని మోహవివశుని చేయును.

41. కావున అర్జున! ఇంద్రియవాంఛలు
నిగ్రహించుము; పాపరూపమై
బుద్ధి జ్ఞానము నాశము చేసెడి
కామము తప్పక పూర్తిగ వీడుము.

**42.** ఇంద్రియమ్ములు గొప్పవి; కానీ
వాటి కంటెను మనసు గొప్పది;
మనసు కంటెను బుద్ధి గొప్పది;
బుద్ధిని మించినదాత్మ యందురు.

**43.** కనుక అర్జునా! బుద్ధి కంటెను
ఆత్మ గొప్పదని బుద్ధి తెచ్చుకొని
మనసును అణచి అజేయుడగు ఆ
కామశత్రువును కాల్చివేయుము.

**తృతీయాధ్యాయం సమాప్తం**

# నాల్గవ అధ్యాయము

# జ్ఞాన యోగము

1. నాశము లేని ఈ యోగమును
ఆదిలో నేను రవికి చెప్పితిని;
దినమణి మనువుకు, మనువిక్ష్వాకుకు
చెప్పిరనుచు భగవానుడు పలికెను .

2. తరతరాలుగా వచ్చిన యోగము
రాజర్షులకు తెలిసి యుండెను;
కాలక్రమమున ఈ లోకమ్మున నది
కనుమరుగైనది కుంతీ నందన!

3. నాకు హితుడవు, భక్తుడవీవు;
కాన ఉత్తమము రహస్యమైన
పూర్వకాలపు యోగము నిప్పుడు
నీ కోసమే నే చెప్పుదునర్జున !

4. సూర్యుని తదుపరి నీవు పుట్టిన
ట్లయినచో, ఆదిలో ఆ సూర్యునికే
నీవు చెప్పినా వనుటేరీతిని
ఎరుగ వలెనని అనియె అర్జునుడు.

5. నీకును నాకును ఎన్నో జన్మలు
గడచి పోయినవి కుంతీ నందన!
వాటన్నిటిని నేనెరుంగుదును
నీకు తెలియవని అనె భగవానుడు.

6. చావు పుట్టుకలు లేని వాడిని
ప్రాణులకు నేను నియంతనైనను,
స్వీయ ప్రకృతిని వశపరచుకొని,
ఆత్మ మాయతో అవతరింతును.

7. ఎప్పుడు ధర్మము దారి తప్పునో,
అధర్మాలకూ అంతముండదో,
అప్పుడు నేనే నా అంతటనే
అవతరించెదనయ్య అర్జునా!

8. మంచివారిని కాపాడుటకును,
చెడ్డవారిని నశింపజేయుటకు,
ధర్మము చక్కగ స్థాపించుటకై
యుగ యుగాన నేనవతరించెద.

9. దివ్యమైన నా జన్మ కర్మలను
నిజముగ ఎరిగిన యే నరుడైనా,
ఇంకో జన్మను యిలలో పొందక
నన్ను చేరునో శ్వేతవాహనా!

10. భయము కోపము రక్తిని వీడి,
మనసును నాపై లగ్నము చేసి,
అండను చేరిన ఎంతో మంది
జ్ఞాన పునీతులై నన్ను పొందిరి.

11. ఎవరేవిధముగ నన్నుకొలుతురో
వారినటులనే ఆదరించెదను;
మనుజులందరు నా మార్గమును
అన్ని విధముల అనుసరించెదరు.

12. కర్మఫలమును కోరెడి వారు
దేవతలను యిల పూజించెదరు;
మానవ జగతిలో కర్మ ఫలములు
త్వరగ కలుగునని భావించెదరు.

13. గుణ కర్మమ్ముల ఆధారముగా
నాల్గు వర్ణములు నే సృష్టించితిని;
దీనికి కర్తను నేనే అయినను
కర్తను కాదని నీవు యెఱుగుము.

14. కర్మలు నాకు అంటవనియును,
కర్మ ఫలములందాశ లేదనియు,
ఈ విధముగా నన్నెవడు యెరుగునో
అతనిని కర్మలు కట్టడి చేయవు.

15. ఇది తెలిసికొని పూర్వఋషులచే
కర్మములన్నియు చేయబడినవి;
కావున నీవు పూర్వులు చేసిన
అతి పురాతన కర్మలు చేయుము.

16. ఏది కర్మమో ఏది అకర్మమో
తెలియక కవులే మోహము చెందిరి;
అశుభమునుండి విముక్తి నిచ్చెడి
కర్మము నిప్పుడు తెలిపెద నీకు.

17. కర్మల గతి కడు గూఢమగుటను
కర్మ స్వరూపం తెలుసుకోవలెను !
వికర్మవిషయము గ్రహింపవలయును;
అకర్మసంగతి యెరుగ వలయును.

18. కర్మములందు అకర్మములను,
అకర్మములలో కర్మ చూడగల
మానవు డతడు బుద్ధిమంతుడు;
కర్మాచరణుడు యోగయుక్తుడు.

19. జ్ఞానానలమున దహింప బడిన
కోరిక పూనిక లేని కర్మములు
ఎవడు చేయునో, అట్టి వానిని
పండితుడంచు విజ్ఞులనెదరు.

20. కర్మఫలముపై కాంక్షలు లేని
నిత్యతృప్తునకు, నిరాశ్రయునకు,
కర్మము లన్నీ చేయుచున్ననూ
ఇసుమంతైనా కర్మ మంటదు.

21. ఆశలు లేని ఇంద్రియ నిగ్రహి
వస్తు వాంఛలను విడిచిన వాడై,
శారీరకమగు కర్మలు చేసినా,
పాపము నాతడు పొందకుండును.

22. ద్వంద్వాతీతుడు, చిరుసంతోషి,
సిద్ధినసిద్ధిని సమముగ నెంచి
మాత్సర్యము మది లేనివానికి
కర్మము చేసినా బంధన మంటదు.

23. రాగ సంగములు వీడి, జ్ఞానమును
మనసున నిలిపి, యజ్ఞము కొరకై
కర్మము చేసెడి నరుని కర్మములు
సంపూర్ణముగా కరగి పోవును.

24. బ్రహ్మార్పణము, హవ్యము బ్రహ్మ,
అగ్ని బ్రహ్మము, హోత్రియు బ్రహ్మ,
బ్రహ్మ కర్మములు నిష్ఠతో జరిపిన
హోతయు పొందెడి ఫలము బ్రహ్మమే!

25. కొందరు యోగులు దైవ చింతనను
యజ్ఞము వలెనే ఆచరించెదరు;
కొందరు యజ్ఞము చేత జీవుని
బ్రహ్మాగ్నిలోన హోమము సేతురు .

26. అర్జున ! కొందరు జ్ఞానేంద్రియములను
నిగ్రహాగ్నిలో వ్రేల్చుచుండగా,
శబ్దాదులను కొందరు జనులు
ఇంద్రియాగ్నిలో వ్రేల్చుచునుందురు.

27. మరియు కొందరు సర్వములైన
ఇంద్రియకర్మలు, ప్రాణకర్మలు,
జ్ఞానదీపితము ఆత్మ సంయమపు
యోగానలమున హోమము సేతురు.

28. ద్రవ్యయజ్ఞమును చేతురు కొందరు;
యతులును దృఢమతులైన వ్రతులును,
యోగము, జ్ఞానము తపో యజ్ఞములు
జరిపెడివారు మరియు కొందరు.

29. కొందరు ప్రాణాయామ ప్రవణులు,
అపానమందున ప్రాణవాయువును
ప్రాణమునందపాన వాయువును
ప్రాణాపానము లాపి వ్రేల్తురు;

30. కొందరు మితముగ ఆహారము తిని
ప్రాణములను ప్రాణములో వ్రేల్తురు;
వీరందరును యజ్ఞవేత్తలు;
యజ్ఞ ఫలితమున పాపరహితులు.

31. యజ్ఞములందలి శిష్టామృతమును
తిన్నవానికి బ్రహ్మము దొరకును;
యజ్ఞము చేయని నరునికర్జునా !
ఇహమే లేదు పరమెక్కడిది?

32. ఈ విధముగ పలు యజ్ఞములన్నీ
వేదములందు చెప్ప బడినవి;
కర్మజములని వీటిని నీవు
తెలుసుకొన్నచో మోక్షమొందెదవు.

33. ద్రవ్యమయముగా చేసిన యజ్ఞము;
కంటెను శ్రేష్ఠము జ్ఞాన యజ్ఞము
అవినాశనమగు జ్ఞానమునందు
కర్మమంతయు ముగియునర్జునా!

34. తత్త్వవేత్తలగు జ్ఞానుల వద్ద
అట్టి జ్ఞానమును దండము పెట్టి,
సేవలు చేసి, ప్రశ్నలు వేసి
ఉపదేశముగా పొంద వలయును.

35. ఏ జ్ఞానముతో మోహము రాదో,
అన్నిజీవులలో, నీలో, నాలో
ఆత్మను సమముగా పొడగాంచెదవో
అట్టి జ్ఞానమును యెరుగుము పార్థా!

36. పాతకమెక్కువ చేసిన మనుజుల
కంటె పాపములు నీవు చేసినా,
పాపములన్నియు జ్ఞానవావచే
సులువుగా నీవు తరించగలవు.

37. అర్జున! బాగుగ రగిలిన మంట
కట్టెను బూడిద చేసినట్లుగా,
సర్వకర్మలను జ్ఞానానలము
భస్మీపటలము చేయుచున్నది.

38. జ్ఞానము వంటి పవిత్రమైనది
ఈ లోకములో లేనే లేదు;
అట్టి జ్ఞానమును యోగసిద్ధుడు
తనలో తానే పొందగలుగును.

39. శ్రద్ధాసక్తులు, ఇంద్రియసంయతి
కలిగినవాడు జ్ఞానము పొందును;
జ్ఞానము పొంది పరమ శాంతిని
అతి శీఘ్రముగా పొందగల్గును.

40. సంశయాత్ముడు, శ్రద్ధా జ్ఞానము
లేని మనుజుడు నశించి పోవును;
సంశయాత్మునకు సుఖముండదు మరి;
ఇహపరలోకము లసలే వుండవు.

41. యోగము చేతను కర్మము వీడి,
జ్ఞానము వలన శంకలు తొలగి
ఆత్మ నిష్ఠతో నలరిన వారికి
కర్మబంధనములుండవర్జునా!

42. అర్జున! కావున అజ్ఞత వలన
నీ మది కలిగిన యీ అరమరను
జ్ఞానఖడ్గముతో ముక్కలు చేసి
యోగమునాచరింపగ లెమ్ము!

చతుర్థాధ్యాయం సమాప్తం

# అయిదవ అధ్యాయము

# కర్మ సన్న్యాస యోగము

1 కర్మలత్యాగము మరియు యోగమును
లెస్సగా నీవు పొగడితివయ్యా !
ఇందులోన నొకటేది మంచిదో
చెప్పుము కృష్ణా అనెను పార్థుడు.

2. సన్న్యాసమును కర్మ యోగమును
రెండునూ మోక్షము కలుగ చేసినా,
త్యాగము కంటెను కర్మయోగమే
శ్రేష్ఠమైనదని కృష్ణుడు చెప్పెను.

3. ద్వేషము కాంక్షలు లేని మనుజుడు
నిత్యత్యాగియే తెలియుమర్జునా !
ఏల యనగ నా ద్వంద్వరహితుడు
బంధ విముక్తిని సులువుగ పొందును.

4. సాంఖ్యము, యోగము రెండూ వేరని
మూర్ఖులందురు పండితులనరు;
వీటిలో ఒక్కటి చక్కగా చేసినా
రెండిటి ఫలితము పొందునాతడు.

5. సాంఖ్యులు పొందే స్థానము ఏదో
యోగులు కూడా దానినందుదురు;
సాంఖ్యము యోగము ఒక్కటేయని
చూచిన వాడే చూడగలుగును.

6. యోగము లేనిదే సన్న్యాసమును
పొందుట చాల కష్టమర్జునా!
యోగము చేసెడి ముని పుంగవుడు
వేగమే బ్రహ్మము పొందుచుండును.

7. యోగయుక్తుడు, జితమనస్కుడు
ఇంద్రియజేత, శుద్ధహృదయుడు
ప్రాణుల ఆత్మను తన ఆత్మ వలె
తలచిన వానికి కర్మము లంటవు.

8,9. తత్త్వవేత్తయగు యోగయుక్తుడు
విన్నను, కన్నను, తినిన, తాకిన,
వాసనచూసినా, నడిచిన, విడిచిన,
నిద్రపోయినా, ఊపిరిపీల్చిన,
కనులు మూసినా, తెరిచిన, పలికిన,
ఇంద్రియములు విషయాసక్తములని
నిశ్చయించుకొని లేశమైనను
తానుగా చేయుట లేదని తలచును.

10. ఎవడు కర్మలను బ్రహ్మకు నొసగి
కోరిక విడిచి కర్మలు చేయునో,
నీటదడవని తామరాకు వలె
అతనికి పాపము అంటకుండును.

11. ఫలాసక్తిని ప్రక్కన బెట్టి
ఆత్మ శుద్ధికై యోగి పుంగవులు
ఇంద్రియమ్ములు, మేనూ మనసు
బుద్ధి చేతను కర్మ చేయుదురు.

12. కర్మఫలములను వీడి యుక్తుడు
ఆత్మనిష్ఠతో శాంతిని పొందును;
కర్మఫలములు కోరి అయుక్తుడు
కర్మల చేత బంధితుడగును.

13. ఇంద్రియ నిగ్రహమున్న మనుజుడు
అన్ని కర్మలు మనసా విడిచి,
ఏమి చేయకను, చేయింపకను
నవరంధ్రపు పురినుండును హాయిగ.

14. ఇలలో కర్మము, కర్తృత్వమును,
కర్మఫలాలను ఒసగడు దేవుడు;
గుణముల కనుగుణముగనే అయ్యవి
ప్రకృతి వల్లనే కలుగుచున్నవి.

15. ఎవరి పాపమును యెవరి పుణ్యమును
దేవుడెన్నడు స్వీకరింపడు;
జ్ఞానమునజ్ఞత కప్పుట చేత
ప్రాణులు మోహము నొందుచుందురు.

16. ఆత్మజ్ఞానముచేత నెవ్వరి
అజ్ఞత అంతము చేయబడినదో
వారి జ్ఞానము ఆదిత్యుని వలె
బ్రహ్మమును ప్రకాశింప జేయును.

17. ఆ పరమాత్మను తెలిసిన వారు,
ప్రీతితో మనసున నిలిపినవారు,
నిష్ఠను కలిగి జ్ఞానము చేతను
పాపము తొలగి మోక్షమొందెదరు.

18. విద్యా వినయము కలిగిన వానిని,
విప్రుని, గోవును, వేపి నేనుగును,
శునక మాంసమును తినెడి వానిని
సమముగ చూచెడి వారు జ్ఞానులు.

19. మనసున సమతా భావము నింపిన
వారిహమునసే సర్గము గెలుతురు;
బ్రహ్మము దోషము లేనిదగుటచే
వారు బ్రహ్మమును చేరియుందురు.

20. నిశ్చలమనసుతో మోహము లేక
బ్రహ్మమున నుండు బ్రహ్మ జ్ఞాని
ప్రియము కలిగిన సంతసమొందదు
అప్రియమైనను ఆర్తినొందదు.

21. బయటి సుఖము లందాశలు లేక
ఆత్మలోసుఖమును పొందెడివాడు
బ్రహ్మయోగమును, ఆత్మను కలిగి
శాశ్వతమైన సుఖమును పొందును.

22. స్పర్శాదులచే కలిగెడి సుఖములు
దుఃఖ మిచ్చునవి, క్షణికములైనవి;
కావున అర్జున! వివేకవంతుడు
ఆ భోగమ్ములలోన రమింపదు.

23. ఎవ్వడు దేహము విడువక మునుపే
కామక్రోధముల పుట్టిన క్షోభను
నివారించుటకు సాహసించునో
అతడే యోగి సుఖ వంతుడును.

24. ఆత్మను సుఖించు నాత్మను రమించు
ఆత్మలో వెలుగు కలిగిన యోగి
బ్రహ్మ స్వరూపము కలిగిన వాడై,
బ్రహ్మ నిర్వాణ పదమును పొందును.

25. పాపము శంకయులేని వారలు
సకల జీవుల హితము గోరెడి
ఆత్మనిగ్రహులు, ఋషిపుంగవులు
బ్రహ్మ నిర్వాణము పొందుచుందురు.

26. కామ క్రోధములు విడిచిన వారికి,
మనసును అణచిన బైరాగులకు,
ఆత్మతత్త్వమును తెలిసిన యతులకు
బ్రహ్మనిర్వాణము అంతటా కలుగును.

27,28. బాహ్య సుఖములను బయటకు నెట్టి,
కనుబొమ మధ్యను చూపునుపెట్టి,
ముక్కు రంధ్రముల సంచరించెడి
ప్రాణాపానముల సమముగ చేసి,
ఇంద్రియములను మనసును బుద్ధిని
నియంత్రించుకొని, కోపము భయము
కోరికలు విడి మోక్షము కోరెడి
ముని యెప్పుడును ముక్తుడే అగును.

29. యజ్ఞములకును, తపస్సులకును,
నన్ను భోక్తగను, సర్వేశ్వరునిగ,
సకల ప్రాణులకు హితకారకుడిగ
ఎరిగిన మనుజుడు శాంతిని పొందును.

**పంచమాధ్యాయం సమాప్తం**

# ఆరవ అధ్యాయము

# ఆత్మ సంయమ యోగము

**1.** కర్మఫలము నందాశలు లేని
కర్మాచరణుడే యోగి, బైరాగియు;
హోత్రము, క్రియలు విడిచినవాడు
యోగి బైరాగియు కాడనె దేవుడు.

**2.** సన్న్యాసమునే యోగమందురని
అర్జున నీ మది నెఱుగుము; ఏలన,
సంకల్పములను విడవనివాడు
ఎవడును సంయమి కానే కాడు.

**3.** యోగమునందు పైకి ఎదుగుటకు
కర్మయే మునికి సాధనమగును;
యోగిశ్రేష్ఠునికి శాంతచిత్తత
సాధనమగునని చెప్పబడినది.

**4.** మనుజుడెప్పుడు ఇంద్రియములలో,
కర్మలందును తగులుకొనకను,
సంకల్పములను విడిచి పెట్టునో
అప్పుడే అగును యోగారూఢుడు.

**5.** తనకు తానుగా ఎదగవలయును;
తనకు తానుగా పడిపోకూడదు;
ఏలన తనకు తానే బంధువు
తనకును తానే శత్రువు అగును.

6. తన మనసును తాను జయించిన
మనసే ఆత్మబంధువు అగును;
మనసును అదుపున వుంచనివానికి
మనసే శత్రువు మించిన శత్రువు.

7. ఇంద్రియ జితుడు శాంతచిత్తుడు
చలివేడిమిలో, కష్ట సుఖాలలో,
సన్మానములో, అవమానములో
పరమాత్మయందున స్థిరముగనుండును.

8. జ్ఞానవిజ్ఞానతృప్తచిత్తుడు
నిర్వికారుడు ఇంద్రియజేత
రాయిని మట్టిని వసువును సమముగ
నెంచెడి యోగియే యోగయుక్తుడు.

9. ఉపకారులను హితుల, సాధులను,
బంధుల, పాపుల, శత్రువర్గముల,
మధ్యవర్తులను, యీర్ష్యాపరులను
సమముగ చూచెడివాడే శ్రేష్ఠుడు.

10. ఒంటిపాటుగ, చాటున యోగి
మేనును మనసును అదుపున వుంచి,
ఇతరులనుండి యేది చేకొనక
మనసునాత్మలో లీనముచేయును.

11,12. బల్ల పరుపుగా నున్నస్థలమున,
స్థిరముగ నుండే దర్భ చాపపై,
జింక చర్మము, ఆపై వస్త్రము
కప్పిన పీఠము నేర్పరుచుకొని,

అచ్చట కూర్చొని ఏకాగ్రతతో
ఇంద్రియములను మనసును అణచి,
అంతః కరణము శుద్ధి చేయుటకు
యోగము బాగుగ నేర్వవలయును.

13,14. మేను, మెడ, తల నిలువుగ నిలిపి,
కదలక మెదలక దిక్కులు చూడక,
ముక్కు చివరనే చూపును నిలిపి,
మిక్కిలి శాంతిని మదిలో నింపి,

బ్రహ్మ చర్యమును ఆచరించుచు,
భయమును వీడి మనసును ఆపి
చిత్తమునందున నను పూజించి
శరణు కోరినచో వాడు యుక్తుడగు.

15. మనసును కట్టడి చేసిన యోగి
సదా మనసులో ధ్యానించుచును;
నా యందున్నపరమానంద
స్వరూపమైన శాంతిని పొందును.

16. తిండిబోతుకు, నిరాహారునకు,
అతిగా నిద్రలో గడిపే వానికి,
ఎక్కువ మేల్కొని వుండే వానికి
యోగము కలుగనే కలుగదు పార్థా!

17. మితాహారము, మిత విహారము,
కర్మములందున సదాచారము,
మితముగ నిద్ర, మెలుకువ వున్నచో
యోగము దుఃఖమ్మును హరించును.

18. మనసును గట్టిగ కట్టడి చేసి,
ఎప్పుడు ఆత్మలో నిలిపే వుంచి,
కోరికలన్నీ కొండెక్కించిన
ఆతని నప్పుడు యుక్తుడందురు.

19. ఆత్మధ్యానము నభ్యసించెడి
నియత చిత్తుడగు యోగి మనస్సు,
గాలి వీచని స్థలమున దీపము
వోలె నిలకడగ నిలిచియుండును.

20,21,22,23.

యోగము వలన నిగ్రహమందిన
మనసు శాంతిని పొందెడు చోటు,
మనసున ఆత్మస్వరూపము చూచి
పరమానందము పొందెడు చోటు,

ఇంద్రియమ్ములకు కనపడనిది,
బుద్ధికి మాత్రమే అర్థమగునది,
సుఖమున్నదని స్వానుభవమున
స్థిరమగు యోగికి తెలిసిన చోటు,

పొందిన తదుపరి యితరము లేవీ
అధికము కావను తలపునిచ్చునది,
దుఃఖమున్నను కొంచెమైనను
బాధను కలగనివ్వకుండునది,

దుఃఖము దూరము చేయు మార్గమది !
అదియె యోగమను పేరున ఉన్నది;
ప్రశాంత మనసుతో నట్టి యోగము
పట్టుదల తోడ పొందదగినది !

**24,25.**

సంకల్పముతో కలుగు కోర్కెలను
సంపూర్ణముగా ప్రక్కన పెట్టి,
ఇంద్రియమ్ములను మనసు చేతనే
అన్నివైపులా అడ్డగించియు,
ధైర్యముగా తన బుద్ధి చేతను
మెల్ల మెల్లగా విశ్రమించవలె;
ఆపై మనసును ఆత్మలో నుంచి
ఇతర విషయములు ఎంచరాదయా!

**26.** నిలకడ లేని చపలపు మనసు
ఎచ్చటెచ్చట తిరుగు చుండునో,
అచ్చట నుండే దానిని మరల్చి
ఆత్మకు నప్ప జెప్పవలయును.

**27.** శాంతచిత్తుడు, దోషరహితుడు,
రాజస గుణములనుడిగినవాడు,
బ్రహ్మ రూపుడగు ధ్యాన యోగిని
బ్రహ్మానందము పొందుచున్నది.

**28.** ఈ రీతిని తన మనసునెల్లపుడు
ఆత్మలో నిలిపిన దోషము లేని
యోగి సులువుగా ఉత్తమమైన
బ్రహ్మానందము పొందుచుండును.

**29.** సర్వము సమమను యోగయుక్తుడు
అన్నిప్రాణులు తనలోనివిగను,
ప్రాణులన్నిట తానున్నటులను
సమాన దృష్టితో చూచుచుండును.

30. అన్ని ప్రాణులలో నేనున్నటుల,
నాలో అన్నీ ప్రాణులున్నటుల
చూచెడి వానికి నేను కనపడనా?
నాకును అతడు కనపడకుండునా?

31. ప్రాణులన్నిట నన్నే చూచుచు
పరమము ఒకటే యనుచు కొలిచెడి;
యోగి నడవడి యెట్టులున్నను
నాలో అతనికి స్థానముండును.

32. సుఖమూ దుఃఖము తనకెట్లుండునో,
అన్నీ ప్రాణులకు అట్లె వుండునని
సమముగా అన్నిట చూడగలిగిన
యోగి శ్రేష్ఠుడని అందురర్జునా!

33. సమభావముచే పొంద గలిగెడి
నీవు చెప్పిన స్థిరయోగ స్థితి
చాపల్యమున తెలియుట లేదని
అర్జును డనెను ఆ మాధవునితో.

34. బలము బటువు కలిగిన మనసు
నిలకడ లేనిది కీడు చేయునది;
గాలిని కట్టడి చేసిన విధముగ
కష్టతరముగా ఉన్నది కృష్ణా !

35. అందుకు సందియమెందుకర్జునా !
మనసు చంచలము అణచలేనిది;
అభ్యాసము మఱి వైరాగ్యముచే
అణచ వచ్చునని అనెను కృష్ణుడు.

36. మనసును కట్టడి చేయని వానికి
యోగము పొందుట సాధ్యము కాదు;
కట్టడి చేసి యుక్తితో పూనిన
పొందవచ్చునని నే తలచెదను.

37. శ్రద్ధ యున్నను సంయతి లేక,
యోగము తప్పి యోగ సిద్ధిని
పొందలేనిచో అతనికి యేగతి
కలుగును కృష్ణా ! అనె అర్జునుడు.

38. యదుకుల తిలకా! బ్రహ్మమార్గమున
స్థిరముగ లేని మొండిబండడు
ఇహమూ పరము రెండింటికి చెడి
చెదిరిన మేఘము వలె నశించదా?

39. నా సంశయమును సంపూర్ణముగా
పోగొట్టుటకు నీవే తగుదువు;
దీనిని పోగొట్టేందుకు కృష్ణా !
నీ కంటెను వేరెవ్వరు లేరుగా!

40. పార్థా! వానికి ఈ లోకమున
పరలోకమున వినాశముండదు;
మంచి కర్మములు చేసిన వాడు
ఎవడును దుర్గతి పొందడు సుమ్మీ!

41. యోగ భ్రష్టుడు పుణ్యపురుషుల
లోకము చేరును; పలు వర్షములు
అచ్చట గడిపి సదాచారులగు
శ్రీమంతుల గృహమందు పుట్టును.

42. అట్లు కానిచో బుద్ధిమంతులగు
యోగుల కుల మందైన జనించును;
ఈ రకమైన జన్మము యిలలో
దొరుకుట చాల కష్ట సాధ్యము.

43. పూర్వ జన్మపు సంస్కారముచే
జ్ఞాన సంగమము పొందు నాతడు;
కావున మరలా యోగ సిద్ధికై
యత్నము చేయును కుంతీ తనయా!.

44. పూర్వాభ్యాసము చేత వివశుడై
యోగమునకు అతడాకర్షితుడగు;
యోగము నేర్వగ తలచినంతనే
వేద కర్మముల పరిధి తరించును.

45. పూనికతో కడు యత్నము జేసెడి
యోగియు పాప విమోచన పొంది,
గత జన్మలలో పొందిన సిద్ధితో
ఉత్తమ గతిని పొందును పిదప.

46. తపసి కంటెను యోగి శ్రేష్ఠుడు;
జ్ఞానుల కంటెను, కర్మము చేయు
వారి కంటెను యోగియే అధికుడు;
కావున యోగివి కమ్ము అర్జునా!

47. యోగులందరిలోన యెవ్వడు
మనసును నా యందున నిలిపి
శ్రద్ధతో నన్ను కొలుచుచుండునో
అతడు శ్రేష్ఠుడని నాఅభిమతము.

**షష్ఠాధ్యాయం సమాప్తం**

# ఏడవ అధ్యాయము

# విజ్ఞాన యోగము

1. మనసున నన్ను శరణము కోరి
యోగము చేయుచు సంపూర్ణముగా
అరమర లేక అరయు పద్ధతిని
పార్థా ! వినుమని పలికెను దేవుడు.

2. దేనిని తెలిసిన తదుపరి యిలలో
తెలియగ నేదియు మిగిలియుండదో,
విజ్ఞానము గల ఆ జ్ఞానమును
చెప్పెద నీకు సంపూర్ణముగా.

3. వేలమందిలో ఒకానొకండు
సిద్ధి కోసము యత్నము సేయును;
ఆ సిద్ధులలో ఒకానొకండు
నన్ను నిజముగ తెలియ గల్గును.

4. నింగీ నేలా నీరూ నిప్పూ
పవనము మనము బుద్ధియు మదమని
నా యీ ప్రకృతి ఎనిమిది విధముల
విభజన చేయబడి యున్నదయా.

5. ఈ ప్రకృతి కడు అల్పమైనదే!
దీనికి భిన్నము, జీవరూపమై
జగమును ధరించు నాదు ప్రకృతి
శ్రేష్ఠమైనదని తెలియు మర్జునా!

6. సకలజీవులు పరాపరములగు
ప్రకృతిమూలమున పుట్టుచున్నవి;
సకల చరాచర జగతిని నేనే
సృష్టించెదను, నశింప జేతును.

7. నాకంటెను కడు శ్రేష్ఠమైనది
వేరేదియును లేదు ధనంజయ!
దారమునందున మణిపూసల వలె
నాలో జగతి కూర్చబడినది.

8. నీటిలో రుచిని నింగిలో ధ్వనిని
సూర్యచంద్రుల కాంతిని నేను;
పురుషులలో పౌరుషమ్మును, శ్రుతులలో
ప్రణవము నేనే పార్థా! తెలియుము.

9. పుడమి యందలి పుణ్య గంధమును,
అగ్నియందలి వెలుగును నేను;
సకల జీవుల లోని ప్రాణమును,
తాపసులందలి తపసును నేను.

10. బీజము నేనే ప్రాణి కోటికి,
బుద్ధిమంతుల బుద్ధిని నేను;
తేజమును తేజస్వుల యందని
తెలిసి కొనుము ఓ కుంతీ నందన!

11. భరత శ్రేష్ఠా ! బలవంతులలో
రాగము కామము లేని బలమును;
ప్రాణులందున ధర్మ బద్ధమగు
కామము నేను అయి వున్నాను.

12. సత్త్వ రాజస తమో గుణములు
నా మూలముగా కలుగుచున్నవి;
కాని వానిలో నేను లేనయా !
అవియే నాలో యిమిడి వున్నవి !

13. పైన చెప్పిన మూడు గుణముల
మైకమున భ్రమ జెందును జగము;
వీటి కంటెను పరమ నిత్యుడను-
నన్నుమాత్రము యెఱుగ కున్నది.

14. దైవికమున్ను త్రిగుణ మయమగు
నాదు మాయను దాటుట కష్టము;
నన్నెవరైతే శరణు జొత్తురో,
వారు మాయను దాటంగలరు.

15. పాపకర్ములు, మొండిమనుషులు,
మాయ చేత మతి పోయిన వారు,
రాక్షస బుద్ధిని కలిగిన వారు,
మనుజాధములు నన్ను కొలవరు.

16. ఆపదలోన నున్నవాడును,
డబ్బుకోరెడి మనుజుడు, జ్ఞాని,
జిజ్ఞాసువు నా నలుగురు పుణ్యులు
నన్నుకొలిచెదరు కుంతీనందనా!

17. వారిలో యెప్పుడు పరమాత్మజ్ఞుడు
ఏకభక్తుడగు జ్ఞాని శ్రేష్ఠుడు;
జ్ఞానికి నేను యెంతో యిష్టము;
నాకును అంతే యిష్టమతనిపై.

18. వీరందరును సుజనులైనను,
జ్ఞానియే నేనని నా అభిమతము;
నాయందాతడు చిత్తము నిలిపి
ఉత్తమ గతికై నన్నే నమ్మును.

19. ఎన్నో జన్మల చివరన జ్ఞాని
అంతయు వాసుదేవుడే అని
నన్ను చేరును; అట్టి మహాత్ముడు
అంత సులభముగ దొరుకుట కష్టము.

20. స్వీయ ప్రకృతిచే ప్రేరేపితులై,
యావతో తెలివి మాలిన జనులు
ఆయా నియమము లాచరించుచు
ఇతర దేవతలను కొలుచుచుందురు.

21. ఏ యే భక్తుడు యే దేవతను
శ్రద్ధతో పూజలు చేయగోరునో,
ఆయా భక్తుని కవసరమైన
స్థిరమగు శ్రద్ధ నేను కలిగింతు.

22. అట్టి శ్రద్ధతో కూడిన భక్తుడు
ఆ దేవతను ఆరాధించును;
నేను విధించిన ఆ కోరికలను
ఆ దేవతలు అతని కిచ్చెదరు.

23. అల్ప బుద్ధులగు వారు పొందెడి
ఫలము యెల్లపుడునుండదు పార్థ!
సురపూజలచే సురలనొందెదరు;
నను పూజించిన నన్నె పొందెదరు.

24. నాశనమొందని సర్వోత్తమమగు
నా స్వరూపమును తెలియని విమతులు
గోచరించని నను సాధారణ
మనుజుని లాగా మనన చేయుదురు.

25. యోగ మాయచే కప్పబడిన నే
నెవరికి కూడా కనపడకుందును;
తెలివి లేని ఈ లోకులు నాకు
పుట్టుక గిట్టుట లేవని యెరుగరు.

26. చని పోయినవి, బ్రతికి యున్నవి
రాబోవనున్న ప్రాణులన్నిటిని
నే నెరుంగుదును కుంతీ నందన!
కానీ నన్నే యెవడును యెరుగడు.

27. ఈ లోకమున రాగద్వేషమున
కలిగిన ద్వంద్వవ్యామోహముచే
సకల ప్రాణులు అజ్ఞానమును
పొందుచున్నవి ఓ పరంతపా !

28. పుణ్య కర్మలు చేయుటచేతను
పాపవిముక్తిని పొందిన మనుజులు
ద్వంద్వమోహమును వీడిన వారై
నియమ నిష్ఠలతో నన్ను భజింతురు.

29. ముదిమి మరణముల విముక్తి కొరకు
నా అండకొని, పూనెడివారు
సకలాధ్యాత్మను, సకల కర్మమును
బ్రహ్మమే యని యెరుగుచుందురు.

30. అధిభూతమును అధిదైవమును
అధియజ్ఞమును కూడిన నన్ను
తెలిసిన వారు మరణము నందునూ
స్థిర చిత్తముతో నన్నెరుగుదురు.

**సప్తమాధ్యాయం సమాప్తం**

# ఎనిమిదవ అధ్యాయము

# అక్షర పర బ్రహ్మ యోగము

1,2. ఓ పురుషోత్తమ ! నీవు చెప్పిన
బ్రహ్మము ఏది? కర్మము ఏది?
ఆధ్యాత్మమని, అధిభూతమ్మని,
అధిదైవమ్మని వేటి నందురు?

ఈ మేనున అధియజ్ఞుడు ఎవరు?
అతనిని గూర్చి తెలియుట ఎట్లు?
ప్రయాణ దశలో నియతాత్ములు నిను
ఎట్లెరుగుదురని అర్జును డడిగెను.

3. శ్రేష్ఠము, నాశము లేనిదె బ్రహ్మము,
స్వభావమును అధ్యాత్మమందురు;
జీవ సృష్టికై చేయు విసర్గము
కర్మమ్మగునని చెప్పెను దేవుడు.

4. నశించు వస్తువు అధిభూతమగు,
విరాట్పురుషుడే అధిదైవతము;
ఈ దేహములో అధియజ్ఞుడను
నేనే అగుదును మానవోత్తమా !

5. ఊపిరి పోయే వేళను కూడా
నన్ను తలచుచు కట్టెను విడిచే
మనుజుడు నా స్వరూపము నొందును;
కావున నిందున లేదు సంశయము.

6. మరణ కాలమున యే భావమును
తలచుచు దేహము నెవడు వీడునో
ఆ యా భావ ప్రభావము చేతను,
ఆ యా రూపము పొందునాతడు.

7. కావున నన్ను అన్నివేళలా
స్మరణము చేయుము, రణము నొనర్పుము.
మనసును, బుద్ధిని నాకర్పించిన
నిస్సంశయముగ నన్నే పొందెదవు.

8. అభ్యాసయోగము కలిగి, యితరమౌ
విషయమ్ములకు వెళ్ళని మనసున
నరుడు స్మరించి దివ్యమైన ఆ
పరమపురుషుని పొందును పార్థా!

9,10. భక్తితో నెవడు చివరి రోజులలో,
తన వూపిరిని భ్రుకుటిని నిలిపి,
సర్వజ్ఞుడు, ప్రాచీనుడు, ధాతయు,
శాసన కర్తయు, చిన్మయ రూపుడు,
సూర్య తేజుడు, సూక్ష్మరూపుడా,
తామస దూరుని నెమ్మది మదిని
చింతించినచో పరమదివ్యుడగు
ఆపరమాత్మను పొందునాతడు.

11. వేద కోవిదులు అవినాశమని
దేనినందురో, రాగము వీడిన
యతులు దేనిని చేరుచున్నారో,
దేనిని కోరి బ్రహ్మ చర్యమును
పాటించెదరో ఆ స్థానమును
సంక్షిప్తముగా చెప్పెద నీకు.

12,13.

సకలేంద్రియములు కట్టడి చేసి,
మనసును హృదిని గట్టిగ నిలిపి,
శిరమున నూపిరి సరిగా బిగిసి,
ఆత్మయోగమున స్థిరముగ కూర్చొని,
బ్రహ్మరూపమగు ఓంకారమును
పలుకుచు నన్ను స్మరణము చేయుచు,
తన దేహమును వీడే మనుజుడు
పరమ మోక్షమును పొందుచుండును.

14. ఇతరములేవియు మదిలో నుంచక
సతతము నన్నే స్మరించి, నిత్యము
ధ్యానచింతనలో వున్న యోగికి
సులువుగ నేను అందెదనర్జున !

15. తలమానికమగు మోక్షము పొందిన
గొప్ప మనుషులు నన్ను చేరుదురు;
వారికి మరల దుఃఖమయమగు
అస్థిరమైన జన్మముండదు.

16. బ్రహ్మలోకపర్యంత లోకము
లన్నిట మరలా జన్మము కలుగును;
నన్ను చేరిన వారికి మాత్రము
ఇంకో జన్మము వుండదర్జునా!

17. బ్రహ్మకు పగలు వేయి యుగములని
బ్రహ్మకు రాత్రియు వేయి యుగములని
ఎరిగిన జనులు పగలు రాత్రుల
తత్త్వము తెలిసిన వారలగుదురు.

18. పొద్దుపొడుపున ప్రకృతి నుండియే
సకల చరాచరములు జనించును,
రాత్రి రాకతో ఆ వస్తువులు
అదే ప్రకృతిలో లయము చెందును.

19. పైనచెప్పిన ప్రాణి సమూహము
కర్మవశమున పుట్టియు పుట్టియు
రాత్రి రాగనే లయమగుచున్నవి;
ఉదయము పూటనే పుట్టుచున్నవి.

20. కావున ప్రకృతి కంటెను వేఱగు
పరమ భావమది, గోచరించనిది;
అనాది వస్తువు; అన్ని ప్రాణులు
అంతమయినను అంతము కానిది.

21. కంటికగపడని నాశరహితుడిని
ఉత్తమ గతిగా విజ్ఞులు తెలిపిరి;
ఎచటకు చేరిన మరలా పుట్టరో
అదియే కద నా పరంధామము.

22. తనలో ప్రాణులిమిడినవాడు,
సకలజగతిని నిండిన వాడు,
పరమ పురుషుడతి నిశ్చలమైన
భక్తి చేతనే దొరుకు నర్జునా !

23. ఏ కాలములో చని పోయినచో
యోగులు మళ్ళీ పుట్టకుందురో,
యే కాలములో మరల పుట్టుదురో
వివరించెదను వినుము అర్జునా!

24. అగ్ని, జ్యోతి, పగలు, శుక్లమును,
ఉత్తరాయణ పుణ్యకాలమున
కాలము చెందిన బ్రహ్మవేత్తలగు
జనులందరును బ్రహ్మమొందెదరు.

25. ధూమము, రాత్రి, కృష్ణపక్షము,
దక్షిణాయనము నున్నసమయమున
వెడలిన యోగి చంద్రప్రకాశము
పొందిన పిదప మరలివచ్చును.

26. చీకటి వెలుగుల గతులు రెండును
జగతికి శాశ్వతమందురు; మరల
జన్మము కలుగదు ఒక గతి చేతను;
పునర్జన్మమును రెండవదిచ్చును.

27. అర్జునా!యిట్టి రెండు మార్గములు
తెలుసుకొన్న యే యోగి అయినను
మోహము చెందదు; కావున పార్థ!
యోగ యుక్తుడవగు మెల్లప్పుడు.

28. ఈ సంగతులను యెరిగిన యోగి,
వేదములందును, యజ్ఞములందును,
దానము లందును, తపసులందును
యేయే ఫలములు కలుగు ననుచును
చెప్పబడినవో, వానిని మించిన
పుణ్య ఫలములు పొందుచుండును.
అంతియే కాక ఆద్యమైనదగు
పరమ పదమును పొందుచుండును.

**అష్టమాధ్యాయం సమాప్తం.**

## తొమ్మిదవ అధ్యాయము

# రాజ విద్యా రాజ గుహ్యా యోగము

1. పాపము నుండి విడిపించునది,
అతిరహస్యము, విజ్ఞానము గల
ఈ జ్ఞానమును నీకు చెప్పెద
నని భగవానుడు పలికె నరునితో.

2. ఈ జ్ఞానము అతి మర్మము, మేటియు,
అరయదగినది, ధర్మయుక్తము,
పావనమైనది, నాశము లేనిది,
అనుష్ఠించుటకు సులభమైనది.

3. ఈ ధర్మము నెడ శ్రద్ధ చూపని
మనుజులు నన్ను పొందక అర్జున!
మృత్యు రూపమగు సంసారములో
మాటిమాటికీ తిరుగుచుందురు.

4. గోచరించని రూపము గలిగిన
నాచే జగము వ్యాపితమైనది;
సకల ప్రాణులు నా యందున్నవి,
వానిలో నేను వుండుట లేదు.

5. వైభవమగు నా యోగము చూడు !
నాలో ప్రాణులుండవు; నా ఆత్మయె
ప్రాణుల జనన రక్షణ చేయును;
అయినను ప్రాణుల నాత్మ ఉండదు.

6. ఏ విధమ్ముగా నంతట తిరిగెడి
గాలి ఎప్పుడూ నింగి నుండునో,
ఆ విధముగనే సకల ప్రాణులు
నా యందుననే కలవని యెఱుగుము.

7. సకల జీవులును కల్పాంతమున
నా ప్రకృతిని చేరుచున్నవి;
వానిని మరల సృష్టి ఆదిలో
నేను సృజింతును ఓ కౌంతేయా!

8. ప్రకృతి వశమ్మై స్వేచ్ఛలేనిదగు
సమస్తమైన జీవజాలమును
నా ప్రకృతిని అవలంబించి
మరల మరల సృష్టించుదును.

9. అట్టి కర్మలలో నిరాసక్తుడిగా
ఉదాసీనుడిగా ఉందును నేను;
కావున నన్నాకర్మము లేవియు
కట్టివేయవు ఓ ధనంజయా!

10. నేనే అధిపతి నగుట చేతను,
ప్రకృతి నాచే స్థావర జంగమ
జగతినంతటిని పొలయు చున్నది;
అందుననే అది నడుచుచున్నది !

11. సకల ప్రాణులకు నే యజమానిని;
మానవ రూపము ధరించినాడను;
నా నిజ రూపము యెరుగని మూర్ఖులు
నన్నే అవమానించుచుందురు.

12. వట్టి ఆశలు లొట్ట కర్మలు
మట్టి బుర్రలు కలిగిన వీరు
బుద్ధి హీనులై, మోహము చేసెడి
రాక్షస ప్రవృత్తి నెంచుకొందురు.

13. దైవ స్వభావము కల మహాత్ములు
జీవులకాదిగ, నాశరహితుడిగా
ఎరిగిన వారై, యితరము మనసున
తలచక నన్నే కొలుతురర్జున !

14. వారెల్లప్పుడు నను కీర్తించుచు,
వ్రతములు చేయుచు, పూనిక నొంది,
భక్తితో నాకు దండములిడుతూ
నిత్యయుక్తులై నను సేవింతురు.

15. జ్ఞానయజ్ఞముచే కొలుతురు కొందరు;
ద్వైత భావమున మరికొందరును;
అద్వైతముననను, విశ్వ రూపుడని
పరిపరివిధముల నను సేవింతురు.

16. క్రతువును నేను, యజ్ఞము నేను,
మంత్రము నేను, ఆజ్యము నేను,
అగ్ని, ఔషధము, ఆహుతి నేనే !
హోమ కర్మమును కూడా నేనే !!

17. ఈ జగమునకు నేనే తండ్రిని,
తల్లిని, తాతను, సంరక్షకుడను,
పావనమైన ఓంకారమును,
ఋక్కును, సామ, యజుర్వేదమును.

18. గతియును నేను, పతియును నేను,
ప్రభువు, సాక్షి, నివాసము, శరణము,
హితుడను, స్థితిలయకరుడను నేను,
నిధానమవ్యయ బీజము నేను.

19. తాపము నాచే కలుగును పార్థా!
కురిపించెద నాపించెద వానలు;
మరణామృతములు, మంచి వస్తువు
చెడు వస్తువును నేనే అయితిని.

20. మూడు వేదములు చదివిన వారు,
పాపము తొలగినవారు, సోమపులు,
యజ్ఞము చేసి నను పూజించి
స్వర్గ ప్రాప్తిని కోరుచుందురు.
వారందరునూ పుణ్య ఫలమున
దేవలోకమును పొందిన వారై,
స్వర్గ లోకమున దివ్యములైన
దేవభోగములననుభవింతురు.

21. అటులను వారా విశాలమైన
స్వర్గలోకముననను భవించుచు
చేసిన పుణ్యము తరిగి పోవగ,
మానవ లోకము తిరిగి వత్తురు.
పిమ్మట వారు వేదధర్మములు
అనుష్ఠించినను, కామాదులలో
వాంఛలు చావక చావుపుట్టుకల
రాకపోకలను కలిగి యుందురు.

22. ఇతర చింతనలు లేక యే జనులు,
నన్ను తలచుచు, ఉపాసించుచు,
నిత్యము నాలో నిష్ఠనుందురో
వారి యోగమును క్షేమము చూచెద.

23. ఇతర దేవతల పట్ల భక్తియు,
శ్రద్ధను కలిగి ఆరాధించెడి
వారును నన్నే అవిధిపూర్వముగ
ఆరాధింతురు కుంతీ నందన!

24. సకల యజ్ఞముల భోక్తను నేనే;
ప్రభువును నేనే వారు నిజముగా
నన్నెఱుంగరు; కావున భువిలో
పునర్జన్మకు జారి పోవుదురు.

25. దేవతలను పూజించెడివారు
వారి సన్నిధిని పొందుచుందురు;
పితృ దేవతల పూజలు చేసిన
పితృ దేవతల దయ పొందెదరు.
భూతములను పూజించువారలు
ఆ భూతములనే చేరుకొందురు;
నన్ను మాత్రమే కొలిచిన భక్తులు
నన్నుమాత్రమే పొందుచుందురు.

26. ఆకో అలమో ఫలమో జలమో
భక్తితో నెవ్వడు నాకర్పించునో,
ఆ పుణ్యాత్ముడు భక్తితో యిచ్చిన
వాటిని నేను ప్రీతిగ తినెదను.

27. నీవు చేయునది, నీవు తినునది,
దానమిచ్చునది, తపసు చేయునది,
యజ్ఞమునూ నాకర్పణ చేసి
ధన్యుడవగుము ఓ ధనంజయ!

28. ఈ విధంబుగా కర్మఫలములను
సన్న్యసించియు, పాపపుణ్యముల
ఫలమున కలిగిన కర్మబంధములు
పాయగా నీవు నన్ను పొందెదవు.

29. ప్రాణులన్నియును ఒకటే నాకు !
ద్వేషియు నిష్టుడు లేనే లేరు;
భక్తితో కొలిచెడి వారిలో నుండెద !
వారును నాలో నిలిచియుందురు.

30. దురాచారములు కలవాడైనా
మనమున స్థిరముగ ఉండిన వాడై,
ఏకభక్తి తో నన్నుకొలిచినచో,
మంచివాడుగా మన్నన పొందును.

31. ధర్మాత్ముడుగా నతడు మారును;
శాశ్వతమైన శాంతిని పొందును;
నాదు భక్తుడు నాశమొందదని
ప్రతిన చేయుము కుంతీనందన !

32. పాప జన్మము కలవారైనను,
స్త్రీలు, వైశ్యులు, శూద్రులైనను,
నన్నే నమ్మి శరణము కోరిన
పరమ పదమును పొందుట తథ్యము

33. ఇంకిట పుణ్యులు, విప్రులు, భక్తులు,
రాజర్షుల సంగతి చెప్పనేల ?
నిత్యము కానిది సుఖము లేనిదగు
ఈ లోకమున నన్ను భజింపుము.

34. నాలో మదినిడి నా భక్తుడవై,
నను పూజిస్తూ, నమస్కరిస్తూ,
చిత్తమ్మున నను యుక్తముచేసి
నన్నేకొలిచిన నన్ను పొందెదవు.

**నవమాధ్యాయం సమాప్తం**

# పదవ అధ్యాయం

# విభూతి యోగము

1. సంతసమందిన కుంతీపుత్ర!
నీకు మేలును చేయగోరి నే
మంచిమాటలను మరల చెప్పెదను,
ఆలకింపుమనె ఆ భగవానుడు.

2. వేల్పుల కంటెను, ఋషులకంటెను
అన్నిట ఆద్యుడనగుట చేతను,
నా ఉత్థానము సురలకు తెలియదు;
మహాఋషులకును అసలు తెలియదు.

3. అనాది పురుషుగా, లోక నియంతగా,
అజునిగ నన్ను యెరిగిన మనుజుడు,
మోహరహితుడై సకల పాపముల
నుండి విముక్తుడు అవుచున్నాడు.

4,5. బుద్ధి, జ్ఞానము, మోహరిక్తత,
సహనము, సత్యము, దమము, శమము,
కష్టసుఖాలు, చావు పుట్టుకలు,
భయము, ధైర్యము, హింస లేమియు,
సమతా భావము, సంతుష్టియును,
తపమూ, దానము, కీర్తి, యపప్రథ
ప్రాణులనుండు పరిపరి విధముల
భావమ్ములు నావలన కలుగును.

6. లోకమునందలి ప్రజలందరికి
పూర్వజులయిన సప్తమహర్షులు,
సనకాదులును మరి మనువులును
నా సంకల్పము వలన జనించిరి.

7. నా వైభవమును యోగశక్తిని
యథార్థముగ ఎవడరయుచున్నాడో,
నిశ్చలమైన యోగమునాతడు
పొందుననుటలో సందియమెందుకు?

8. నేనే అంతయు సృష్టించితినని
నా వలనంతయు నడుచుచున్నదని
తెలిసిన విజ్ఞులు, భక్తి భావమును
కలిగిన వారై నన్ను భజింతురు.

9. నాయందే మది నిలిపిన వారు,
నా యెడ ప్రాణము నిలిపినవారు,
నన్నుతెలిసి కొని చర్చించుకొని
ఆత్మ తృప్తితో ఆనందింతురు.

10. అనవరతము నాయందు ప్రీతిని
చూపుచు కొలిచే వారలు నన్ను
పొందగలిగెడి మార్గము అయిన
బుద్ధి యోగమును ప్రసాదింతును.

11. వారందరిపై దయచూపుటకై
నేనే వారి ఆత్మలో చేరి
బాగుగ వెలిగే జ్ఞానజ్యోతితో
అజ్ఞానతమము నంతము చేయుదు.

12,13. అంతట పార్థుడు చెప్ప సాగెను;
పరబ్రహ్మవు, పరంధాముడవు,
పరమ పునీతుడ వీవు నిత్యుడవు,
దివ్యపురుషుడవు, ఆది దేవుడవు,
జన్మము లేని సర్వవ్యాపివని,
నారదుడసితుడు, వ్యాసదేవలురు
మున్నగు ఋషులు మునుపే చెప్పిరి;
అదియే నీవును చెప్పుచుంటివి.

14. ఓ భగవంతుడ! నాకు చెప్పినవి
అన్నీ నిజమని తెలియును; కాని
నీ నిజ రూపము దేవతలెరుగరు;
దానవులకును తెలియదు కేశవ!

15. ఓ పురుషోత్తమ! భూత భావనా!
దేవ దేవుడా! జగన్నాథుడా!
నీ స్వరూపమును నీవే స్వయముగ
ఎరుగుదువయ్యా యాదవాగ్రణీ!

16. ఏ మహిమలచే నీవీ జగముల
వ్యాపించితివో, దివ్యములగు ఆ
మహిమలన్నిటిని సంపూర్ణముగా
వివరించుటకు నీవే తగుదువు.

17. యోగేశ్వర! యే విధముగ నిన్ను
ధ్యానము చేయుచు తెలిసికోగలను?
ఏ రూపములో నిను ధ్యానించగ
తగినవాడవో తెలుపుము దేవా!

18. ఓ జనార్దనా! నీ యోగమును
వైభవమంతయు విస్తారముగా
మరలా చెప్పుము; అమృతవాక్కది;
ఎంతవినినను తనివి తీరదుగా!

19. అర్జునా వినుము! నా వైభవములలో
ముఖ్యమైనవి మాత్రమే చెప్పెద;
ఏలన, నాదు విభూతి విస్తృతికి
అంతము లేదని పలికెను దేవుడు.

20. సకల జీవుల హృదయము లోపల
ఆత్మను నేనే అయి వున్నాను;
జీవుల యొక్క పుట్టుక నేను!
స్థితిని లయమును నేనే అర్జునా!

21. ఆదిత్యులలో విష్ణువు నేను;
జ్యోతిస్సులలో సూర్యుడ నేను;
వాయువులందున మరీచి నేను;
చుక్కల లోన చంద్రుడ నేను.

22. వేదములందున సామ వేదమును;
వేల్పులలో నే దేవేంద్రుడను;
ఇంద్రియాలలో మనసును నేను;
ప్రాణుల యందలి చైతన్యమును.

23. రుద్రులలో నే శంకరుండను;
యక్షరాక్షసుల కుబేరుండను;
అష్ట వసువులందగ్నిని నేను;
పర్వతములలో మేరువు నైతిని.

24. పురోహితులలో ముఖ్యుడు అయిన
బృహస్పతినని యెఱుగుము పార్థ !
సేనానులలో కుమారస్వామిని;
సరస్సు లందున సాగరమ్మును.

25. మహాఋషులలో భృగు మహర్షిని;
వాక్కులలో నే నేకాక్షరమును;
యజ్ఞములందున జపయజ్ఞమును;
స్థావరములలో హిమాలయమును.

26. వృక్షజాతులలో రావి చెట్టును;
నారదుడను నే దేవర్షులలో;
చిత్రరథుడను గంధర్వులలో;
సిద్ధులలోన కపిలుడనయితిని.

27. అశ్వములందునమృతము తోడుత
పుట్టిన వుచ్చైశ్రవమును నేను;
ఏనుగులందున ఐరావతమును;
మానవులందున రాజును నేను.

28. ఆయుధములలో వజ్రాయుధమును;
పాడి యావులలో కామ ధేనువును;
మనుజుల జన్మకు మన్మథుండను;
సర్పములందున వాసుకి నయితిని.

29. నాగులలోన అనంతరాజును;
జల దేవతలలో వరుణుడ నేను;
అర్యముడను నే పితృ దేవతల;
శిక్షకులందున యముడను నేను.

30. అసురులలో నే ప్రహ్లాదుడను;
గణకులలో నే కాలమునయితిని;
మృగ జాతులలో సింహము నేను;
గరుత్మంతుడను పక్షుల లోన.

31. వేగవంతులలో గాలిని నేను;
శస్త్రధారులలో శ్రీ రాముడను;
జలచరములలో మొసలిని నేను;
నదులన్నిటిలో గంగా నదిని.

32. సృష్టులన్నిటికి ఆదియునంతము
మధ్యము నేనే అయితినర్జునా !
విద్యలలో అధ్యాత్మ విద్యను;
వాదించువారి వాద పటిమను.

33. అక్షరమాలలో అకారమ్మును;
సమాసాలలో ద్వంద్వమునైతిని;
నాశము లేని కాలము నేను;
విశ్వముఖుడైన బ్రహ్మదేవుడను.

34. అన్నిటి చంపే మృత్యువు నేను;
పుట్టబోయెడి వాటి పుట్టుకను;
స్త్రీల కీర్తిని, సిరిని, వాణిని,
స్మృతియును, మేధయు, ధైర్యమునోర్పును.

35. సామవేదమున బృహత్సామమును;
ఛందస్సులలో నే గాయత్రిని;
మాసములందున మార్గ శీర్షమును;
ఋతువులలోన వసంతఋతువును.

36. వంచకములలో జూదము నేను;
తేజోవంతుల తేజము నేను;
జయము మరియు యత్నము నేను;
సాత్త్వికు లందలి సత్త్వము నేను.

37. యాదవులందున శ్రీకృష్ణుడను;
పాండవులందున నేనర్జునుడను;
మునివర్యులలో వ్యాస మహర్షిని;
కవులలో నేను శుక్రాచార్యుడ.

38. దండించు వారి దండన నేను;
జయము కోరెడి వారిలో నీతిని;
రహస్యములలో మౌనము నయితిని;
తెలివి గలవారి తెలివిని నేను.

39. ప్రాణి కోటికి మూలాధారం
బీజము నేనే అయితినర్జునా!
చరాచరములగు భూతములన్నీ
నేను లేక అవి లేనే లేవు.

40. దివ్యములైన నా విభూతులకు
అంతము లేదని తెలియుము పార్థా!
అయినను వీటి వివరములన్నీ
చెప్పితి నీకు సంక్షిప్తముగా.

41. వైభవమైనవి తేజోమయములు
శక్తిమంతమగు సత్త్వములన్నియు
నాదు తేజపు అంశము వలన
పుట్టిన విషయము నీవు తెలుసుకో !

42. విస్తృతమైన ఈజ్ఞానముచే
ఏమి లాభము నీకు అర్జునా!
జగమంతయు నా ఒక్క అంశచే
వ్యాప్తమైనదని నీవు ఎఱుగుము.

దశమాధ్యాయం సమాప్తం

## పదునొకండవ అధ్యాయము

# విశ్వరూప సందర్శన యోగము

1. నాపై దయతో నీవు చేసిన
పరమ రహస్యము, ఆధ్యాత్మికమగు
బోధన వలన నా అజ్ఞానము
పూర్తిగా తొలగె ననె అర్జునుడు.

2. జీవులయొక్క చావు పుట్టుకలు,
నాశము లేని నీ మహిమలను
విస్తారముగా నీవు చెప్పగా
వింటిని నేను కమలదళాక్షా!

3. నీవు చెప్పిన నీ మహిమలను
నమ్మితినయ్యా ఓ పరమేశ్వర!
ఐశ్వరమగు నీ రూపమునిప్పుడు
చూడవలెనని కోరిక కలిగెను.

4. ప్రభు!యోగేశ్వర! నీ రూపమును
చూచుట నాకు శక్యమేయని
నీవు తలంచిన, నాశము లేని
ఆ రూపమును నాకు చూపుము.

5. పలు రకములును, దివ్యమైనవి,
పలు రంగులునాకారములున్నవి,
వందల, వేల నా రూపములను
చూడుమనియెను దేవుడర్జునుని.

**6.** చూడుమర్జునా! సూర్యుల, వసువుల,
రుద్రుల నశ్వినీ వాయు దేవతల
చూడుము! మునుపెన్నడునూ చూడని
ఎన్నోఎన్నో ఆశ్చర్యములను.!

**7.** చరాచరంబగు సకల జగత్తును
ఇంకను దేనిని చూడ గోరితివో,
నా దేహములో ఒకే చోటున
గుడాకేశుడా చూడుమిప్పుడు.!

**8.** నీ కన్నులతో నన్నుచూచుట
శక్యము కాదది; కావున నీకు
దివ్య నేత్రములొసగుచుంటిని;
వీనితో యీశ్వర యోగము కాంచుము!.

**9.** ఆ విధముగ యోగీశ్వరుడా హరి
పలికిన వాడై, పార్థుని కోసము
పరమైశ్వరమగు రూపము చూపెను
అనె సంజయుడు ధృతరాష్ట్రునితో.

**10,11.** పలు పలు మోములు కన్నులు కలది,
పలు పలు వింతలు చూపుచున్నది,
పలు భూషణములు దివ్యమైనవి,
పలు ఆయుధములు పైకి యెత్తినవి
దివ్యములైన మాలలు వలువలు
దివ్య గంధముల పూతలున్నది,
అందరినీ ఆశ్చర్య పరచునది,
అన్నివైపులా ముఖములు కలది,
తెజోవంతము అంతము లేనిది,

12. వేల సూర్యులు ఒక్కసారిగా
దివి ప్రభవించిన కలిగెడి తేజము
వెలిగెడి విధముగ ఆ మహాత్ముని
తేజము కూడా వెలుగుచున్నది.

13. పలురకములుగ విభక్తమైన
సకల జగతిని ఒకే చోటను,
దేవదేవుని దేహమునందున
చూచెను అపుడా పాండునందనుడు.

14. విస్మయమంది, రోమాంచితుడై,
శిరమును వంచి, చేతులు మోడ్చి,
ఆ భగవంతుని నమస్కరించి
అర్జునుడనియెను ఆ దేవునితో.

15. కాంచితి దేవా నీ శరీరమున
సకల దేవతల ప్రాణి సంఘముల,
కమలాసనమున వెలసిన బ్రహ్మను
ఋషులందరిని దివ్య సర్పముల

16,17. ఓ విశ్వేశ్వర! విశ్వరూపుడా!
అనేక బాహువులనేకముఖములు,
ఉదరములును మరి కన్నులును
అంతములేని నీ రూపమును
అంతటా నేను చూచితి; కానీ,
మొదలు కనపడదు, మధ్యకనపడదు,
అంతమెక్కడో అసలు కనపడదు!
కిరీటధారిని, గదాధరుడిని,

చక్రిని, వెలుగుల రాశిని, అంతట
దీప్తిమంతుడై వున్న వానిని,
మండే సూర్యుని, కాంతి పుంజమును,
అప్రమేయుడిని చూచుచుంటిని.

18. తెలియగ వలసిన పర బ్రహ్మవు,
నీవే జగతికి పరమాధారము!
ధర్మ రక్షకుడవవ్యయుడవును,
పురాణ పురుషుడ వని నమ్మితిని.

19. ఆది మధ్యము తుది కనపడదు,
అంతము లేని పరాక్రమ శాలివి;
సూర్య చంద్రులు నీదు కన్నులు!
మండే అనలుని ముఖమును కల్గి
సొంత కాంతి చే యీ ప్రపంచమును
తపింప జేసెడి నిన్ను చూచితిని.

20. భూమ్యాకాశపు మధ్యప్రదేశము
అన్నిదిక్కులూ నీవు కమ్మితివి!
నీ ఉగ్రాద్భుత రూపము చూచి
ముల్లోకాలు భయపడుచున్నవి.

21. సురసమూహములు నీలో జొచ్చెను,
భయమున కొందరు భజన చేసిరి;
ఋషులు సిద్ధులు స్వస్తి పలుకుచు,
నిన్నుస్తుతించిరి నిండు మనసుతో.

22. రుద్రులు, సూర్యులు, వసువులు, సాధ్యులు,
విశ్వదేవతలు, అసురులు, సిద్ధులు,
యక్షగంధర్వులు, మరుతులశ్విను
లచ్చెరువున నిను చూచుచునుండిరి.

23. ఎన్నో ముఖములు, కన్నులు, చేతులు,
తొడలు, పాదములు, పొట్టలు, కోరలు
కలిగిన నీ ఉగ్రరూపము చూసి,
ప్రజలును నేనూ భయపడుచుంటిమి.

24. నింగిని తాకుచు, నిప్పులు కక్కుచూ,
మండే కనులతో, రంగుల మేనుతో,
తేజరిల్లుచు, తెరచిన నోటితో,
చూడగ ధైర్యము శమము సడలెను.

25. భీకరమైన కోరలు, ప్రళయపు
అగ్నిని పోలిన ముఖములు చూచి,
దిక్కులు తెలియవు, సుఖమును లేదు;
శాంతించుమయా జగన్నివాసా!

26,27. కౌరవులందరు, భీష్ముడు, ద్రోణుడు,
కర్ణుడు, కౌరవసేన రాజులు,
మా సేనలలో ముఖ్య యోధులు,
నిన్ను చేరుటకు తొందర పడుతూ
భయానకంబగు కోరలుగల నీ
నోళ్ళ లోనికి చొరబడుచుండిరి;
పొడి పొడి యైన శిరములు కలిగి
కొందరు కోరల మధ్యన చిక్కిరి.

28. నదులలోని పలు నీటి వెల్లువలు
సంద్రము లోనికి చేరెడి రీతిని,
మండుచున్న నీ ముఖముల లోనికి
ఈ వీరులు తెగచొరబడుచుండిరి.

29. నాశము కోరి మిడుతలు మంటను
జోరుగా వచ్చి జొరబడినట్టుల
లోకులు కూడా అతి వేగముగా
చావు కొరకు నీ నోళ్లలో పడిరి.

30. మండుచునున్న నీ ముఖములతో
అందరినంతట మ్రింగుచుంటివి;
భయము కొల్పెడి కాంతుల చేత
జగమంతయును జ్వలించుచున్నది.

31. ఉగ్ర రూపమున వున్న నీవెవరో
తెలుపుము దేవా! నీకు దండము;
ఆదిపురుషుడా నీ వృత్తాంతము
అనుగ్రహించి తెలియ పరచుము!

32. లోక సంతి కొరకై వచ్చిన
యముడను నేను; నీవు యుద్ధము
చేయకున్నను శత్రు యోధులు
మరణించెదరని చెప్పెను దేవుడు.

33. కావున లేచి శత్రుల గెలిచి
కీర్తిని రాజ్యము ననుభవింపుము!
వీరిదివరకే నా చే చచ్చిరి;
నిమిత్త మాత్రుడవగుము! అర్జునా !

34. ద్రోణుని, భీష్ముని, జయద్రథుడిని,
కర్ణుని లాంటి యుద్ధ వీరులను
నాచే జచ్చిన వారిని చంపుము
వెతనొందకుమా రిపుల గెలిచెదవు.

35. ఆ విధముగ భగవంతుండిచ్చిన
ఆదేశమును ఆలకించియు,
గడగడ వణుకుచు, చేతులు మోడ్చి,
శ్రీకృష్ణునికి నమస్కరించి,

భయంభయంగా, గద్గద స్వరమున,
వినయము తోడ విజయుడప్పుడు
పలికెను మరలా మాధవు తోనని
సంజయుడనెను ధృతరాష్ట్రునితో.

36. నీ స్మరణముచే జగముప్పొంగెను,
రక్కసులందరు భయపడి పారిరి;
సిద్ధసమూహము వందనమిడెను!
ఇవి నీ మహిమకు తగినవే కృష్ణా!

37. అనంత! దేవేశ! జగన్నివాసా !
సదసత్పరమగు పరబ్రహ్మవు,
బ్రహ్మదేవునకు ఆది కర్తవు;
నీకు దండములు పెట్టకుందురే ?

38. అనంత రూపుడవాది దేవుడవు,
పురాణ పురుషుడవీవు వేద్యుడవు,
విశవ్యాపివి, విశ్వాధారము,
పరంధామమును, వేత్తయు నీవే !

39. వాయు వరుణ యమాగ్నిసోములు,
బ్రహ్మయు, ఆయన తండ్రియునీవే!
వేయి సార్లుగా నమస్కారములు!
మరలా మరలా దండములయ్య!

40. అమిత విక్రమమనంత శౌర్యము
కలిగిన నీవు సర్వ వ్యాపివి;
ముందూ వెనుకలనన్ని వైపులను
నమస్సుమాంజలి నర్పణ సేతును.

41,42.
నీ మహిమలను యెరుగని నేను
పొరపాటుగను, చనువు చేతను,
కృష్ణా! యాదవ! సఖుడా! యనియును
లెక్క లేక నిను పిలిచితినయ్యా!
తినునప్పుడును, తిరిగేటప్పుడు,
కూర్చున్నపుడు, పరుండునపుడు,
ఏకాంతమున, యితరుల యెదుటను,
పరిహాసమునకు చేసిన యెన్నో
అపరాధములను మన్నింపమని
అప్రమేయుడా నిన్ను వేడితిని.

43. చరాచరంబగు జగమునకెల్ల
తండ్రివి, గురుడవు, పూజ్యుడవీవు;
ముల్లోకాలలో లేదు నీ సముడు!
అధికుడు వేరే యెక్కడుండును?

44. సాష్టాంగమున ప్రణమిల్లితిని,
ప్రస్తుతించుటకు అర్హుడవీవు;
నియామకుడగు యీశ్వరుండవు,
అనుగ్రహింపుము దయతో నన్ను!
తనయుడిపట్ల తండ్రి లాగున,
మిత్రుని యెడల మిత్రుని వలెను,
ప్రియ సఖి వద్ద ప్రియుని చందమున
నా అపరాధము క్షమించు దేవా!

45. ఇదివరకెన్నడు చూడని రూపము
చూచితి నానందించితి దేవా!
మనసున భయము బాధ కలిగినది,
మునుపటి రూపమునను(గహింపుము.

46. మునుపటివలెనే మకుటముపెట్టి,
గదను చ(క్రము చేతను బట్టి,
నాలుగు చేతుల నీ రూపమున
కనపడుమయ్యా సహ(స బాహూ!

47. తేజోమయమగు విశ్వమనంతము
మునుపెవ్వరును చూడలేనిది,
యోగశక్తిచే నా దయ చేతను
మొట్టమొదటగ నీకు చూపితిని.

48. వేదాధ్యయనము, యజ్ఞము, తపము!
దానము, (క్రియలు చేసిన కానీ,
వేరెవ్వరికీ నా యీ రూపము
చూచుటకిలలో సాధ్యము కాదు.

49. ఘోరమైన నా రూపము చూసి
భయపడ వలదు; శాంత చిత్తముతో
పూర్వ రూపమునే మరల చూడమని
ఆ భగవంతుడు పలికె పార్థునితో.

50. ఆ విధముగ నా వాసుదేవుడు
శాంత రూపుడై, నిజ రూపమును
మరల చూపి, భయపడెడు పార్థుని
ఓదార్చెనని సంజయుడనెను.

51. జనార్దనా! నీ ప్రసన్నమైన
మానవ రూపము చూచి నాకిపుడు
మేను మనసు కుదుట పడినవి,
స్వస్థత పొందితిననె అర్జునుడు.

52. నీవు చూచిన నా యీ రూపము
చూచుటకెంతో దుర్లభమైనది;
దివిజులు కూడా యీ రూపమును
చూడ కోరెదరనె భగవంతుడు.

53. నీవు చూసిన యీ నా రూపము
వేదాధ్యయనము, తపము చేసినా,
దానము, యజ్ఞము చేసిన కానీ
చూచుట ఎవరికీ సాధ్యము కాదు.

54. ఈ విధమైన రూపము గలనే
ననన్య భక్తి చేత మాత్రమే
దర్శించుటకు తెలిసుకొనుటకు
ఐక్యమొందుటకు శక్యుడనర్జున!

55. కర్మము నాకై చేయు వాడును,
నను గమ్యముగా నమ్ము భక్తుడును,
సంగ త్యాగి, భూత దయగల
నరుడే నన్ను పొందు నర్జునా !

ఏకాదశాధ్యాయం సమాప్తం

# పంద్రెండవ అధ్యాయము

# భక్తి యోగము

1. సతతము మిమ్ము మనసున నిలిపి
కొందరు భక్తులు సేవించెదరు;
అవ్యక్తమగు అక్షరమును మరి
కొందరు భక్తులు పూజించెదరు;
వీరిలో ఎవరికి యోగము బాగుగా
తెలియునోనని అర్జునుడడిగెను.

2. ఎవ్వరు నాపై మనసును నిలిపి
నిష్ఠతో శ్రద్ధతో నను సేవింతురో,
ఉత్తమ యోగులు వారేయని నా
అభిమతమని భగవానుడు పలికెను.

3,4. ఇంద్రియములను కట్టడి చేసి,
ఎల్లపుడు సమ భావము కలిగి,
సకలజీవుల మేలు కోరుతూ,
వర్ణించుటకు అలవి కానిది,
ఇంద్రియాలకు అంతు చిక్కనిది,
నిర్వికారమును నిశ్చలమైనది,
సర్వవ్యాపి యాపర బ్రహ్మమును
ధ్యానము చేసినా నన్నే పొందెదరు.

5. అవ్యక్తమునందాసక్తి గలుగుటకు
ప్రయాస యెంతో యెక్కువ కావలె;
దేహముపై మమకారమున్నచో
అవ్యక్త మార్గము ఎంతో కష్టము.

6,7. సర్వ కర్మములు నాకే వదలి,
పరమగమ్యముగ నను భావించి,
ఇతర చింతనలు లేని యోగమున
నన్నే మదిలో ధ్యానించుచును,
ఉపాసించుచు, నా యందుననే
మనసును లగ్నము చేసినవారిని
మృత్యు సంసార జలనిధి నుండి
త్వరగా నేను ఉద్ధరించెదను.

8. నాలో మనసును స్థిరముగ నిలుపుము,
నాలో బుద్ధిని లీనము చేయుము,
అటు పిమ్మట నా యందే నీవు
నివసించెదవు నిక్కము గాను.

9. నాపై చిత్తము స్థిరముగ నిలుపుట
నీకును శక్యము కానట్లయితే
అభ్యాసమను యోగము ద్వారా
నను చేరుటకు ప్రయత్నింపుము.

10. అభ్యాసము నీ చేతగానిచో
నాకై కర్మము పేరిమి చేయుము
నాకై కర్మము కావించియును
మోక్ష సిద్ధిని నీవు పొందెదవు.

11. ఇంకను, నీవు నాకై యోగము
ఆచరించుటకు శక్తి లేనిచో,
మనసును బాగా కట్టడి చేసి
కర్మఫలములను నాకు వీడుము.

12. జ్ఞానము మేలభ్యాసము కన్నను
జ్ఞానము కన్నా ధ్యానము గొప్పది;
ధ్యానము కన్నా కర్మఫలముల
త్యాగము గొప్పది శాంతినొసగునది.

13,14. జీవకోటి యెడ ద్వేషము లేక,
ఎలమి చెలిమి ఓర్పును కలిగి,
నేనూ నాదను భావము లేక,
సుఖదుఃఖాలను సమముగనెంచిన
నిత్యసంతోషి, యోగయుక్తుడు,
మనసును అణచిన దృఢనిశ్చయుడు,
మనసును బుద్ధిని నాకర్పించిన
నా భక్తుడు నాకెంతో యిష్టుడు.

15. లోకము వలన అడలు చెందక,
లోకుల నెవరిని అడలు చేయక,
మోదము ఖేదము భయముద్వేగము
వీడిన వాడు నాకతిప్రియుడు.

16. కోరికలు వదలి శుద్ధిని పొందిన
కార్య సాధకుడు, మధ్యస్థుడును,
దిగులును, కార్యసంగము వీడిన
నా భక్తుడు నా కెంతో యిష్టము.

17. సంతోషించక, ద్వేషింపకను,
కోరికలు వీడి శోకము చెందక,
శుభాశుభములు వదిలి పెట్టిన
భక్తుడు నాకు యెంతో యిష్టము.

18,19. శత్రువైనను, మిత్రుడైనను,
గౌరవమ్మును, అవమానమును,
చలివేడిమిని, కష్టసుఖాలను,
సమముగ చూచి, సంగమువీడి,
నిందాస్తుతులను ఒకటిగా నెంచి,
దొరికిన దానితో సంతోషించెడి
అస్థిరవాసి, స్థిరమనస్వి, ముని
యగు భక్తుడు నాకెంతో యిష్టము.

20. శ్రద్ధతో నన్ను పరముగ నెంచి,
నే చెప్పిన ధర్మామృత పద్ధతి
నెవ్వరు బాగుగ అనుష్ఠించెదరో
ఆ భక్తులు నా కెంతో యిష్టులు.

ద్వాదశాధ్యాయం సమాప్తం

# పదుమూడవ అధ్యయము

# క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము

1. ప్రకృతి యేమిటి? పురుషు డెవ్వరు?
క్షేత్ర- క్షేత్రజ్ఞుల, జ్ఞాన- జ్ఞేయముల
అర్థమేమిటో తెలుపుమనుచును
పార్థుడడిగెను ఆ కేశవుని.

2. ఓ కౌంతేయా! ఈ శరీరమును
క్షేత్రమందురు; దీనిని తెలిసిన
వానిని క్షేత్రజ్ఞుడని కోవిదులు
అందురనుచు భగవానుడు చెప్పెను.

3. అన్ని క్షేత్రములందున నన్ను
క్షేత్రజ్ఞుడని నీవు తెలుసుకో!
క్షేత్ర క్షేత్రజ్ఞుల జ్ఞానము నిజమగు
జ్ఞానము అని నా అభిమతమర్జున!

4. క్షేత్రమేదియో? క్షేత్రమెట్టిదో?
ఎట్లు పుట్టెనది? యేమి వికారము?
ఎవడు క్షేత్రజ్ఞు డేమి ప్రభావము?
సంక్షిప్తముగా చెప్పెద వినుము.

5. పలువిధములుగ ఋషులు తెలిపినది,
వేదములందామోదమందినది,
హేతుబద్ధముగా నిశ్చితమైన
బ్రహ్మసూత్రములలోన చెప్పినది.

6,7. మహాభూతములు, అహము, బుద్ధి
పదునొకండగు యింద్రియములును,
ప్రకృతి, ఇంద్రియ విషయములైదు,
కోరిక, ద్వేషము, సుఖము, దుఃఖము,
దేహేంద్రియముల గణమును,
చైతన్యమును, ధైర్యము కలిసిన
విక్రియలన్నియు కలిగిన దానిని
క్షేత్రమందురు సంక్షిప్తముగా.

8,9,10,11,12.
ఆత్మస్తుతిని డంబమును విడిచి,
మంచినడతను, ఓర్పునహింసను,
గురుసేవనము శుచి స్థిరత్వము
నిగ్రహము, వైరాగ్యము కలిగి,

నిరహంకారిగ, చావు పుట్టుకల
ముదిమి రోగముల బాధలు తెలిసి,
భార్య పిల్లలు యిల్లు వాకిలను
తగులాటములు తప్పించుకొని,
ఇష్టానిష్టములు సమముగా నెంచి,
ఏకాగ్రతతో నిశ్చలభక్తితో
ఏకాంతమును చేరినవాడై,
నిర్జన స్థలముల యందు వసించుచు,

ఎల్లపుడాత్మజ్ఞానము కలిగి,
తత్త్వజ్ఞానము తెలుసుకొనుటయు
జ్ఞానము అనియే చెప్పబడినది,
అట్లు చేయనిచో అజ్ఞానమది.

13. అమరత్వమును చేర్చెడి జ్ఞేయము
ఇప్పుడు నేను చెప్పుచుంటిని,
ఆదియే లేని యా పరబ్రహ్మము
ఉన్నది లేనిది చెప్పజాలము.

14. అంతటా కాళ్ళు, చేతులు, శిరములు,
ముఖములు, కన్నులు, చెవులూ కలిగి,
సకల లోకములు ఆవరించిన
ఆ పరబ్రహ్మము అంతటా కలదు.

15. ఇంద్రియగుణములు వెలిగించెడిది,
సర్వేంద్రియములు విడిచిపెట్టినది,
అంతయు భరించు, నంటదు దేనిని;
గుణరహితమును, గుణ భోక్తయును.

16. ప్రాణుల లోపల బయట వుండునది,
కదలాడెడిది, కదలకుండునది,
సూక్ష్మమగుటచే ఎరుకకు రానిది,
దగ్గరుండునది దూరస్థమును.

17. ప్రాణులతోనది వేఱుపడనిది,
అయినను వేఱు పడినట్లున్నది,
సృష్టి స్థితి లయ కారణమైనది,
ఆ పరబ్రహ్మము యెరుగ వలసినది.

18. జ్యోతులకెల్ల జ్యోతినిచ్చునది,
అంధకారమునకతీతమైనది,
జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాన గమ్యమును
అన్ని జీవుల అంతరాత్మ యిది.

19. క్షేత్రము జ్ఞానము జ్ఞేయము గూర్చి
సంక్షిప్తముగా చెప్పితి నిప్పుడు;
దీనిని యెఱిగిన నాదు భక్తుడు
నా భావమును పొందుటకర్హుడు.

20. ప్రకృతి పురుషులకు ఆదియే లేదని,
వికారములును, మూడు గుణములు
ప్రకృతి మూలమున కలుగు చున్నవని
తెలుసుకొనుమయా శ్వేత వాహనా!

21. శరీరేంద్రియ విషయములన్నీ
ప్రకృతి వల్లనే కలుగుచున్నవి;
సుఖ దుఃఖములు పొందుటకైతే
పురుషుడు కారణమని చెప్పుదురు.

22. ప్రకృతి వలన కలిగిన గుణములు
పురుషుడు తాను అనుభవించును;
గుణముల కలయిక వలన జీవుడు
మంచీ చెడులగు జన్మము లెత్తును.

23. పురుషుడు దేహమునందు వున్నను
దానితో విడిపడి అనుమతి
కర్తగ, సాక్షిగ, భర్తగ, భోక్తగ,
ఈశుడుగ పరమాత్మగ వుండును.

24. ఎవడు యీ ప్రకారముగ పురుషుని
గుణములు కూడిన ప్రకృతినెఱుగునో,
ఆతడి నడవడి యెట్లు వుండినను
మరో జన్మము వుండదాతనికి.

25. ఆత్మను కొందరు మనసున చూతురు;
ధ్యానము చేతను, సాంఖ్యముద్వారా
మరికొందరును, కర్మయోగముచే
ఇంకొందరును ఆత్మను కనెదరు.

26. మరి కొందరిలా యెరుగ జాలక,
ఇతరుల ద్వారా విని కొల్చెదరు;
శ్రుతి పరాయణులు వారును కూడా
మృతిని తప్పక తరించ గలరు.

27. చరాచరంబగు వస్తువులన్నియు
క్షేత్ర క్షేత్రజ్ఞుల కలయికచే
పుట్టుచున్నవని యెఱుగుము నీవు
భరత వంశజా! బలరిపు తనయా!

28. సకల జీవులలో సమముగ నున్న
పరమాత్మను కని, ప్రాణుల దేహము
నశించినా అది నాశ రహితమని
ఎరిగిన వాడే నిజమగు వేత్త.

29. సకల ప్రాణులలో తిష్ఠ వేసిన
పరమేశ్వరుని సమముగ చూచిన,
తనకు తాను హింసించుకొనడు మరి
పరమోత్తమ గతి పొందునాతడు.

30. కర్మములన్నీ ప్రకృతి మూలమున
అన్నివిధముల జరిగినట్లుగా
ఆత్మయు కూడా కర్త కాదని
ఎరిగినవాడే నిజముగా వేత్త.

31. ఎన్నోరకముల ప్రాణికోటిని
ఏకస్థముగా చూచి యాతడు
దానినుండియే విస్తరించునని
ఎరిగినప్పుడు బ్రహ్మము పొందును.

32. అనాది పురుషుడు త్రిగుణరహితుడు
అవ్యయుడగు యీ పరమాత్మ
దేహస్థుడయ్యును యేమి చేయడు,
ఏదియునంటదు ఆతనికర్జున !

33. అంతటనున్న ఆకాశమునకు
ఏ విధమ్ముగా యేదియు నంటదో,
దేహమంతటా ఆత్మ యున్నను
ఆత్మకు యేదియు అంటదర్జునా !

34. అర్జునా! సూర్యుడు ఒక్కడైనను
లోకమంత వెలిగించిన రీతిని,
క్షేత్రజ్ఞుడును సకల క్షేత్రమును
ప్రకాశవంతము చేయుచునుండును

35. క్షేత్ర క్షేత్రజ్ఞుల భేదమ్మును
భూతప్రకృతుల నుండి విముక్తియు
జ్ఞాన దృష్టిచే తెలిసినవారు
పరమ పదమును పొందుచుందురు.

**త్రయోదశాధ్యాయం సమాప్తం**

# పదునాల్గవ అధ్యాయము

# గుణ త్రయ విభాగము

1. ఏ జ్ఞానముచే మునులందరును
మోక్షము పొందిరో, పరమశ్రేష్ఠమగు
ఆ జ్ఞానమును మరల చెప్పెదను
అనుచు పలికెను ఆ భగవంతుడు.

2. ఈ జ్ఞానమును పొందిన జనులు
నా యందైక్యము పొందినవారై,
సృష్టి సమయమున పుట్టరు వారు,
ప్రళయమునందు లయము చెందరు.

3. నా యోనియె ఒక మహాబ్రహ్మము,
అందు గర్భమును నేను వుంచెదను;
అందువలననే సకల జీవుల
పుట్టుక జరుగుచునున్నది పార్థా!

4. అన్నిదేహముల సంభవానికి
మహాబ్రహ్మము యోనిగ నుండగ,
బీజ దాతననగు తండ్రిని నేనని
తెలుసు కొనుమయా కుంతీ నందన !

5. ప్రకృతి వలన పుట్టిన వయిన
సత్త్వ రాజస తమో గుణములు,
నాశ విరహితుండైన ఆత్మను
దేహములో బంధించునర్జునా !

6. సత్త్వగుణమది– నిర్మలమైనది,
వెలుగునిచ్చును, భద్రమైనది;
సుఖమూ జ్ఞానమునందాసక్తిచే
జీవుని బంధన చేయును అనఘా!

7. రాగమయమగు రాజసగుణము
ఆశలు కోరిక కలుగ జేయును;
కర్మలయందది సంగము పెంచి
జీవుని కట్టడి చేయునర్జునా !

8. తమోగుణంబజ్ఞాన జనితము,
జీవులకది కలిగించును మోహము;
ఏమరుపాటును, నిద్ర, బద్ధకము
వలన జీవుని బద్ధుని చేయును.

9. సత్త్వ గుణమది సుఖమున చేర్చును,
రాజస గుణము కర్మమున నుంచు,
తమము జ్ఞానమును కప్పి అర్జునా!
ప్రమాదములలో పడవేయునయా !

10. అర్జున వినుము! రజమును, తమమును
సత్త్వమణచును; అదే విధముగా,
సత్త్వతమములను రాజసమణచగా,
తమమూ రాజస సత్త్వములనణచును.

11. దేహమందుగల ద్వారములన్నిట
ఎప్పుడు బుద్ధి జ్ఞానము కలుగునో,
అప్పుడు సత్త్వపు గుణము వృద్ధిని
పొందిన దానిగా యెఱుగ వలయును.

12. లోభము, గర్వపు నడవడి, ఆశయు,
కర్మములందున శాంతి లేమియు,
ఈ లక్షణములు ఎక్కు వైనచో
రజో గుణమని యెఱుగుమర్జునా!

13. తామస గుణము పెరిగెడి వేళ,
అవివేకమును, సోమరితనము,
ఏమరుపాటును, మూర్ఖత్వమును,
కలుగుచుండునో భరత శ్రేష్ఠా!

14. సత్త్వపు గుణము వృద్ధి చెందగా
మరణించినచో, జీవుడప్పుడు
ఉత్తమ జ్ఞానము వున్న వారుగల
నిర్మలమైన లోకము పొందును.

15. రజో గుణముతో చచ్చినవాడు
కర్మాసక్తుడుగా జన్మించును;
తమో గుణముతో మరణించినచో
మూర్ఖుల కడుపున పుట్టుచుండును.

16. మంచి కర్మముల వలన సాత్త్వికపు
నిర్మలమైన ఫలము కలుగును;
రాజసమునకు దుఃఖము ఫలము;
తామస కర్మము ఫలమజ్ఞానము.

17. సత్త్వము వలన జ్ఞానము కలుగును;
రజో గుణముచే లోభము కలుగును;
తమో గుణముచే యేమరుపాటును,
మోహమునజ్ఞత కలుగుచున్నవి.

18. పై లోకాలకు సాత్త్వికు లేగగా,
మధ్యలో వుందురు రాజస గుణులు.
నీచ గుణము కల తామసులేమో
అధోలోకములు పొందుచుందురు.

19. ద్రష్టగా తాను గుణములకంటె
కర్తను వేరుగా చూడని వాడు,
గుణములకంటెను తానన్యుడనని
తెలిసినచో నాభావము పొందును.

20. మేనున కలిగిన మూడు గుణములను
జీవుడు తాను తరించ గలిగిన,
చావు పుట్టుకలు ముదిమీ వెతలు
తప్పించుకొని మోక్షము పొందును.

21. ఈ త్రిగుణములను దాటిన వాడు
ఏ ప్రకారముగ నుండును ? ఆతని
నడవడికెట్టిది?ఎట్లు తరించును?
తెలుపుము ప్రభువా ! అనె అర్జునుడు.

22,23,24,25.
త్రిగుణ భావముల వలన కలిగిన
సుఖమోహాదుల నీసడించక,
తొలగిన గుణముల నాశించకను,
గుణముల చేత చలనమందక,

తటస్థ ధోరణినవలంబించి,
గుణములన్నియు సహజమేనని
తలచి చలింప కుండెడి వానిని
సుఖదుఃఖాలను సమముగా నెంచి,

ఆత్మలో తాను స్థిరముగా నుండి,
మట్టిని, రాయిని, బంగారమును,
ప్రీతినప్రీతిని, నిందాస్తుతులను,
ఒకే విధముగా చూచెడి వానిని,
సన్మానమును, అవమానమును,
శత్రుమిత్రులను సమముగా చూచెడి
గర్వరహితుని, గుణాతీతుడని
చెప్పెదరనియెను ఆ భగవానుడు.

**26.** ఎవ్వడు నన్నుఅచంచలంబగు
భక్తి యోగమున సేవ చేయునో,
అతడీ గుణముల నతిశయించుచు
బ్రహ్మమగుటకు అర్హత పొందును.

**27.** ఏలయనగను, నాశరహితము,
నిర్వికారము, శాశ్వతమైన
ధర్మస్వరూపము, పూర్ణ సుఖమగు
బ్రహ్మమునకు నేనాశ్రయమయితిని.

**చతుర్దశాధ్యాయం సమాప్తం**

## పదునైదవ అధ్యాయము

# పురుషోత్తమ ప్రాప్తి యోగము

1. మూలము పైకి కొమ్మలు క్రిందికి
వేదములను ఆకులుగా కలిగిన,
నాశములేని అశ్వత్థముగా
ఎరిగిన వారు వేద వేత్తలు.

2. గుణముల కొమ్మలు విషయపు ననలు
క్రిందికి పైకి విస్తరించినవి;
కర్మబద్ధమగు వ్రేళ్ళు మాత్రము
క్రిందను దృఢముగా వూని యున్నవి.

3,4. అట్టి రూపమును యిలలో ఎరుగరు;
ఆదియు నంతము స్థితి కనపడదు;
దృఢమూలము గల అశ్వత్థమును
దృఢ విరక్తి శస్త్రముతో నఱకి,

తిరిగిరాని ఆ పరంధామమును,
ప్రవృత్తి పెంచిన పురాణ పురుషుని,
ఆది పురుషుని శరణు జొచ్చితి
నను భావముతో వెతక వలెనయా.

5. మానము, మోహము, సుఖదుఃఖములు
కామము, సంగము లెస్సగ గెలిచి,
ఆత్మజ్ఞానము నిరతము కలిగిన
జ్ఞానులు మోక్ష పదము నొందుదురు.

6. సూర్యచంద్రులు నగ్నిదేవుడు
ప్రకాశింపగ చేయగ జాలని
స్థానము నాదగు పరంధామమును
పొందిన వారు మరల జనింపరు.

7. అనాదిగా గల నాదగు అంశమే
జీవలోకమునందు జీవుడై,
ప్రకృతియందు గల మనసుతో కలిపి
ఆరింద్రియముల నాకర్షించును.

8. జీవుడు దేహము వీడినప్పుడు,
మరల శరీరము పొందునప్పుడు,
పూల వాసనను గాలి గ్రహించిన
రీతిన పొందును యింద్రియములను.

9. ఆ విధముగా యీ జీవుడు యిలలో,
చెవులను, కళ్ళను, ముక్కును, నాల్కను,
చర్మము, మనసును వినియోగించి
విషయములన్ని అనుభవించును.

10. తిరిగెడి జీవుని, తిరమగువాడిని,
గుణములుకలిగిన అనుభవపరుని,
అబ్బకాడులు అవలోకించరు;
జ్ఞాన ద్రష్టలే చూడ గల్గుదురు.

11. యత్నము చేసెడి యోగి పుంగవులు
తమలో నున్న ఆత్మను కనుదురు;
చిత్త శుద్ధియే లేని మందమతి
యత్నము చేసినా ఆత్మను కనడు.

12. జగతికి వెలుగులు కలుగ జేసెడి
సూర్యుని లోపల రగిలెడి ఓజము,
చంద్రుని వెలుగు, అగ్ని తేజము
అంతయు నాదని నీవు ఎఱుగుము.

13. మఱియును నేను భూమిని చేరి
బలముతో ప్రాణుల బ్రతికించుదును;
రస రూపుడనగు చందమామ నై
సకలౌషధులను పోషించెదను.

14. ప్రాణాపానము కూడిన ప్రాణుల
దేహమందు వైశ్వానరుండనై,
నాలుగు విధముల ఆహారమును
పచనము చేసెద నేను అర్జునా! .

15. ప్రాణుల హృదిలో నుండెద, నాచే
జ్ఞానము, మరపు, జ్ఞప్తి కలుగును;
వేదాంతకర్తను, వేదవేద్యుడను,
వేదము కూడా నేనె యెరుంగుదును.

16. లోకమునందున క్షరుడక్షరుడని
రెండు రకముల పురుషులుందురు;
సర్వభూతములు క్షరుండు కాగా
కూటస్థుడిని అక్షరుడందురు.

17. ఆ ఇద్దరికీ వేఱగు వానిని
ముల్లోకాలను భరించు యీశుని,
నాశరహితుని, ఉత్తమ పురుషుని
పరమాత్మునిగా పరిగణింతురు.

18. క్షరుని కంటెను మించిన వాడను
అక్షరుని కంటె శ్రేష్ఠుడ నేను;
కావున యిలలో, వేదములందున
పురుషోత్తమునిగా వినుతి కెక్కితిని.

19. ఎవడజ్ఞానము తొలగినవాడై,
పురుషోత్తమునిగా నన్ను యెరుగునో
అతడు సమస్తము తెలిసినవాడై
నిండు మనసుతో నన్ను భజించును.

20. అనఘా! యిట్లతిరహస్యమగు యీ
శాస్త్రము నాచే చెప్పబడినది;
పాండు నందనా! దీనిని యెఱిగిన
బుద్ధిమంతుడును కృతకృత్యుండగు !

**పంచదశాధ్యాయం సమాప్తం**

## పదునాఱవ అధ్యాయము

# దైవాసుర సంపద్విభాగ యోగము

1,2,3. జ్ఞానయోగపు స్థితిలో నుండుట,
అంతఃశుద్ధియు, నిర్భయత్వము,
మంచి నడవడి కలిగి యుండుట,
దానము, యజ్ఞము, తపము చేయుట,

వేదపఠనము, ఆత్మ నిగ్రహము,
సత్యమహింస, త్యాగము, శాంతత,
కోపములేమియు, ప్రాణులపై దయ,
అలోలత్వము, మృదులత్వమును,

స్థిరమగు చిత్తము, సిగ్గు, సహనము,
ధైర్యము, శౌచము, తేజముండుట,
ద్రోహము నెవరికి చేయకుండుట,
స్వాతిశయమును చూపకుండుట,

చెప్పుడు మాటలు చెప్పకుండుట,
ఇట్టి సుగుణములు దైవ సంపద
పొందిన వానికే కలుగును పార్థ!
అనుచు పలికెను ఆ భగవంతుడు.

4. డంబము, గర్వము, స్వాభిమానము,
కోపము, పరుషత, అవివేకమును,
అసుర ప్రకృతికి సంబంధించిన
సంపద వలన కలుగును పార్థ!

5. దైవ సంపద ముక్తి నిచ్చును,
అసుర సంపద బద్ధుని చేయును,
దైవ సంపదలో నీవు పుట్టితివి;
కావున అర్జునా ! శోకము వలదు.

6. దైవికములనియు, ఆసురములని,
ప్రాణుల సృష్టి రెండు రకములు;
దైవికమును విశదముగ చెప్పితి,
అసుర విషయములు వినుము అర్జునా!

7. అసుర భావములు కలిగిన జనులు
ప్రవృత్తి నివృత్తుల గూర్చి యెఱుగరు;
ఆచారమ్ముల నవలంబించరు,
శౌచము, సత్యము నాచరించరు.

8. ధర్మవ్యవస్థ లేనిదసత్యము,
దేవుడు లేనిది, కామము వలన
ఆడామగ కూడికతో కూరినదే
జగము వేరొకటి కాదు అందురు.

9. ఇట్టి దృష్టిని అవలంబించిన
అల్పబుద్ధులు, నష్టమనస్కులు,
హింసాత్మకులు, లోకకంటకులు
లోక నాశనము కొరకు పుట్టెదరు.

10. తనివి తీరని కామము కలిగి,
దంభమానములు మదమున నుండి,
అవివేకమున దుష్టశీలురై
అపవిత్రపు పనులాచరింతురు.

**11,12.** ఆమరణాంతము అంతము లేని
విషయ చింతలో మునిగిన వారు,
కామ భోగములే పరమావధిగా
భావన చేసి, నిశ్చయించు కొని,
ఆశా పాశమ్ములచే బద్ధులు,
కామ క్రోధ పరాయణ నరులు
కామ భోగములననుభవించుటకు
అక్రమ సంపద కోరుచుందురు.

**13,14,15,16.**
ఇది పొందితిని అది పొందితిని,
ఇంకా యెంతో పొందవలయును,
ఇంత ధనము నా వద్ద వున్నది,
ఇంకా ధనమును సంపాదించెద,
ఈ శత్రువును నేను చంపితిని,
మరి కొందరిని చంపవలయును,
బలవంతుడను, ధనవంతుడను,
సుఖవంతుడను అధివంశజుడను,

యాగము చేసెద, దానమిచ్చెద,
అనుభవించెద, ఆనందించెద,
నాకు సాటిగా ఎవ్వరు లేరు,
అను అజ్ఞానపు మోహము చేత,

మనో చంచలత కలిగిన వారు,
మోహజాలమున చిక్కిన వారు,
కామ భోగముల యందాసక్తులు
నరకములోన పడిపోయెదరు.

17,18. స్వాతిశయులును, వినయ హీనులు,
ధనము, మానము, మదమూ కలిగి,
అహంకారము, బలదర్పములు,
కామక్రోధములు యెక్కువ కలిగి

అన్ని దేహముల యందున వున్న
నాపై ద్వేషము కలిగిన వారు,
అసూయాపరులు, అశాస్త్రీయముగా
నామ మాత్రపు యజ్ఞమొనర్తురు.

19. క్రూర చిత్తులు, పాపకర్ములు,
నను ద్వేషించెడి నరాధములను,
ఆసురములైన జన్మములందు
ఎల్లప్పుడును పడ వేయుదును.

20. ఆసుర జన్మము పొందిన మూర్ఖులు
ప్రతి జన్మములో నన్ను పొందక,
మరు జన్మములో అంతకు మించిన
నీచ జన్మమును పొందెదరర్జునా!

21. కోరిక కోపము లోభమనబడు
మూడు రకముల నరక ద్వారముల
వలన జీవుడు నాశనమొందును;
కావున వీటిని విడువ వలయును.

22. తమోద్వారములు విడిచిన నరుడు
తనకు మేలును కలిగించుకొని,
తలమానికమగు పరబ్రహ్మమును
పొందుచుండును కుంతీ తనయా!

23. శాస్త్రము చెప్పిన బాధ్యత విడిచి
ఇష్టా రీతిగా ప్రవర్తించినచో,
ఆతడు సిద్ధిని పొంద జాలడు;
సుఖము దక్కదు; మోక్షము దొరకదు.

24. కార్యాకార్య వినిర్ణయమందున
శాస్త్రమె నీకు ప్రమాణమగును;
శాస్త్ర విధానము నీవు తెలుసుకొని
ఇహమున కర్మము చేయదగుదువు.

షోడశోధ్యాయం సమాప్తం

## పదిహేడవ అధ్యాయము

# శ్రద్ధా త్రయ విభాగ యోగము

1. శాస్త్ర విధులను చేయకపోయినా,
శ్రద్ధతో పూజలు చేయు నరులలో,
త్రిగుణమ్ములలో యేది వుండునో
తెలుపుము కృష్ణా అనె నర్జునుడు.

2. శ్రద్ధ ప్రాణులలో సహజమైనది,
సాత్త్విక రాజస తామసములని
మూడు రకములుగ నుండును; పార్థా!
వినుమని పలికెను ఆ భగవానుడు.

3. జీవులకంతఃకరణము వలన
శ్రద్ధ కలుగును; ఎవ్వనికెంతటి
శ్రద్ధయో, అతడంతే శ్రద్ధగు,
శ్రద్ధామయమగు జీవుడీతడు.

4. సత్త్వగుణాఢ్యులు సురలను కొలుతురు,
రాజస గుణులు యక్ష రాక్షసుల,
తామస గుణులు భూతగణములను,
ప్రేతాత్మలను కొలుచుచుందురు.

5,6. దేహమునందలి జీవతత్త్వమును,
అంతరాత్మగా వున్న నన్నునూ,
కృశింప జేసెడు అహంకారులు,
డంబము, కామము, రాగము, బలము

కలిగిన వారు, మూర్ఖత్వముతో
ఏ శాస్త్రమును విధించనట్టి
ఘోర తపస్సును చేసెడి వారిని
ఆసురగుణులని అనెదరు పార్థా!

7. మూడురకముల ఆహారమును
వివిధములగు ప్రజలిష్టపడుదురు;
అటులనే యజ్ఞము, తపము, దానమును,
వాటి భేదములు చెప్పెద వినుము.

8. ఆయువు, సత్త్వము, బలము, స్వస్థత
సుఖముల్లాసము పెంచ గలిగినది,
రసము, చమురు, రుచిగల భోజ్యము;
సాత్త్వికులకది చాలా యిష్టము.

9. ఉప్పూ కారము, పులుపూ చేదు,
వేడి ఎక్కువగా, నూనె తక్కువగా,
దాహము, శోకము, రోగము పెంచెడి
వంటకములు రాజసులకిష్టము.

10. చేవ లేనిది, చెడి పోయినది,
ఎపుడో వండి కంపు గొట్టునది,
ఎంగిలి పడినది, సుద్ది లేనిదగు
తిండిని తామసులిష్టపడుదురు.

11. చేయ తగినదేయని మనస్సును
సముదాయించి, ఫలమాశించక
శాస్త్ర ప్రకారము చేయు యజ్ఞము
సాత్త్విక యజ్ఞము అని చెప్పుదురు.

12. ఫలమాశించి, అపేక్ష తోడను
డంబము కొరకు చేసెడి యజ్ఞము
రాజసయజ్ఞముగా నీవెఱుగుము,
భారత శ్రేష్ఠ! బలరిపు తనయా!

13. శాస్త్ర విధులను అనుసరించనిది,
మంత్రము దక్షిణ శ్రద్ధ లేనిది,
అన్నదానము కూడా లేని
యజ్ఞము తామసమని చెప్పుదురు.

14. దివిజుల, ద్విజుల, గురువుల, జ్ఞానుల
పూజయు, శుభ్రత, బ్రహ్మచర్యము,
మంచి నడవడి, అహింస మార్గము
దైహిక తపముగా పరిగణింతురు.

15. పరుల మనసును గాయ పరచనిది,
సత్యము, ప్రియము మేలు చేయునది,
వేదాధ్యయనము అభ్యసించునది
వాఙ్మయ తపసుగ చెప్పబడినది.

16. ప్రశాంత చిత్తము, ప్రసన్నత్వము,
మౌనము మరియు నాత్మనిగ్రహము,
భావ శుద్ధియు కలిగి యుండుట
మానస తపమని అనబడుచున్నది.

17. ఫలమాశించని యుక్తనరులచే
పరమశ్రద్ధతో పాటింప బడిన
ఆ త్రివిధములైన తపస్సులను
సాత్త్వికమ్మని చెప్పుచుందురు

18. సన్మానములకు, పూజలందుటకు
ఆడంబరముగ చేసిన తపస్సు
స్థిరము కానిదది, ఫలమనిశ్చితము;
దానిని యిలలో రాజసమందురు.

19. మొండి పట్టుదల గలవాడై, తా
తన దేహమ్మును బాధపెట్టుకొని
పరుల వినాశము కోరి చేసెడి
తపసును తామసమని చెప్పెదరు.

20. దానము చేయగ సంకల్పించి,
స్థలము సమయము యోగ్యత చూసి,
ప్రతిఫలాపేక్షలేక యోగ్యులగు
వారికిచ్చుటయే సాత్త్విక దానము.

21. మేలును తిరిగి పొందుట కొరకు,
ప్రతిఫలమేదో ఆశించియును
లేదా మనసున బాధ పడుచును
చేసిన దానము రాజసమగును.

22. స్థలము సమయము సరిపడనప్పుడు
తగనివారికి చెడుకార్యములకు
అమర్యాదగా చేసిన దానము
తామస దానము అని చెప్పెదరు.

23. ఓం తత్ సత్ అను మూడు పేర్లతో
పరబ్రహ్మమును పిలుతురు భువిలో;
దాని చేతనే ద్విజులును, వేదము,
యజ్ఞము, పూర్వము నిర్మితమైనవి.

24. బ్రహ్మావాదులు, శాస్త్రోక్తంబగు
యజ్ఞ తపో దానాది కర్మలను
చేసెడి ముందు యెల్లప్పుడును
ఓం అని పలికి ప్రారంభింతురు.

25. మోక్ష కాముకులు తత్ అని చెప్పి,
ఫలము కోరక వివిధములైన
యజ్ఞము దానము తపముల వంటి
క్రియలన్నియునూ చేయుచుందురు.

26. సత్ అను శబ్దము కలదు అనుటకు,
మంచిది అనెడి అర్థమందును,
ఉత్తమమైన కర్మమునందునూ
పార్థా! పెద్దలు వాడుచుందురు.

27. యజ్ఞతపోదానమ్ములలో గల
స్థితిని సత్తనుచు వ్యవహరింతురు;
దైవ ప్రీతికై చేయు కర్మను
సత్ కర్మముగా పిలుచుచుందురు.

28. శ్రద్ధ లేమితో చేసెడి హోమము
దానము తపము తదితర కర్మలు
అసత్ అందురు పార్థా! అయ్యది,
ఇహమున పరమున సుఖము నియ్యదు.

**సప్త దశాధ్యాయం సమాప్తం**

## పదునెనిమిదవ అధ్యాయము

# మోక్ష సన్న్యాస యోగము

1. సన్న్యాస త్యాగములకు చెందిన
తత్త్వము ఏమిటి కేశి నిషూదన!
విడివిడిగా అవి తెలుపుమనుచును
అడిగెను అర్జునుడా భగవంతుని.

2. ఫలమును కోరి చేసెడు కర్మము
మానుటను సన్న్యాసమందురు;
కర్మము చేసి ఫలము వీడుటను
త్యాగముగా బుధులందురు పార్థా!

3. దోషము వలె కర్మమును వీడుట
తగునని కొందరు విజ్ఞులు చెప్పిరి;
యజ్ఞతపోదానమ్ములు విడుచుట
తగదనియే మరి కొందరు తెలిపిరి.

4. త్యాగము గూర్చి నా నిర్ణయమును
చెప్పెద వినుమో భరతసత్తమా!
ముప్విధములుగ త్యాగముండునని
చెప్పబడినదయా పురుష శ్రేష్ఠా!

5. యజ్ఞము దానము తపః కర్మములు
విడువరానివవి, చేయవలసినవి;
ఏలన, యజ్ఞము దానము తపము
బుద్ధిమంతులకు పావనమైనవి.

6. ఈ కర్మములను సంగము వీడి,
ఫలమును విడిచి కర్తవ్యముగా
చేయవలయునని నిశ్చితమ్ముగా
ఉత్తమమగు నామతము అర్జునా !

7. శాస్త్రము చెప్పిన కర్మము మానుట
అనుచితమగును, యుక్తము కాదది;
అజ్ఞానముతో అట్లు త్యజించిన
దానిని తామస త్యాగమందురు.

8. ప్రయాసకరమని కాయకష్టమని
కర్మము మానుట రాజస త్యాగము;
అట్టి త్యాగము వలన ఫలితము
కలుగనేరదని తెలియుమర్జునా!

9. శాస్త్ర విహితమగు కర్మము తప్పక
చేయతగినదని, సంగము వీడి,
కర్మము చేయుచు, ఫలమాశించక
చేసెడి త్యాగము సాత్త్వికమవును.

10. సత్త్వగుణుడును, బుద్ధిశాలియు,
నిస్సందేహి, త్యాగ శీలుడు
అశుభకర్మములను ద్వేషింపడు,
శుభకర్మములతో సంగము నొందదు.

11. దేహధారులకు సంపూర్ణముగా
కర్మలు విడుచుట శక్యము కాదు;
కావున కర్మ ఫలమ్ములు వీడే
మనుజుడు త్యాగిగ మన్నన పొందును.

12. కర్మఫలములు వీడని వారికి
మరణము తదుపరి, సుఖమో, దుఃఖమో,
సుఖ–దుఃఖములో కలుగును; త్యాగము
చేసినవారికి ఎన్నడూ కలుగవు.

13. కర్మల సిద్ధికి కర్మకాండల
ప్రక్రియ తెలిపెడు సాంఖ్యము నందు
చెప్పబడినవగు ఐదు హేతువులు
నేను చెప్పెదను యెరుగుమర్జునా !

14. దేహము, కర్త, వివిధ కరణములు,
నానా విధమ్ముల భిన్నక్రియలును,
దైవము కలిపి మొత్తము ఐదు
కర్మాచరణపు హేతువులయినవి.

15. మనసూ, మాట, దేహము చేత
న్యాయాన్యాయములైన కర్మలను
ఏ నరుదైతే ఆరంభించునో,
అందుకా ఐదు హేతువులగును.

16. కర్మలు అట్లు జరుగుచుండగా,
బుద్ధి లోపమున దీనికంతటికి
ఆత్మయే కర్తగా భావన చేసెడి
కుమతికి వాస్తవ విషయము తెలియదు.

17. నేను కర్తనని తలచనివాడు,
కర్మల తగులము లంటనివాడు,
ప్రాణులన్నిటిని చంపినప్పటికి
చంపుట లేదు, పాపమంటదు.

18. జ్ఞానము జ్ఞేయము పరిజ్ఞాతయని,
కర్మచోదన మూడు విధములు;
కర్త కర్మ కరణమనియును
కర్మసంగ్రహము మూడు విధములు.

19. జ్ఞానము, కర్మ, కర్తయు, వాని
గుణముల చేత మూడు విధములని
సాంఖ్య శాస్త్రమున చెప్పబడినవి
ఆ విషయమునూ చెప్పెద వినుము.

20. వేఱుగ వున్నను, సకల జీవుల
నాశరహితమగు భావమొక్కటే!
అను జ్ఞానముతో వానినొకటిగా
చూచెడి జ్ఞానము సాత్త్వికమందురు.

21. వేఱువేఱుగ వున్న ప్రాణులను,
వివిధ భావములు కలవానిగను,
మరి ఆ జీవులు వేఱువేఱని
తలచు జ్ఞానము రాజస జ్ఞానము.

22. ఒకే కార్యమున అంతయు కలదని,
తగిన కారణము లేక తగులుకొని,
తత్త్వము తెలియని అల్పజ్ఞానమును
తామస జ్ఞానముగా చెప్పుదురు.

23. సంగరహితుడై, రాగ ద్వేషము,
ఫలాపేక్షయును లేని మనుజుడు
శాస్త్ర విహితముగ చేసెడి కర్మను
సాత్త్విక కర్మము అని చెప్పెదరు.

24. కర్మ ఫలములు పొందుట కోసము,
అహంకారముతో, అధిక ప్రయాసతో
చేయబడుచున్న ఆ కర్మలను
రాజస కర్మములని చెప్పెదరు.

25. కర్మల వలన కాగల నష్టము,
కలిగెడి హింసను, తన సమర్థతను
ఆలోచించక, అవివేకముతో
చేసెడి కర్మను తామసమందురు.

26. సంగము విడిచి, అహమును మరచి,
ధైర్యము నుత్సాహమ్మును కలిగి,
సిద్ధించిన, సిద్ధింపకున్ననూ
కలవర పడని కర్త సాత్త్వికుడు.

27. కర్మ ఫలములాశించెడి అశుచి,
రాగియు, లోభియు, హింసాత్మకుడు
పొందిన హర్షము, పొందక దుఃఖము
పొందెడు కర్తను రాజసుడందురు.

28. మనో నిగ్రహము లేని వాడును,
పొగరుబోతును, టక్కరి, సోమరి,
ఏడుపుగొట్టు, దమ్ముడు, నాన్చుడు
ధోరణి కలిగిన కర్త తామసుడు.

29. బుద్ధి ధైర్యముల మధ్య భేదమును,
గుణముల బట్టి మూడువిధములుగ
విడి విడిగాను, సంపూర్ణముగా
చెప్పెద వినుము ఓ ధనంజయా!

30. పార్థ! ప్రవృత్తి నివృత్తి సంగతులు,
చేయ దగినవి, చేయ కూడనివి,
భయాభయాలు, బంధము, మోక్షము
ఎరిగెడి బుద్ధి సాత్త్వికమైనది.

31. అర్జున ! ధర్మా ధర్మ సంగతులు,
చేయదగినవి, చేయకూడనివి,
ఉన్నదున్నటుల తెలియగ లేని
బుద్ధిని రాజస బుద్ధి అందురు.

32. అజ్ఞానముచే ఆవరింప బడి,
ధర్మమునే అధర్మమనుచును,
ప్రతి విషయమును ప్రతికూలముగా
తలచెడి బుద్దిని తామసమందురు.

33. నిశ్చలమైన ధైర్యము కలిగి,
మనసు, ప్రాణము, ఇంద్రియ క్రియలను
యోగ సాధనచే నిలువరించగల
ధైర్యము సాత్త్వికమైనదర్జునా !

34. ధర్మార్థ కామములందాసక్తిని,
కర్మఫలము లందాశను కలిగి,
ధైర్యముతోడ ననుష్ఠించెడి
ధైర్యము రాజస మైనదర్జునా!

35. పాడు బుద్ధితో కూడినవాడు,
ఏ ధైర్యముతో నిద్ర, భయము,
శోకము, మదము, బెంగను వీడడో
ఆ ధైర్యమును తామసమందురు.

36. దుఃఖ నాశమును, ఆనందమును
అభ్యాసముతో లెస్సగా పొందెడి
సుఖమును, నేను మూడు విధములుగ
చెప్పెద నిప్పుడు వినుము అర్జునా!

37. ఆరంభములో విష ప్రాయముగా,
చివరికి సుధను బోలిన సుఖముగ,
సుద్దిగ నున్న బుద్ధిన అలరే
ఆ సుఖంబును సాత్త్విక మందురు.

38. ఇంద్రియవిషయపు సంయోగముచే
తొలుత అమృతము లాగ వున్ననూ,
కాలము గడవగా, విషముగ మారెడు
సుఖమును రాజసమందురు విబుధులు.

39. సోమరితనము, నిద్ర, అజాగ్రత్త
వలన కలిగెడు సుఖము నరునికి
ఆద్యంతమును మోహము నిచ్చును;
అట్టి సుఖమును తామసమందురు.

40. ప్రకృతినుండి పుట్టినవగు యీ
మూడు గుణములు లేని వస్తువు,
భూలోకమున, సురలోకమున
దేవతలందున దొరకదు సుమ్మీ!

41. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు,
వారి స్వభావము వలన కలిగిన
గుణముల బట్టి, వారి కర్మములు
విభజన చేయంబడెను అర్జునా !

**42.** శమము, దమము, తపము, శౌచము,
ఓర్పు, నడవడి, శాస్త్ర జ్ఞానము,
అనుభవ జ్ఞానము, ఆస్తికత్వమును
సహజమైనవి బ్రాహ్మణ కర్మకు.

**43.** శౌర్యము, తేజము, ధైర్యము, శక్తి,
దానధర్మములు, ప్రభుస్వభావము,
యుద్ధ రంగమున నిలబడి పోరుట
సహజమైనవి క్షత్రియ కర్మకు.

**44.** గోరక్షణము, కృషి, వర్తకము
సహజమైనది వైశ్య కర్మకు;
సేవాపరమగు కర్మము చేయుట
శూద్రునకు స్వభావ సిద్ధము.

**45.** తన స్వభావపు కర్మల నరుడు
శ్రద్ధ చూపినచో సిద్ధి పొందును;
ఏ విధముగ నా స్వకర్మ నిరతులు
సిద్ధి పొందెదరో చెప్పెద వినుము.

**46.** సకల ప్రాణులకు జీవ కర్తయై,
సమస్త విశ్వమునావరించిన
వానిని, మనుజుడు తన కర్మముచే
ఆరాధించి సిద్ధిని పొందును.

**47.** తనధర్మము గుణరహితమైనను
పరధర్మమ్మున కంటె శ్రేష్ఠము;
తన ధర్మమును చక్కగా చేసిన
పాపము నాతడు పొందజాలడు.

48. దోషములున్నను సహజ కర్మమును
విడుచుట తగదు ఓ కౌంతేయా!
అగ్నిని ధూమము కప్పిన చందము
దోషము కర్మల కప్పుచున్నది.

49. విషయములందున లంపట లేక,
మనసును గెలిచి ఆశలు విడిచి,
సన్న్యాసముచే మనుజుడు గొప్ప
నిష్క్రియ సిద్ధిని పొందుచుండును.

50. పరమ సిద్ధిని పొందిన మనుజుడు
పరబ్రహ్మము పొందిన విధముగా,
జ్ఞానముయొక్క పరమ నిష్ఠను
సంక్షిప్తముగా చెప్పెదనర్జునా!

51,52,53.
నిర్మలమైన బుద్ధిని కలిగి,
ధైర్యముగ తన మనసును ఆపి,
శబ్దాదులను రాగ ద్వేషములు
పరిత్యజించి, మితాహారియై,

ఏకాంతమున నివసించుచును,
మేను మనసు మాటను అణచి,
ఎప్పుడూ ధ్యాన యోగమునందు
వైరాగ్యము కడు నవలంబించి,

అహమనురాగము, బలము, దర్పము,
కామక్రోధములు, వస్తు వాంఛలు
పూర్తిగ విడిచిన శాంత చిత్తుడు
బ్రహ్మ స్వరూపి యగుట కర్హుడు.

**54.** బ్రహ్మస్వరూపి, ప్రసన్నాత్ముడు
దేనికి వగవడు, దేనిని కోరడు;
సర్వభూతసమబుద్ధియుక్తుడు
శ్రేష్ఠమైన నా భక్తిని పొందును.

**55.** భక్తిచేత, వాస్తవముగా నేను
ఎంతటి వాడనో, ఎట్టివాడనో,
యథార్థముగ నను తెలిసినవాడై,
తదుపరి నాలో లయము చెందును.

**56.** సకల కర్మలను సతతము చేయుచు,
నా శరణమునే కోరిన మనుజుడు,
నా దయ వలన నాశరహితమగు
శాశ్వతమైన మోక్షము పొందును.

**57.** సకల కర్మలను నా కర్పించి,
మనసున నన్నే పరముగ నెంచి,
బుద్ధియోగమును అవలంబించి
చిత్తమునెప్పుడు నాయందుంచుము.

**58.** చిత్తము నాకు సమర్పించినచో,
నా దయ చేత, అన్ని దుర్గములు
తరించగలవు; అహంకారమున
మాట విననిచో నాశమొందెదవు.

**59.** అహంకారమును అవలంబించి
పోరు చేయనని తలచెదవేని,
నీ ప్రయత్నము వ్యర్థమే అగును;
ప్రకృతియే నిను నియోగించును.

60. అంతఃప్రకృతి ననుసరించిన
కర్మ నిబద్ధత వలనన్నీవు
యుద్ధము చేయుట కిష్టము లేకను
విధి వశంబున పోరు చేసెదవు.

61. తనదగు మాయచే పరమేశ్వరుడు,
రంగులరాట్నము పైన ఎక్కిన
వారి చందమున జీవుల త్రిప్పుచు
ప్రాణుల గుండెల లోన ఉండును.

62. అన్ని భావముల నా యీశ్వరునే
శరణు కోరుము ఓయి భారతా!
ఆతని దయతో పరమశాంతిని,
శాశ్వత మోక్ష స్థాన మొందెదవు.

63. రహస్యములలో నతి రహస్యమగు
జ్ఞానము నీకు నుడివితినర్జున!
దీనిని పూర్తిగా విమర్శించుకొని
నీకు నచ్చిన విధముగ చేయుము.

64. రహస్యములలో పరమ రహస్యము
పరమ వచనమును మరలా వినుము!
నాకు మిక్కిలి యిష్టుడవగుటచే
హితము కోరి నే చెప్పుచుంటిని.

65. నన్మది నిలిపి నాభక్తుడవగు!
నను పూజించి నమస్కరించిన,
నన్నె పొందెదవు; నాకిష్టుడవని
నిజముగ నీకు ప్రతిన చేసితిని.

66. ధర్మములన్నీ విడిచిపెట్టుము,
నన్నొక్కడినే శరణు వేడుము;
పాపములన్నిటినుండీ నిన్ను
విడిపించెదను, శోకింపకుము.

67. నీకు చెప్పిన దంతయు నెపుడును
తపస్సు భక్తి లేనివానికి,
వినుటకు యిష్టము లేని వానికి,
నను దూషించెడి వానికి చెప్పకు.

68. పరమ రహస్యంబైన దీనిని
నా భక్తులకు చెప్పినవాడు,
నా యందే కడు భక్తిని కలిగి
నన్నే పొందును నిశ్చయమ్ముగ!

69. ఆతని కంటెను నాకు ప్రీతిని
కొల్పెడి మనుజుడు లేనే లేడు
ఆతని కంటెను ఎక్కువ యిష్టుడు
భువిలో నాకు నెవ్వడు దొరకడు.

70. మనలో జరిగిన ధర్మయుక్తమగు
ఈ సంవాదము చదివెడువాడు
జ్ఞానయజ్ఞమున నను పూజించిన
వాడే అగునని నా అభిమతము.

71. శ్రద్ధను కలిగి, అసూయ విడిచి,
దీనిని తాను వినిన మాత్రమున
నరుడు ముక్తుడై పుణ్యకర్ములు
నివసించెడి లోకమును పొందును.

72. నేను చెప్పినదంతయు నీవు
ఏకాగ్రతతో విన్నావు కదా!
అజ్ఞానమున కలిగిన మోహము
పార్థా! పూర్తిగా తొలగి పోయెనా ?

73. నీ దయ వలన అచ్యుత! నాకు
మోహము తొలగెను జ్ఞానము కలిగెను;
అరమర లేదిక నీ ఆనతిని
పాటించెదనని పలికె పార్థుడు.

74. ఈ విధముగనా శ్రీకృష్ణునికి
పార్థుని మధ్య జరిగిన అద్భుత
రోమాంచితమగు సంవాదమును
వింటిని నేను అనెను సంజయుడు.

75. వ్యాసుని దయతో రహస్యమైన,
శ్రేష్ఠమైన యీ యోగ శాస్త్రమును
స్వయముగ యోగేశ్వరుడు కృష్ణుడు
చెప్పగ నేను నేరుగా వింటిని.

76. ఓ రాజా ! నేనద్భుతమైన
కేశవార్జునుల సంవాదమును,
మాటి మాటికీ గుర్తు తెచ్చుకొని
ఆనందమును పొందుచుంటిని.

77. ఓ మహారాజ! శ్రీహరి యొక్క
అద్భుత రూపము తలచీ తలచి,
మహాశ్చర్యమున మాటి మాటికీ
మహానందము కలుగుచున్నది.

78. ఎచ్చట యోగేశ్వరుడగు కృష్ణుడు,
ధనువు ధరించిన పార్థుడుందురో,
అచ్చట నీతి, సిరి, విజయమును,
ఐశ్వర్యమును కలుగుట తథ్యము!!!

ఓం తత్ సత్

అష్టాదశాధ్యాయం సమాప్తం

శ్రీమత్ భగవద్గీతానువాదం సమాప్తం